ఆంధ్రమహిళ

AM-JUN-1955-12-2



JUNE '55 ANDHRA MAHILA ANNAS 8

ఆంధ్ర మహిళా సభ

మైలాపూర్ మద్రాసు

మహిళా విద్యాలయము	: హిందీ. కాశీ విశ్వవిద్యాలయపు ఎడ్మిషన్, ఇంటర్ మీడియెట్, ఇ.యస్.ఎల్.సి., పరీక్షలకు శిక్షణ.
పారిశ్రామిక విద్యాలయము (గవర్నమెంటువారిచే రికగ్నైజ్ చేయబడినది)	: కుట్టు, ఎంబ్రాయిడరీ, ఊలుఅల్లికలు, నూలు వడకుట, చేనేత, అచ్చుకూర్పు, ముద్రణ, బైండింగ్ ఇత్యాది పరిశ్రమలలో గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ. బీద విద్యార్థినులకు ఉచితము.
పారిశ్రామిక శిక్షణ కేంద్రము	: భారత ప్రభుత్వ పునరావాసశాఖవారిచే, 7-ఎ రోజరీ చర్చి రోడ్డులో ఆంధ్రమహిళా సభ పారిశ్రామిక భవనములలో వస్త్రములపై అద్దకపుపని, మిషనుకుట్టు, మిషను అల్లిక, చేనేత, బుక్ బైండింగు, ఎంబ్రాయిడరీ మొదలగు పరిశ్రమలలో శిక్షణ ఇవ్వబడుచున్నది.
టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్	: స్త్రీలకు టైపు,—గవర్నమెంట్ పరీక్షలకు శిక్షణ.
మహిళా మందిరము	: స్త్రీవిద్యార్థినులకు వసతిగృహము.
ఆంధ్ర మహిళ	: స్త్రీలలో విద్యావ్యాప్తికై, స్త్రీలచే నడుపబడుచున్న సచిత్ర మాసపత్రిక.
నిర్మలాదేవి గ్రంథాలయము	: సభ్యురాండ్ర, విద్యార్థినుల ఉపయోగార్థము సేకరించిన తెలుగు, హిందీ, ఆంగ్ల గ్రంథ సముదాయము.
నర్సింగ్ హోమ్	: స్త్రీశిశుపులసంరక్షణశాల, ప్రసూతిశాల, ఉచిత వైద్యశాల— అడయారులో నిర్మించబడినవి. భారత ప్రభుత్వ ఆరోగ్యశాఖవారి విధానాన్ని అనుసరించి, సంక్షిప్త నర్స్‌ఎయిడ్— మంత్రసాని పనులలో శిక్షణ యివ్వబడుచున్నది.
ముద్రణశాఖ	: ఆంధ్ర మహిళా సభవారిచే స్వంతంగా స్థాపించబడినది. విద్యార్థినులకు అచ్చుకూర్పు, బైండింగు, ప్రూఫ్ రీడింగు, మొదలైనవి ఉచితంగా నేర్పబడును.
సంక్షేమ విస్తరణ కార్యక్రమం	: నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట తాలూకాలో మెటర్నిటీ, శిశు సంక్షేమ కేంద్రములు నిర్వహింపబడుచున్నవి.

క్రీడలు క్లబ్బు శాఖలలో

సభ్యురాండ్రుగా జేరి, యీ జాతీయ సంస్థను పోషించండి.

ఆంధ్ర మహిళ

వ్యవస్థాపకురాలు :

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

ఎం.ఎ., బి.ఎల్.,

సంపాదకురాలు :

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

బి. ఏ.

సంవత్సర చందా ఆరు రూపాయలు

ఆంధ్ర మహిళా సభవారిచే స్థాపించబడిన ముద్రణాలయములో

ముద్రితము.

ఆంధ్రమహిళ

సంపుటి 12 :: జూన్ '55 :: సంచిక 2

ఇంకా సంక్షేమం, పాకకళ, ప్రథమ చికిత్స మున్నగు విషయములు

సంవత్సరచందా :: :: ఆరు రూపాయలు.

వ్యవస్థాపకురాలు : శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపాదకురాలు : శ్రీమతి లక్ష్మీరఘురామ్

ముద్రణ :
ఆంధ్ర మహిళా ప్రెస్.

ఆంధ్రమహిళ

సంపుటి 12 :: జూన్ '55 :: సంచిక 2

ఫిల్ము సెన్సారింగు

మొన్న కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ దేభారు గారికి అరువది నలుగురు పార్లమెంటు సభ్యులు, ఫిల్మ్ సెన్సార్లు మరింత ఖచ్చితంగా ఫిల్ములను సెన్సారు చేయవలయునని విజ్ఞప్తి చేసుకున్నట్లు, ఆపైని యూనియన్ రేడియో సమాచార శాఖ మంత్రి డాక్టరు బి. వి. కేస్కరుగారు మున్ముందు ఫిల్మ్ సెన్సారింగు కఠినముగా వుండగలదని సూచించినట్లు తెలియుచున్నది. స్క్రిప్టు స్టేజీలోనే సెన్సారింగు జరుగవలసినదిగా సూచించినట్లుకూడా తెలియుచున్నది.

ఈవిషయాలు కొంతమంది ఫిల్మ్ డైరెక్టర్లకు అగ్గిమీద గుగ్గిలమువలె వుండగలవేమో. ఫిల్మ్ సెన్సారింగు విషయములో అనేక పర్యాయములు ఇదివరలో తర్జన భర్జనలు జరిగినవి. కొంతమంది డైరెక్టర్లు ఫిల్మ్ సెన్సారు బోర్డును అకారణముగా నిందించి నోరు పారేసుకున్న సందర్భాలు లేకపోలేదు. ఎందుచేతనో పాపము కొంతమంది ఫిల్మ్ డైరెక్టర్లకు ఫిల్మ్ సెన్సార్లను చూస్తేనే తలనొప్పి. వారేదో వృథాగా కత్తిర చేత బుచ్చుకొని తమ ఇచ్చవచ్చిన రీతిని కత్తిరించుతూ తమకున్న అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే భ్రమ లేకపోలేదు.

ఫిల్మ్ సెన్సార్ల విషయములో డైరెక్టర్లకున్న అపోహలు సమంజసములుకావు. సెన్సార్లవల్ల ప్రేక్షకులకు కలుగనున్న లాభము నిర్వివాదాంశము. ఒక్కొక్క తరి సెన్సార్ల కత్తిరింపులవల్ల కొన్ని ఫిల్ములు ఎక్కువ రాణించిన ఉదాహరణలు లేకపోలేదు. ఈ ఫిల్మ్ సెన్సారింగు విషయములో మహిళలు తమ అభిప్రాయములను ఈమధ్య కొన్ని వేలమంది గృహిణులచేత సంతకము చేయబడ్డ విజ్ఞాపనలో తేట తెల్లముగా తెలిపియేయున్నారు.

ఫిల్మ్ సెన్సారింగు ఉచితరీతిని కఠినముగా జరుగుట ఎంతేని వాంఛనీయము, స్క్రిప్టు స్టేజిలో ఒకసారి- ప్రస్తుతము జరుగుచున్నట్లే విడుదల చేయకముందు మరొకసారి. రెండుసార్లు ఒక్కొక్క ఫిల్మ్ సెన్సారింగు జరుగుటవల్ల ప్రేక్షకులకు ఫిల్మ్ డైరెక్టర్లకు కూడా చాల లాభము గలదు. ఫిల్మ్ డైరెక్టర్ల కష్టనష్టములు చాల వరకు తగ్గగల అవకాశమున్నది.

సెన్సారింగే వలదని అలజడి చేయుటకన్న సెన్సారుబోర్డు సభ్యుల సెలక్షను విషయములో ఏవైన నిర్మాణాత్మకమైన, యుక్తమైన, ఉపయోగమైన సలహాలున్న యెడల డైరెక్టర్లు చెప్పనూవచ్చును. ప్రభుత్వము విననూవచ్చును.



శ్రీమతి పొణకా కనకమ్మ

సుమారు నలభై సంవత్సరాల నుంచి ఆంధ్రదేశంలో గ్రంథాలయోద్యమం, హరిజనోద్యమం, హోమ్‌రూల్, సహాయనిరాకరణోద్యమం, మహిళాకాంగ్రెస్, మొదలగు అనేకరంగాలలో విశేష కృషిచేసి, కస్తూరీదేవి విద్యాలయమును స్థాపించి, భాషాసేవ కావిస్తూఉన్న ఆంధ్ర మహిళామణి. 1955 సం॥లో గృహలక్ష్మీస్వర్ణకంకణం వీరికి సమర్పింప బడినది.



రాజకీయాలు

శ్రీ గోళ్ళమూడి రామచంద్రరావు

విడాకులు మొదలైన ఏర్పాట్లుగల హిందూ వివాహాల బిల్లును మే నెల 5 వ తేదీన పార్లమెంటు ఆమోదించింది.

1955 ఏప్రిల్ నాలుగో వారం మొదలుకుని మే నెల మూడో వారం వరకూ చాలా ప్రముఖ సంఘటనలే జరిగినవి. వాటిలో చెప్పుకోతగ్గవి ఇవి — యుగోస్లావియా నాయకులతో సంప్రదించటానికి రష్యన్ నాయకులు నిశ్చయించటం, ఆయుధాల తగ్గింపు మొదలైన సమస్యల మీద రష్యా కొత్త ప్రతిపాదనలు చేయటం, ఇండియా, పాకిస్థాన్ ప్రధానులు కాశ్మీర్ మొదలైన సమస్యల మీద సంప్రదించటం, ఫార్మోజా విషయమై కృష్ణమీనన్ చైనా నాయకునితో సంప్రదించటం, బంజరు భూముల అమ్మకాన్ని వినోబాభావే నిరసించటం, హిందూ వివాహాల బిల్లును పార్లమెంటు ఆమోదించటం, గోవాసత్యాగ్రహం.

♦ ♦ ♦

సోవియట్ యూనియన్ అగ్రనాయకులు ప్రధాని బుల్గనిన్, ఉపప్రధాని మికోయన్, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి క్రుష్‌చేవ్, ప్రావ్డా పత్రిక ప్రధాన సంపాదకుడు మొదలైనవాళ్ళు మేనెలాఖరులో యుగోస్లావియా వెళ్ళబోతున్నారు. వీళ్ళక్కడ యుగోస్లావ్ అధ్యక్షుడు టిటోతోను, తదితర అగ్రనాయకులతోను సంప్రదించబోతున్నారు. ఉభయదేశాల మధ్య సంబంధాలు బలపరుచుకునేందుకు తాము వెడుతున్నామనీ, శాంతియుత సహజీవనం తమ ఆశయమనీ క్రుష్‌చెవ్ ప్రకటించారు.

ఏడు సం॥ల కిందట యుగోస్లావియా కొమిన్‌ఫార్మ్ వైఖరితో ఏకీభవించక, అందులోనుంచి చీలిపోయింది. తక్షణం పశ్చిమ రాజ్యాలు యుగోస్లావియాకు అడిగిన సహాయమల్లా చేసి, చాలావంకు తమవైపుకి తిప్పుకున్నవి. చివరకు యుగోస్లావియా అట్లాంటిక్ ఒప్పందపు దేశాలయిన గ్రీస్, టర్కీలతో రక్షణ ఒప్పదంకూడా చేసుకున్నది.

కాని ఈలోపుగా, యుగోస్లావియా విధానం కొద్దికొద్దిగా మళ్ళీ మారటం మొదలు పెట్టింది. అగ్రరాజ్యాల వివాదాల్లో తటస్థంగా ఉండటం మంచిదని గ్రహించి, దానిని అనుసరించటం మొదలు పెట్టింది. దీని ఫలితంగా తిరిగీ రష్యా యుగోస్లావియాతో రాయబార సంబంధాలు నెలకొల్పుకొనటం జరిగింది. తటస్త విధానంలో కూడా ఇండియావలె పూర్తి తాటస్థ్యాన్ని అనుసరించాలన్న ప్రయత్నాలు మొదలుపెట్టింది. అందుకని టిటో ఇండియా బర్మా ఈజిప్టులకు వచ్చి వెళ్ళటం జరిగింది.

టిటో ఇండియా బర్మాలలో పర్యటిస్తున్నప్పుడు యుగోస్లావియాలో ఒక సంఘటన జరిగింది. యుగోస్లావ్ కమ్యూనిస్టు పార్టీ ప్రముఖులిద్దరు పార్టీనుంచి బహిష్కరించబడ్డారు. వాళ్ళు పార్టీవిధానాలను—టిటో విధానాలను ప్రతిఘటించారు. యుగోస్లావియా తిరిగి తోటి కమ్యూనిస్టు దేశాలతో కలిసిమెలిసి ఉండాలన్నకోరిక ఆదేశంలో తిరిగి బయలు దేరింది. ఈ అదను చూసుకుని, రష్యా నాయకులు యుగోస్లావియాను మంచి చేసుకునేందుకు బయలు దేరుతున్నారు.

ఈవార్త వినగానే పశ్చిమ రాజ్యాలు చాలా విభ్రాంతి పొందినవి. ఆందోళన వెల్లడించినవి. యుగోస్లావియా కమ్యూనిస్టు కొలువులో జేరదనీ, స్వతంత్ర విధానాన్నే అనుసరిస్తూ ఉంటుందనీ టిటో ప్రకటించినప్పటికీ వాటికి నమ్మకం చిక్కటంలేదు. ఆస్ట్రియాను తటస్థంగా ఉంచ

గలిగినట్లే యుగోస్లావియాను కూడా పూర్తిగా తటస్థంగా ఉండేటట్లు రష్యా చేయవచ్చునని భయపడుతున్నారు.

రష్యా నాయకుల కృషివల్ల యుగోస్లావియా సంపూర్ణ తాటస్థ్యాన్ని అనుసరించటమే కాక, తిరిగీ కమ్యూనిస్టు రాజ్యాలకు దగ్గరగా చేరవచ్చునేమోనని చెప్పటానికి కారణాలు కొన్ని కనిపిస్తున్నవి. యుగోస్లావ్ నాయకుడు టిటో మే 21 న స్లోవాకియా రాష్ట్రంలో మాట్లాడుతూ, దేశం విదేశసహాయం తీసుకోవలెనా, లేక సాటి (కమ్యూనిస్టు కూటమి) లోకి పోవలెనా తేల్చుకొనటం అవసరమని భావించే ప్రజలు చాలామంది ఉన్నారు. వాళ్ళకు నేనిచ్చే జవాబు-ఏమిటంటే "విదేశం సహాయం తీసుకుంటూనే స్వతంత్రంగా ఉండవచ్చును" అని ఉద్ఘాటించారు. ఈ ప్రసంగం దేశంలో కలిగిన కదలికను చూపిస్తున్నది.

రష్యన్ ప్రతినిధివర్గానికి నాయకత్వం వహిస్తున్నది కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి క్రుష్‌చేవ్‌కాని, ప్రధాని బుల్గనిన్‌కాదు. ఈ ప్రతినిధివర్గంలో రష్యన్ కమ్యూనిస్టు పార్టీ పత్రిక ప్రావ్దా ప్రధాన సంపాదకుడు ఉన్నాడు— అందువల్ల రష్యన్ నాయకుల ప్రయత్నాలు సిద్ధాంతరీత్యా యుగోస్లావియాను ఆకర్షించటానికి ఉద్దేశించబడ్డవన టంలో అనుమానించనక్కర్లేదు. ఈసమావేశ ఫలితంగా లోగడ కొమిన్‌ఫారంను లేవని యుగోస్లావ్ కమ్యూనిస్టు పార్టీ అనుసరించిన సూత్రాలు కొన్నిటిని రష్యా ఆమోదించినా ఆశ్చర్యం అక్కర్లేదు.

◆ ◆ ◆

ప్రస్తుతం ప్రపంచ వైరుద్ధ్యాల్లో తటస్థదేశాల ప్రాధాన్యతను రష్యా పశ్చిమరాజ్యాలకన్నా ముందర గుర్తించింది. అందువల్లనే ఆసియా, ఆఫ్రికాల తాటస్థ్యాన్ని హృదయపూర్వకంగా ప్రోత్సహించింది. జెనీవాసభ ఇండోచైనా రాజ్యాల తాటస్థ్యాన్ని సాధించింది. బాండుంగ్ సభ ఆసియా, ఆఫ్రికాలలో తటస్థప్రాంతాన్ని విస్తరింప జేసింది. ఆ తరవాత రష్యా ఆస్ట్రియా తాటస్థ్యాన్ని సాధించింది ఇప్పుడు యుగోస్లావియా, జర్మనీల తాటస్థ్యాన్నికూడా సాధించటానికి ప్రయత్నిస్తున్నది.

◆ ◆ ◆

ఆయుధాల తగ్గింపుసమస్యపై నాలుగు అగ్రరాజ్యాలు లండనులో సంప్రదిస్తున్న సమయంలో, మే 10 వ తేదీన, రష్యా ప్రతినిధి మాలిక్ కొన్ని సూచనలుచేశారు. అందులో ముఖ్యమైనవి ఇవి—

1. అణ్వస్త్రాలను, పెద్ద ఎత్తున జననాశనం చేసే ఇతర ఆయుధాల ఉపయోగాన్నీ, ఉత్పత్తినీ, నిలవచేయటాన్నీ నిషేధించాలి.

2. రష్యా, అమెరికా, చైనాలకు ఒక్కొక్కదాని సాయుధ బలాల పరిమితి పది పదిహేను లక్షలుగా నిర్ణయించాలి. బ్రిటన్, ఫ్రాన్సులకు చెరి 6½ లక్షలు బలం పరిమితిగా నిర్ణయించాలి.

3. ఈ పరిమితికి పైగా ఉన్న బలాల్లో సగం బలాలను తగ్గించటం, అణ్వస్త్రాల పరీక్షలు నిలిచిపోవటం 1956 లో జరగాలి. 1956 లోనే విదేశాల్లో ఈదేశాలకు ఉన్నస్థావరాలను. సాయుధ బలాలను తొలగించివేయ అంగీకరించాలి.

4. 1957 లో పరిమితులకు పైగా ఉన్న సాయుధ బలాల్లో మిగిలిన సగాన్ని తగ్గించాలి. అణ్వస్త్రాల ఉత్పత్తినే నిలిపివేయాలి. విదేశాల్లో సైనికస్థావరాలను తొలగించివేయాలి.

5. ఈ షరతులు అమలు జరిగేట్లుగా 1956 లోనే అంతర్జాతీయ అజ్మాయిషీసంఘం ఒకటి అన్నిదేశాలలోనూ స్వయంగా అజ్మాయిషీ జరపాలి. అన్నిరేవులు, రైల్వే జంక్షనులు, సైనిక స్థావరాలు, వీనిలోకి, దీనికి ప్రవేశం ఉండాలి. సేనల కేంద్రీకరణనుకూడా ఇది కనిపెట్టి ఉండాలి.

6. జర్మనీ విషయమై ఒప్పందం కుదిరేలోపల ఉభయ ప్రాంతాలనుంచీ ఆక్రమణ సేనలు ఉపసంహరించబడాలి. కేవలం రక్షణకు కావలసిన కనీస బలాలను ఉంచవచ్చు

ఈ ప్రతిపాదనలను పశ్చిమరాజ్యప్రముఖులు, ఐక్యరాజ్యసమితి ప్రముఖులుకూడా గొప్ప సూచన అని ప్రశంశించారు. క్రమ క్రమంగా ఈవిధంగా అంతర్జాతీయ వైరుద్ధ్యం తగ్గుతూ వస్తున్నందువల్ల అగ్రరాజ్యనాయకులైన ఐసెన్‌హోవర్, బుల్గనిన్, ఫ్రెంచి ప్రధాని ఫోర్, బ్రిటిష్ ప్రధాని సమావేశం కావాలని పశ్చిమరాజ్యాలు ప్రతిపాదించగా రష్యా అంగీకరించింది. రష్యా మొదటి నుంచీ చేస్తున్న ఈ సూచన చివరకు అమెరికా ఆమో

దాన్ని పొంది, పశ్చిమరాజ్యాలే ప్రతిపాదన జరిపేట్లు చేసింది. సమావేశస్థలం, కాలం ఇంకా నిర్ణయంకాలేదు.

మే నెల 5 వ తేదీన పశ్చిమ జర్మనీకి సర్వతంత్ర స్వతంత్ర ప్రతిపత్తి వచ్చింది. కాని జర్మన్ విభజనవల్ల జర్మన్ ప్రజలు దీనికి సంతోషించలేకపోయినారు. వాళ్ళకు మాలిక్ ప్రతిపాదన చాలా సంతోషం కలిగించి ఉంటుంది.

♦ ♦ ♦

మే నెల మూడో వారంలో సమితిలో భారత ప్రతినిధిగా ఉన్న కృష్ణమీనన్ పెకింగ్ వెళ్ళి చైనా నాయకులతో ఫార్మోజా సమస్యపై చర్చించారు. ఈ సంప్రతింపులు అమెరికా, చైనా సంప్రదింపులకు దారి తీయ వచ్చును.

♦ ♦ ♦

మే నెల మూడో వారంలోనే ఇండియా, పాకిస్థాన్ ప్రధానులు ఢిల్లీలో కలుసుకుని కాశ్మీర్ మీదనూ, ఇతర వివాదాంశాలమీదనూ చర్చించారు. కాశ్మీర్‌మీద తిరిగీ సంప్రదింపులు జరుపుతామని ప్రకటించారు.

జనవాక్యం ఒక్కటే కాశ్మీర్ సమస్యను పరిష్కరించ గలదని పాకిస్థాన్ వర్గాలుకూడా ఈనాటికి గుర్తించినవి. దానికిగల ఆటంకాలను తొలగించుకునేందుకు పాక్ ప్రధాని మహమ్మద్ అలీ ప్రయత్నించారు. జనవాక్య నిర్వాహకుడు ఒక చిన్న తటస్థదేశపు ప్రతినిధి అయి ఉండాలన్న ఇండియా సూచనకు సమ్మతి తెలిపాడు.

మహమ్మద్‌అలీ ఢిల్లీ రావటానికి ముందుగానే, కాశ్మీర్‌లో పాకిస్థానీ సైనికులు సరిహద్దులు దాటివచ్చి భారతీయులను 12 మందిని చంపివేశారు. ఇందులో పాకిస్థాన్‌వాళ్ళదే తప్పని సమితి పర్యవేక్షకులు తీర్పు చెప్పారు. దీనికి పాక్ ప్రధాని విచారం తెలియజేశారు. సరిహద్దు సంఘటనలు నివారించే నిమిత్తం ఉభయులూ సరిహద్దుల్లో సేనలను తగ్గించుకోవాలని ఉభయప్రభుత్వాలూ ఒప్పందం కుదుర్చుకున్నవి. దీనిని చిత్తశుద్ధితో అనుసరిస్తే, జనవాక్య నిర్వహణకు కాశ్మీర్‌నుంచి బలాలను తగ్గించుకోవాలని గుర్తించి తగ్గించుకుంటే, కాశ్మీర్ సమస్య పరిష్కారం అవుతుంది.

* * *

ఫఖ్తూనిస్థాన్ సమస్యనుకూడా జనవాక్యం ద్వారా తేల్చి వేయాలని ఆఫ్‌గనిస్థాన్ పాకిస్థాన్‌ను కోరుతున్నది కాని 1947 లో బ్రిటిష్ అధికారులు జరిపిన జనవాక్యమే ఖాయమని పాక్ అధికారులు వాదిస్తున్నారు. ఆ జనవాక్యంలో స్వతంత్ర ఫఖ్తూనిస్థాన్ ప్రస్తావనేలేదుట. అసలు కారణం ఇదయి ఉండి, జండాలను అవమానించుకొనటంలో రెండుదేశాల సంబంధాలు చాలా చెడిపోయినవి. ఇరాక్, అరేబియా మొదలైన దేశాలు మధ్యవర్తిత్వం జరుపుతున్నవి.

* * *

పాకిస్థాన్ తన సొంత భవిష్యత్తును గురించికూడా జనవాక్యం జరుపుకోవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నవి. రాజ్యాంగాన్ని తయారుచేసేందుకు గవర్నర్ జనరల్ కొత్త సభను సమావేశ పర్చబోతున్నాడు. దీనికి ఫెడరల్ కోర్టు అనుమతించింది. ఇందులో తూర్పు, పశ్చిమ పాకిస్థాన్‌లకు సమాన స్థానాలివ్వబడతాయి. అయితే ప్రతినిధుల ఎన్నిక విషయమై కేంద్రానికీ, పంజాబ్ రాష్ట్రానికీ అభిప్రాయభేదం వచ్చి, పంజాబ్ ముఖ్యమంత్రి నూన్ మంత్రి వర్గం గవర్నరుచేత బర్తరఫ్ చేయబడ్డది.

* * *

మే నెల 18 వ తేదీన గోవా, దమాన్ ప్రాంతాల్లో ఇండియా ప్రాంతాలనుంచి వెళ్ళిన భారతపౌరులు సత్యాగ్రహం జరిపారు. ఇదివరకు భారతీయులను వెళ్ళకుండా అడ్డగించిన భారతప్రభుత్వం ఈతడవ అడ్డగించలేదు. గోవా అధికారులు సత్యాగ్రహులపై కాల్పులు జరిపి, అమానుషంగా హింసిస్తున్నారు. దేశమంతటి నుంచీ సత్యాగ్రహులు అక్కడికి బయలుదేరుతున్నారు. వ్యవహారం త్వరలోనే తేలిపోయే సూచనలు కనిపిస్తున్నవి.

* * *

బంజరు భూములను ప్రభుత్వం అమ్మదలచటం భూదానోద్యమానికి దోహదం చేసేపనిమాత్రం కాదని ఆచార్య వినోబాభావే మే మూడోవారంలో నిడుబ్రోలులో ఒక భూదానోద్యమ కార్యకర్తకు వ్రాస్తూ తెలియజేశారు. రాంపేరు ప్రాజక్టుకింది భూమి 8 వేల ఎకరాలను అమ్మటానికి ఆంధ్ర ప్రభుత్వం చేసిన నిర్ణయంమీద అభిప్రాయం అడగ్గా, ఆయన ఈవిధంగా తెలియజేశారు.

భూదానోద్యమానికి అనుకూలమయిన వాతావరణాన్ని భూదానోద్యమ కార్యకర్తలు సృష్టించలేకపోవటమే

దీనికి కారణమని భావేగారు అన్నారు. 38 లక్షల ఎకరాలను సేకరించకలిగిన ఉద్యమాన్ని గురించి ఇట్లా చెప్పటానికి వీలులేదు. ఎందువల్లనంటే ఈసందర్భంలో భూదానానికి అడ్డు తగులుతున్నది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే. కాని జనంకాదు.

బంజరులు పంచిపెట్ట వీలులేదంటూ అధ్యక్షుని పాలనలో నిర్ణయించబడ్డది. కొత్త ప్రాజక్టులకు డబ్బు సేకరించేందుకు ఇదొక దారిగా కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకున్నది. రాష్ట్రాల ప్రాజక్టుల్ని తాను ఆమోదించేందుకు ఇదొక షరతుగాకూడా విధించింది. ఈకేంద్ర ప్రభుత్వ నాయకులందరూ భూదానోద్యమాన్ని అడుగడుక్కూ మెచ్చుకుంటున్నవాళ్ళే. తీర్మానాలు చేస్తున్నవాళ్ళే.

రాష్ట్రప్రభుత్వం ప్రకాశంగారి నాయకత్వాన వున్నప్పుడు రాంపేరు కిందిభూముల్ని భూమిలేనివాళ్ళకూ. రాజకీయ బాధితులకూ పంచిపెట్ట నిశ్చయించింది. తర్వాత గవర్నర్ పాలనలో అవి అమ్మకానికి పెట్టారు. ఇప్పటి కాంగ్రెసు ప్రభుత్వం మరీ మార్కెటు ధరలు పెట్టకుండా ఎకరం రెండు మూడు వందల చొప్పున అమ్మటానికి నిశ్చయించి, పరిస్థితులతో రాజీ కుదుర్చుకున్నది. కాని ప్రాజెక్టులకిందికి వచ్చే భూములను అమ్మేందుకు ప్రభుత్వమే సిద్ధపడితే, జనం పనికివచ్చే భూముల్ని ఎట్లా దానంచేయ కలుగుతారు? ఆంధ్ర ప్రభుత్వం నందికొండ ప్రాజెక్టు కింది భూములను కూడా ఈవైఖరినే అనుసరిస్తుందా? తక్కువధరలకు అమ్ముతున్నారేమిటని కేంద్రం ప్రశ్న వేయదా?

కేంద్ర కాంగ్రెస్ నాయకులు భావేగారి హెచ్చరిక గమనించి, బంజరు భూముల విషయంలో తమ వైఖరిని మార్చుకుంటే సరేసరి. లేకపోతే, భూదానాన్ని జనం దృష్టిని ఇతరత్రా మళ్ళించటానికి వాళ్ళొక సాధనంగా మాత్రమే ఉపయోగిస్తున్నారన్న ఆరోపణ నిజమని చెప్ప వలసివుంటుంది.



మనలో మనమాట

అంతా భక్తే!

శ్రీమతి కె. లక్ష్మీ రఘురామ్

అంతాభక్తే! అబ్బో ఇంతభక్తయితే ఎక్కువై పోదూ? ఇందులో సగమే సరిపోవచ్చు. శేషాజీ గారి అధ్వర్యములో గోమతీతీరమున నూర్గురు మహిళామణుల చేత గౌరీశ్వరపతిపూజమహా యజ్ఞము జరుగుట ముదావహము. లోకకళ్యాణమునకు ప్రథమ సోపానము. ఈయజ్ఞమువల్ల ఈ పతిపూజ చేసినసతులకు సత్సంతానము కలిగి దేశమునకు మహాసేవ చేసినవారగుదురట. ఇంతమందికీ "పద్మవిభూషణ"లు "పద్మప్రభ"లు ప్రభుత్వమువారు ఇచ్చుకోవలసివస్తే పెద్దచిక్కే-!

ఒకరిమీద ఇంకొకరికి ప్రేమ జనించితే అది వ్యక్తపరచకపోతే కొంత కీడు కూడా కలుగవచ్చునని మనస్తత్వశాస్త్రజ్ఞుల అభిప్రాయము. కాని ఆ వ్యక్త పరచటము ఒక్కొక్కప్పుడు పల్లాడడానికీ, పీపు విమానము మ్రోతమ్రోగటానికీ కారణభూతముకావచ్చు. అయినా ప్రేమ వంటి గొప్పవస్తువు పుట్టినప్పుడు దానిజన్మవార్త లోకానికి తెల్పుట ధర్మము. అట్లాగే భక్తి కూడ! భక్తి అమాంతంగా కలిగినప్పుడు తదేకధ్యానముతో మునిగి పోవటమేమి, సర్వావస్థలందు స్మరిస్తూ వుండటమేమి, పూజించటమేమి జరుగుతూ వుంటేనే ఆభక్తి రక్తికట్టేది. ప్రత్యక్ష దైవములైన ఈపతులకేమి ప్రతినిత్యముపూజలు జరుగుట భారతీయతా లక్షణము - పోనీ ప్రతి నిత్యము ఏకారణమువల్లనైనా జరగటానికి వీలు లేకపోతే అప్పుడప్పుడు ఈ పతిపూజాయజ్ఞములో పాల్గొనుటఅవశ్యము. మహాపతివ్రతలకు పుట్టినిల్లయిన భారతావనిలో ఇట్టి యజ్ఞములు నిత్యమూ దేశములో ఏమూలో ఓమూల జరుగుచుండుట చాలా అవసరము. ఇట్టి యజ్ఞములో భారత మహిళా మణులందరు అత్యంత భక్తి దీక్షలతో పాల్గొందురనియే ప్రపంచము విశ్వసించు చున్నది.

ఈ మహాయజ్ఞమువల్ల కలిగే లాభనష్టాలను గురించి తర్క వితర్కాలు అనవసరము. మహా పతివ్రతల చేత భక్తిపూర్వకముగా వారిప్రత్యక్ష దైవములకు జరిగే పూజలు వ్యర్థము కాజాలవు. ఈ మహా పతివ్రతలు కాలానుసారము ఈ పతిపూజాకార్యక్రమాల్లో కూడా కొంత వరకు సంస్కరణ జరిగించి ఆ కార్య క్రమాన్ని సంక్షిప్త పరచితే యుక్తము.


"మగనికోరిక తీర్పగ సుమతి ఆత్మగౌరవము విడలేదా......"

ఈ యజ్ఞారంభము ఇంతటి అపాయ పరిస్థితులవరకు దారితీయనంత వరకు పరవాలేదు. కుష్టురోగ మొచ్చిన భర్త సానిదానికొంపకు పోవాలంటే మహా పతివ్రతైన సతిగారు తీసికొని పోయినదట! కాబట్టి పతులైన కొందరు పురుషశ్రేష్ఠులు "మహాపతివ్రత" అని ఆమెగారికి బిరుదిచ్చి సత్కరించారట. ఇది కేవలము పరోపకారాపేక్షతోనే కాకపోవచ్చు. ఆ సుమతి ఆత్మగౌరవాన్ని వీడటమేగాకుండా బొత్తిగాఆరోగ్య సూత్రములను కూడ తెలియని అజ్ఞానములో నుండుట విచారకరము - సిగ్గులేక పతి అడిగితే ఆ సతి బుద్ధిలేకుండా మగని కోరిక తీర్చుటమే! "ఓపురుషపుంగవా! నీకిదితగదు. నీఆరోగ్యము అసలే అపాయకరము. నేను వండి వార్చి వడ్డించితే తినికూర్చుని రామా!కృష్ణా! అనుకో. ఇదే నీ ఇహపరాలకు సన్మార్గము" అని చెప్పితే సుమతీసతి మహా పతివ్రత కాకపోయేదా? ఒక వేళ పురుష పుంగవులు అభ్యంతర పెట్టినా మహిళామణులందరూ చేరి ఆమెకు "మహాపతివ్రత" బిరుదు ఇచ్చేనారే. అప్పటికీ ఆమెకు ఆ విషయము తెలియక పోయి వుండవచ్చు.

ఇంతకీ ఈమహాయజ్ఞములో పూజచేయించుకొనబడే పతులున్నారే, వారు మనఃపూర్వకముగా పూజచేయించు కొనుచున్నారనే సందేహము కొందరికి రాక తప్పదు. వీరిలో ఎంతమంది పూజా పీఠములు అధిష్టించక ముందు తాము నిజంగా పూజింప బడుటకు అర్హులేనా అని అరనిముషమైనా ఆలోచించుకున్నారా ?

మనలోమనమాట- తమ సతులచేత మహా ఉల్లాసముతో బహిరంగముగా పూజ లందిన పతులు రహస్యముగా నైనా తమ సతులను ప్రత్యక్ష దేవతలుగా భావించి పూజలొనరించుటకు ఇచ్చగింతురా ???

[క్రిందటి నెల లక్నోలో గోమతీ నదీ తీరమున శ్రీ శేషాజీగారు ఈ పతిపూజా యజ్ఞము నూరుస్త్రీలచేత జరిపించారు. దీని సరియైనపేరు గౌరీశ్వేం పతిపూజా మహాయజ్ఞము. :—ముందు గౌరీదేవిని పూజించి తరువాత తమ భర్తల పాదములు కడిగి పూజా పుష్పములతో అలంకృతులను జేసి చేతులు జోడించి భర్తకు నమస్కరిస్తూ "ఓపతిగారూ !నీవే బ్రహ్మవు, నీవే విష్ణువవు, నీవే మహేశ్వరుడవు, తెలియక చేసిన తప్పులేమైనయున్న క్షమించు" అని లెంపలు వేసి కొనవలయునట]



"అన్యధా శరణంనాస్తి
త్వమేవ శరణం మమ."

కొవ్వూరు మహిళా సమాజము

19వ. వార్షికోత్సవము

మహిళా సమాజమునకు శాఖగా 1-7-1944 సం॥లో స్థాపించిన సంస్కృత బాలికా పాఠశాలకు జిల్లా ప్లానింగ్ కమీషన్ వారి 50% ధన సహాయముచే కట్టించిన నూతన భవనమునకు 2-5-55తేదీ రాత్రి "గృహప్రవేశము"జరుప బడినది. బీదలకు అన్నదానము, అతిథులకు అల్పాహార విందు జరుపబడినది.

3-5-55 తే॥ మంగళవారం 5గం॥ కు శ్రీయుత న్యాపతి రాఘవరావు (రేడియో అన్నయ్య)గారి అధ్యక్షతను మహాసభ జరుపబడినది. ప॥ గో॥ జిల్లా కమ్యూనిటీ ప్రాజక్టు కన్వీనరు గారైన శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీ బాయమ్మగారు సభా ప్రారంభము గావించిరి. బాల అన్నయ్యగారు మహిళా సమాజానికి మరొక శాఖగా "బాల సంఘము"ను స్థాపించి, బాల విజ్ఞానాన్ని ప్రబోధించారు.

శ్రీయుత కేశిరాజు అప్పారావుగారు (కొవ్వూరు సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్) మున్నగు పుర ప్రముఖు లుపన్యసించినారు. భవనానకి సహాయం చేసిన కొవ్వూరు జైహింద్ ఆర్ట్సుక్లబ్ వారికిని రు 1500లు భూరి విరాళము నిచ్చిన దొమ్మేరు వాస్తవ్యులు శ్రీయుత పెండ్యాల వెంకట కృష్ణ రంగారావు జమీందారుగారికిని, భవనమునుకట్టించుటే కాకుండా విరాళమునిచ్చిన శ్రీయుత కోడూరు అప్పారావు గారికిని,ఇంకను సహాయముచేసిన పురప్రముఖులందరకును కృతజ్ఞత తెలుపబడినది. ప్రస్తుతము కట్టించిన రెండు గదులు చాలవు. మూడవ గది చాల అవసరము. దానికి కూడా పురప్రముఖు లెల్లరు పై విధమున తోడ్పడ ప్రార్థన అని చెప్పబడినది.

పాఠశాల బాలికలు వచ్చిన యతిథులకు "స్వాగతము"ను చెప్పి. "భగవద్గీత" నాటకము (కర్మయోగము) ప్రదర్శించిరి. వందనములతో నాటి కార్యక్రమము ముగిసినది.

4-5-55 బుధవారం సాయంకాలం 5 గం॥కు ఉ॥ భా॥ శ్రీమతి బత్తుల కామాక్షమ్మగారు (ఆంధ్రయువతీ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్- రాజమండ్రి) మహిళా సమాజ వార్షికోత్సవమునకు సభాధ్యక్షత వహించిరి. శ్రీమతి దేవులపల్లి సత్యవతమ్మగారు (తణుకు) సభా ప్రారంభము గావించిరి. ఉ॥ భా॥ శ్రీమతియమ్ వి తాయారమ్మగారు కార్యదర్శి నివేదికను చదివిరి. తాము 1944 సం॥ నుండి నిర్వహించుచున్న సంస్కృత బాలికా పాఠశాలతా 1953-54 సం॥ ఆదాయ వ్యయములను తెల్పిరి.

మరియు సెంట్రల్ సోషల్ వెల్ఫేరుబోర్డువారు మహిళా సమాజములో కుటీర పరిశ్రమలని ॥రూ.3000లు. గ్రాంటు మంజూరు చేసినారనియు జూలై 1.వ తే॥నుండి మిషన్ కుట్టు ఎంబ్రాయిడరీ, నవారు నేత, రాట్నము వడకుట మొ॥ చేతిపనుల శాఖనుకూడా ప్రారంభము చేయుచున్నామనియు, పై జెప్పిన పనులన్నియు "ఉచితముగా"చెప్ప బడునుగాన సోదరీమణులందరు వచ్చి నేర్చుకొని తగు ఫలితమును పొందగోరెదము అని చెప్పిరి.

అనంతరము పాఠశాల బాలికలు "ఆంధ్రమాతటాబ్లో" "సక్కుబాయి" నాటకము ప్రదర్శించి ప్రేక్షకుల నానంద పరచిరి. తరగతులలో ప్రథమ, ద్వితీయ శ్రేణిలో వచ్చిన వారికిని, నాటకములందు పాల్గొనిన బాలికలకును చినగంధం కౌసల్యమ్మగారు (పెద్దాపురం) బహుమతుల నిచ్చిరి.

కార్యదర్శిని వందన సమర్పణముతో "జనగణమన" జాతీయ గీతముతో సభ ముగిసినది.



గూడూరు స్త్రీల గృహపరిశ్రమ సహకార సంఘం

14. వ వార్షికోత్సవము

పై సంఘ 14 వ వార్షికోత్సవము నిన్న సాయంత్రము శ్రీమహాత్మాజీ ఆదివాస హాస్టలు భవనపు ఆవరణములో జరిగెను. సంఘ సభ్యులచే తయారుచేయబడిన వివిధ వస్తువుల ప్రదర్శన పౌరులను ఎక్కువగ నాకర్షించెను.

శ్రీమతి ఇస్కా రాజాదేవిగారు త్రివర్ణపతాకవిశిష్టతను గూర్చి విపులముగ మాట్లాడుతూ పతాక ఆరోహణము చేశారు.

వార్షికోత్సవ సభకు శ్రీమతి గోగినేని విమలాచౌదరి, **M.A.,** గారు అధ్యక్షత **వహించారు.**

శ్రీమతి పుష్పగిరి జానకమ్మగారు గత సంవత్సరపు రిపోర్టు చదివారు. అందులో సహకార సంఘమునందు ప్రప్రథమమునుండియు ఖద్దరు పరిశ్రమ, గృహోపకరణ ములగు అనేక రకములైన వస్తువులు స్త్రీలచే తయారు చేయబడుచున్నవని తెల్పారు.

అధ్యక్షిణి మాట్లాడుతూ ఈ సంఘమునకు ఆర్థిక సౌష్టవం, వసతిగృహము, ప్రజల సంపూర్ణ సహకారము లేనప్పటికీ ఈ సంస్థ అన్నివిధముల అభివృద్ధి చెందుట కడుసంతోషదాయకము. పురాతన కాలమునుండి భారత దేశం చేతిపనులు చాలాసున్నితముగను అందముగను తయారుచేయడములో గొప్ప పేరుగాంచినది. భారత దేశం వ్యావసాయకమైన దేశం. పారిశ్రామికమైనదిగాదు కనుక ఈ కుటీర పరిశ్రమలు ప్రభుత్వం ప్రజల సహ కారంతో ఎక్కువ అభివృద్ధి గాంచుటకు వీలున్నది. భారతదేశంలోని ప్రతి రాష్ట్రం ఏదేని ఒక చేతిపనికి ప్రసిద్ధి గాంచినది. నాణ్యమైన వస్తువులు తయారు చేయడములోను తివాసీలు నేయుటలోను కాశ్మీరు పేరు గాంచినది. బంగారు వన్నెపునూలు వడకడములో యు. పి. అగ్రస్థానము వహించినది. రాజపుత్ర స్థానము ప్రింటింగ్‌లో భారతదేశపు నాగరికతను స్పష్టపరచు చున్నది. బెంగాల్ సున్నితమైన వస్తువులకు, ఆభరణాలకు ప్రసిద్ధి గాంచినది మైసూరు కొయ్యలపై శిల్పనైపుణ్యాన్ని తెల్పేందుకున్ను. దక్షిణ భారత దేశములో పురాతన చేతిపనులలో చాప అల్లుటకు, కుండలు చేయుటకు, నవారా తదితరపనులకు గొప్పగా రాణించివుంది. యీ విషయాలలో భారతదేశము ప్రపంచములోకెల్ల అగ్ర స్థానము వహించింది. ఈవెలుగును అర్పకవుండేటట్లు చేయవలసిన బాధ్యత ప్రతి సోదరిపైనున్నది.

సంఘ ప్రెసిడెంటుగారైన నక్కా రంగనాయకమ్మ గారు కష్టజీవి అనియు, ఆదర్శభావములు గల సోదరి అనియు ఈ సంఘానికి వారు చేస్తూన్న గొప్పసేవను ప్రశంసించారు.

ఆధునికకాలంలో విద్యాధికులైన గృహిణులు పెక్కు మంది గృహకృత్యములు చేసుకొనడములో వెనుకంజ వేస్తున్నారు. కొంచెము తెలిసినవారు ఎక్కువ తెలియు ననుకొందురు. అది చాలా అపాయకరము. విద్యార్థి దశలోనే సత్ప్రవర్తన నలవరచుకొని కాలమును, సొమ్మును దుర్వినియోగ పరచక ఇతరులపై ఆధారపడక స్వావలంబనముగ కష్టపడి పనిచేయడము అత్యావసర మన్నారు. ప్రథమ పంచవర్ష ప్రణాళికలో ప్రభుత్వపు గ్రాంటుల సహాయముతో కుటీర పరిశ్రమలు అభివృద్ధి గాంచుచున్నవి. ద్వితీయ పంచవర్ష ప్రణాళిక పూర్తి అయ్యేలోగా ఎక్కువ అభివృద్ధికి రాగలవు.

శ్రీమతి అగ్నెసు అలెగ్జాండరు బి. ఎ. బి. ఇడి. **(S. M G. High School)** ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ జీవితపరిమాణము తగ్గిపోవుచున్న ఈ రోజులలో ప్రతి గృహిణి పొదుపుగ వాడి తన భర్త తెచ్చే కొద్ది సొమ్ముతో కుటుంబ జీవనాన్ని సంతోష కరంగా నిర్వహించవలసిన బాధ్యత ప్రతి నా సోదరిపై నున్నదన్నారు. మన విరామకాలాన్ని సద్వినియోగ పరచవలెనన్న మనకేలాంటి యంత్ర సహాయములు లేవు గనుక ప్రతి గృహిణి, గృహస్థుడు ఈ కుటీర పరిశ్రమాభి వృద్ధికి ఇతోధికంగా కృషిచెయ్యాలి. నేడు అధికజనాభాతో నిరక్షరాస్యతతో నిరుద్యోగంతో మన దేశం దౌర్భాగ్య స్థితిలోనుంది. కనుక ప్రతి గ్రామములోను కుటీర పరిశ్రమలను అభివృద్ధి పరచవలసిన ఆవశ్యకతనుగూర్చి విపులముగ మాట్లాడారు. విద్యాధికులు పట్టణములోని శ్రీమంతులు ముందుకు వచ్చి ఈ సహకార సంఘ అభివృద్ధికై తోడ్పడవలసినదిగా వినతిచేశారు.

కుమారి జి. ఎమ్. సీతారాంగారి వీణకచ్చేరి సభికులకు ఆనందాన్ని కల్గించింది.

పోటీలలో గెల్చినవారికి బహుమతులున్ను వీణకచ్చేరి జరిపిన కుమారి సీతారాంగారికి సంఘం తరఫున రజత పాత్రయును అధ్యక్షులు బహూకరించారు.

సంఘాధ్యక్షురాలు శ్రీమతి నక్కా రంగనాయకమ్మ గారి వందన సమర్పణలతో వార్షికోత్సవ సభ ముగిసెను.

హోమరు ఇలియడ్‌లో

హెలెన్

శ్రీమతి కె. రామలక్ష్మి

ప్రాచీనయుగపు శిథిలాలు యీనాటికీ నిలచివుండి ఎలా మన దృష్టిని ఆకర్షిస్తున్నాయో, ఆనాటి అందకత్తెలూ, వారి అందచందాలు తెచ్చిన యుద్ధాలూ యీనాటికీ ఆయా దేశాలలోనేకాక మనకికూడా బాగా జ్ఞాపకంగా ఉన్నాయి. తన సౌందర్యం ధర్మమా అంటూ ప్రఖ్యాత వీరులైన సీజరు ఆంటొనీలని సహితం తనపక్షం వహింపచేసి యుద్ధం చేయించింది క్లియోపాత్రా. కాని ట్రోయి హెలెన్ తనకోసమే ఒక సుదీర్ఘమైన యుద్ధానికి నాంది పల్కింది. హెలెన్ ఆఫ్‌ట్రాయి చరిత్ర చదువుతూవుంటే అందమైన స్త్రీకోసం యింత ఉన్మత్తంగా యుద్ధంలోకి దిగుతారా మగవారు అనిపిస్తుంది.

గ్రీసులో స్పార్టాదేశపురాజు టైండెరియస్ భార్య అయిన లెడాకీ, గ్రీకుదేవుడైన జియస్‌కీ కల్గిన సంతానం హెలెన్. హెలెన్‌కీ మానెలస్‌కీ వివాహం జరిగింది. కాని ఎఫ్రొడైట్ అనే దేవత ప్రోద్బలంవల్ల ట్రాయి రాజ కుమారుడైన పారిస్‌తో లేచిపోయింది. హెలెన్‌ని ట్రాయి తీసుకొని పోవడంవల్ల మానెలస్ తరపున యకియనులందరూ ట్రాయిమీద యుద్ధానికి బయలు దేరారు.

గ్రీకు కవి హోమరు వ్రాసిన పద్యాలలో హెలెన్ అద్భుతంగా వుంటుంది. ఆపాత్రను గురించి చదివాక, హెలెన్ తన తప్పులకి దూరమై ప్రాక్షాళితం అయిన దేవతగా గోచరిస్తుంది. దేవతలూ మానవులూ ఏకమై ఆమెను ఒక కీలుబొమ్మగా చేశారు. తను చేస్తున్న పనులు తప్పే అని తెలిసివుండికూడా వాటినుండి తప్పించుకో లేని వ్యక్తిగా తోస్తుంది. అందుకే అందరికీ ఆకర్షవంత మైనదిగానూ గౌరవనీయమైనది గానూ తోస్తుంది హెలెన్. హోమరూ గోధేయేకాక, యింకా అనేకులు హెలెన్‌ని అమరజీవిగా చేశారు. కాని ప్రతి ఒక్కరూ ఒకవిధంగా చెప్తారు హెలెన్‌ని గురించి.

ప్రతి వ్యక్తినీ ఆనందింపచేసే ఇలియడ్ కథ - చరిత్రా కట్టుకథల సమ్మేళనం. చరిత్రనీ, ఆనాడు అమలులోవున్న కథలనీ తీసుకొని యీనాటికీ నిలచి ఉన్న ఇలియడ్ రాశాడు హోమరు.

దరిదాపు ట్రోజను యుద్ధం పదిసంవత్సరాల దాకా నడవడానికి కారణం గ్రీకుదేవతలే. ఒలంపస్ శిఖరంపై అద్భుతమైన విందుచేస్తూ ఆవిందుకి ఐరిస్ అనే దేవతని ఆహ్వానించడం మరిచిపోయారు. అసలే ఐరిస్ కలతలకీ అరాజకానికీ అధిదేవత. తనకు జరిగిన యీ అవమానాన్ని ఎలాగేనా ప్రతిఘటించాలనుకొంది. ఒలంపస్‌మీద ఆనందోత్సవాలు పెల్లుబుకుతు న్నప్పుడు ఒక బంగారు ఏపిల్‌ని వారి మధ్యన పడేలా విసిరింది. ఆ ఏపిల్‌మీద 'అందరిలోకీ అందకత్తెకి' అని వ్రాసివుంది. అందరూ కూడా అది నాది అంటే అది నాది అని తగవులాడు కున్నారు. చివరకి అది కావాలని నిలచినవారు ముగ్గురే: వీనస్, జూనో, మినర్వా — ఒలంపస్ నివాసులలోకెల్లా అందకత్తెలు. పరిస్థితులు యింకా విషమింపచేయడానికి జియస్ యీ ముగ్గురినీ ట్రాయి రాజ కుమారుడు పారిస్ దగ్గిరకి పంపేడు. అతనే స్త్రీల అందాన్ని నిర్ణయించే శక్తికలవాడనీ, ఆ ఏపిల్‌ని తగినవారికి యిస్తాడనీ. అలాగే ముగ్గురు దేవతలూ పారిస్ దగ్గిరకీ వెళ్ళారు. "అష్టైశ్వర్యాలూ యిచ్చి, సువిశాల రాజ్యాధిపతిని చేస్తాను - ఆపండు నాకియ్యి" అంది జూనో. "గ్రీకులకి ఎదురునిలచి యుద్ధంలో గెల్పు తెప్పిస్తాను. నాకియ్యి" అంది మినర్వా. యువ హృదయం ఎలా పనిచేస్తుందో తెలిసిన వీనస్ "ప్రపంచంలోకెల్లా అందకత్తె అయిన స్త్రీని నీకు తెచ్చియిస్తాను. ఆఫలం నాకియ్యి" అంది. పారిస్ తక్షణం ఆఫలాన్ని వీనస్‌కి యిచ్చాడు. ఆమె పారిస్‌కి యిస్తానన్న అందమైన స్త్రీయే హెలెన్.

అసలు, అందమైన హెలెన్‌ని వివాహం చేసుకొందుకు ఎందరెందరో వచ్చారు. చివరికి వారందరూ శత్రువులుగా అయిపోకుండా తమలో తాము ఒకనిశ్చయానికి వచ్చారు. హెలెన్ ఎవరినైతే భర్తగా ఎంచుకుంటుందో అతన్ని మిగిలిన అందరూ స్నేహితునిగా స్వీకరించాలి.

హెలెన్

శత్రువులెవరైనా అతన్ని ఎదుర్కొంటే యీమిత్రులు అందరూ సహాయంగా వుండాలి. అదీ నిర్ణయం. హెలెన్ మానెలస్‌ని చేపట్టింది. మానెలస్ యిలా అందమైన స్త్రీని పొందడమేకాకుండా, బలమైన స్నేహితబృందాన్ని కూడా పొందకలిగాడు.

హెలెన్ భర్తతో హాయిగా కాపురం చేసుకొంటున్న సందర్భంలో వీనస్, పారిస్‌ని అక్కడికి పంపింది. అతిథికి అన్ని సౌకర్యాలూ సమకూర్చి పనిమీద వూరు వదలి వెళ్ళాడు మానెలస్. పారిస్ యింతకాలంగా హెలెన్ స్వరూపాన్ని వూహించుకొంటూ వున్నాడేకాని, యిదే మొదటిసారి ఆమెని చూడడం. అంతే పారిస్, తనశక్తినీ, సమ్మోహనశక్తినీ, లేకుంటే రెండింటినీ ఉపయోగించి హెలెన్‌ని తనతో తీసుకు వెళ్ళిపోయాడు.

మానెలస్ యింటికి వచ్చి సంగతి తెలుసుకొని యుద్ధసన్నాహాలు చేశాడు. వేయి పడవలతో బయలుదేరి వెళ్ళి, ట్రాయిని భూస్థాపితం చేయ సంకల్పించాడు. తొమ్మిది సంవత్సరాలు యుద్ధం సాగినా ఏపక్షమూ గెలియనూలేదు; ఓడనూలేదు. చివరకు గ్రీకులు తమలో తామే దెబ్బలాడుకోవడం మొదలుపెట్టారు. వీరికి కుడి భుజం అయిన ఎకిలిస్ యుద్ధమే చేయనని భీష్మించాడు. ఈ అదను చూచుకొని ట్రోజనులు విజృంభించి గ్రీకు నౌకలని నాశనంచెయ్యడం మొదలుపెట్టారు. అయినా ఎకిలిస్ తన పట్టుదల వదలలేదు చివరకు, తనకి ఆప్త స్నేహితుడు పెట్రోక్లస్‌ని ట్రోజను యోధుడు హెక్టరు చంపాడని తెలియగానే, పట్టపగ్గాలులేని కోపం వచ్చింది ఎకిలిస్‌కి. బయలుదేరి, యుద్ధంలో హెక్టరుని చంపి అతని శవాన్ని రోడ్ల వెంట యీడ్చాడు. ముసలి ప్రిమ్ తన కొడుకు శవంకోసం బతిమాలుతాడు. తండ్రి బాధ చూడలేక హెక్టరు శవాన్ని యిచ్చేస్తాడు ఎకిలిస్. అదే సందర్భంలో ప్రిమ్ కూతురుని చూసిన ఎకిలిస్ ప్రేమలో పడతాడు. వివాహంకూడా నిశ్చయం అయి, గుడికి వెడుతున్న సందర్భంలో, ఎన్నడూ ధైర్య సాహసాలు చూపని పారిస్ విషపూరితమైన బాణంతో ఎకిలిస్‌ని మడమమీద కొడతాడు. ఎకిలిస్ యావత్ శరీరంలో అమరత్వశక్తిని గాంచనిది ఆ మడమ భాగం ఒక్కటే. అందుకే ఎకిలిస్ తక్షణం మరణించాడు.

ఎకిలిస్ మరణంతో ధైర్యసాహసాలు సన్నగిల్లాయి గ్రీకులకి. అందుచేత, యుద్ధంతోకన్న ఉపాయంతో ట్రోజనులని ఓడించాలని నిశ్చయిస్తాడు యులిసిస్. చిన్న సైనిక దళం లోపల దాగేందుకు వీలుగా ఒక పెద్ద కఱ్ఱ గుఱ్ఱాన్ని కట్టించాడు. రాత్రివేళ ట్రాయికోట గుమ్మం దగ్గరకి దాన్ని తీసుకువెళ్ళి — దానిని లోపలికి పంపించవలసినదనీ, తాము యుద్ధం మానేసి వెళ్ళిపో నిశ్చయించామనీ — చెప్పారు గ్రీకులు. శకునాలుకూడా నిజమేనని సూచించడంవల్ల ముందు వద్దనుకున్నా గుఱ్ఱాన్ని లోపలికి తీసుకువెళ్ళారు ట్రోజనులు. ఆరాత్రే కఱ్ఱగుఱ్ఱం కడుపులో నుంచి యులిసిస్ అతని సహచరులూ బయటికి వచ్చి, అక్కడ కాపలావున్న కొద్దిమంది గార్డులనీ చంపి ట్రాయి సింహ ద్వారాలు తెరిచేశారు. కొద్దిగంటలలోనే భయంకర దృశ్యాల మధ్య ట్రాయి భూస్థాపితం అయిపోయింది. పది సంవత్సరాలపాటు హెలెన్‌కోసం సాగిన ట్రోజను యుద్ధం ముగిసింది. యుద్ధం ముగియగానే భర్త మానెలస్‌తో సహా స్పార్టాకు వచ్చి హెలెన్ స్పార్టా రాణి అయింది.

గ్రీకులలో హెలెన్ ఎంతగానో ఆరాధింపబడింది. ఆనాటి మతవిషయిక తతంగాల కేసీ, ఆనాడు అమలులో వున్న గాధలకేసీ, చూస్తే — హెలెన్ ఒక పురాతన దేవతగా గోచరిస్తుంది. స్పార్టాలో ఆమెని శిశురక్షకిగానూ, యౌవన హృదయాధి దేవతగానూ ఆరాధించేవారు - ఆమె గౌరవార్థం ఎన్నో ఉత్సవాలు జరిపేవారు గ్రీకు యువతులు హెలెన్‌ని మూన్‌గాడెస్‌తో కలిపి ఆరాధించినట్లుకూడా చాలా గుర్తులు చరిత్రలో కనబడతాయి. హెలెన్ అందచందాలు మూన్‌గాడెస్ అందచందా లంతటివన్నమాట.

హెలెన్ జీవితంతో దేవతలు చెలగాటం ఆడకుండా వున్నట్లయితే యింత యుద్ధమే జరగకపోయేది. అందుకే దేవతలూ మానవులూ కలిసి హెలెన్ సౌందర్యం జగద్విఖ్యాతం చేశారంటే అతిశయోక్తికాదు.

ట్రోజను యుద్ధంలో పారిస్ మానెలస్‌లు యుద్ధం చేస్తూండగా పారిస్ పడిపోతాడు తక్షణం అతన్ని శయనాగారం చేరవేస్తుంది ఎఫ్రొడైట్ దేవత. అంతే కాకుండా హెలెన్‌ని అతని సన్నిధికి ప్రవేశపెడుతుంది. యుద్ధరంగంలో పారిస్‌కోసం గాలిస్తున్నాడు మానెలస్. అదేసమయంలో ఎఫ్రొడైట్ " ధర్మమా అంటూ హెలెన్‌తో హాయిగా కాలక్షేపం చేస్తున్నాడు పారిస్. ఈ సన్నివేశంలో - ఎంత అందకత్తె అని మెచ్చుకున్నా,

హెలెన్ అంటే ఏహ్యం కలుగక మానదు. కాని అంతకుముందే హెలెన్ అన్నమాటలు వింటే జాలి వేస్తుంది. తనని పారిస్‌వద్దకు తీసుకొనిపోడానికి వచ్చిన ఎఫ్రొడైట్‌ని చూసి "ఇంకా నన్నెందుకిలా బాధపెడతావు? మానెలస్ నన్ను ఎలాగా గెల్చుకుంటాడనీ, యీ లోపుననే యింకా నీకిష్టమైన ఏపురుషునికేనా నన్ను యివ్వాలనీ చూస్తున్నావు కాబోలు! అలా జరగదు. పారిస్ దగ్గిరకి నేను రాను" అంటుంది. కాని ఎఫ్రొడైట్ భయపెట్టి తీసుకువెడుతుంది.

యుద్ధం జరుగుతూంటే చూడడానికి వచ్చిన, హెలెన్‌ని చూసి, అక్కడ వున్నవారు "ఎకియనులూ, ట్రోజనులూ యిన్నేళ్ళుగా యిటువంటి స్త్రీకోసం యుద్ధం చేస్తున్నారంటే ఆశ్చర్యంలేదు. స్వర్గాన్నుంచి దిగివచ్చిన దేవతలావుంది ఆమె" అనుకొంటారు. హెలెన్ ట్రాయి వినాశనానికే వచ్చినా ట్రోజనులు అలా అనుకోలేదు. వారి దృష్టిలో హెలెన్‌కోసం యుద్ధంచేయడం గర్వకారణం.

"Her's was a face that launched a thousand ships" అన్న హోమరు వాక్యం సత్యదూరం కాదు. ఒక్క గ్రీకు బార్డు హోమరేకాక, యింకా అనేకుల మన్ననల నందింది హెలెన్ సౌందర్యం. దివ్యసౌందర్య సాన్నిధ్యంలో, పురుషులు అందరూ అనుభవశూన్యులుగా గోచరిస్తారన్న విషయాన్ని రుజువు చేశారు, ట్రోజను ఎకియను యోధులు. 'అమూల్యమైన సౌందర్యం ఎదురయినప్పుడు దానిని ప్రేమించకుండా వుండడం కష్టం.' 'అసలు ఆడదాని జీవితమే కష్టాల గాథ. దానికి తోడు ఆ జీవితాన్ని యింకా అయోమయం చేస్తారు యీ మగవాళ్ళు.' అన్నవాటి ప్రతిధ్వనే హెలెన్ జీవితం.

నిజంగా హోమరు అన్నట్లు, వేయి ఓడలని హుటాహుటి పయినింపచేసే శక్తి హెలెన్ ముఖంలో వుంది. హెలెన్ సౌందర్యంలో వుంది. దేవతలనే అసూయిష్టులను చేయగల సౌందర్యం ఆమెది.

సాయంత్రం

శ్రీమతి టి. లీల

అలసిపోయిన సూర్యుడు
కాంతిని కోల్పోయి
పశ్చిమకొండమీద
అస్తమించాడు

దూరంగా పచ్చని
మనోహర మైదానం
కీచురాళ్ళ ధ్వని
మలయమారుత పర్యటన

చెట్లచాటు గుబుర్లలో
ప్రేమికుల సల్లాపాలు
చెట్లమీది గుబుర్లలో
పక్షుల కలాపాలు

పగలల్లా పనిచేసి
అమితంగా అలసిపోయి
స్వేచ్ఛావాయువు కోసం
పచారుచేయు గుమస్తాలు

మొదటిరోజు ఆట కొరకు
తెలివిన ఆదుర్దాతో
బుకింగ్ వద్ద పోట్లాడే
యువకులు మరి కొందరు

రాత్రివరకు కాచుకొని
ప్రేయసిజాడలె తెలియక
నిరాశతోడ వెడలిపోవు
నిర్భాగ్యపు ప్రియుడొకడు

సాయంత్రం పోయింది
దూరంగా కొండమీద
ఎర్రరంగు కాంతితోన
చంద్రోదయ మవుతోంది

అతికి - అతకని హృదయాలు

శ్రీ బ్రహ్మం

నా నమ్మిన భాగ్యరాశి, నా జీవితరథ చోదనాసాధని-ప్రతిపురస్సరముగ నా కొనగబడిన ఒకే ఒక బహుమానము. నా చేయి జారిపోయింది. అంత పిన్న వయస్సులోనే నను వీడిపోతుందని నే కలలో కూడ ఎన్నడూ తలంచినవాణ్ణి కాను. రెండు సంవత్సరాలు నాతో వుందో లేదో — అంతలోనే మటుమాయమైంది. ఇంతకూ కాలం కలిసి రాకపోతే, అన్నీ అనర్థాలే!

అతి నాజూగ్గా, నీలి మబ్బులాంటి రంగులో-అందంగా యవ్వనపు జిగితో కలకల లాడుతూ- తన్ను జూచిన కళ్ళను కాస్సేపు అలా నిలుపగలిగిన సమర్థురాలు. ఎన్ని భాషలు వచ్చు? మన దేశంలోని ఏ భాషలో పలుకరించినా కిలకిలా మంటూ జవాబిచ్చేది. ప్రపంచ దేశాల భాషలెన్నో తెలుసునని ప్రతీతి! నాతోమాత్రం, చిక్కటి తెనుగునా- నాకు తగిన ఇంగ్లీషు, హిందీలలో సంభాషణ సాగించేది. ఎంత చక్కటి వ్రాత- వంకరలుండేవా?

అందుకున్న ఆజ్ఞ ఎటువంటి కష్టతరమైనదైనప్పటికి- అప్పుడు— యిప్పుడూ అనకుండా అహర్నిశాలు నా సేవ జేసేది. నే ననుకున్నానా.... వెంటనే ఆ పని ముగించి మరింకేమైనా మిగిలిందా అన్నట్లు ముఖం పైకెత్తి-తనకై తానే ఆలోచిస్తూ నా ముఖంలోకి చూసేది. అంతే, అంటే చప్పున ఏమీ ఎరుగనట్టు ముడుచుకొని కూర్చుండేది. ఎంత అభ్యుదయవాది! కొస్త తీరిగ్గా కూచున్నా ఒకనాడు. ప్రక్కనే తన స్థానమాక్ర మించింది. చిరునవ్వుతో- ఒకమాట చెప్పనా అన్నట్లు నాలోకి చూసింది. పరాకుగా ఆఁ! అన్నా కన్నులతోనే మీరు ఏం చెప్పినా వ్రాస్తా. కాని ఒక్క షరతు. ఆ విషయం అటు సమాజానికైనా ప్రాతినిధ్యం వహించాలి: లేదా మీ వ్యక్తిగత భావమైనా కావాలి ... అంతేకాని అమ్ముడువ్రాతలు వ్రాయమంటే మాత్రం.........

వ్రాయనంటావు! అంతేనా? ఇందులో నీకు సంపూర్ణ స్వాతంత్ర్యమిస్తున్నా-తెలిసికొని మసలుకోవలసిన బాధ్యత నీదే అన్నా నవ్వుతూనే! తన వికసిత వదనం వెంటనే ముకుళించుకపోయింది. బహుశా తనే సంకుచిత ననే భావం స్ఫురించిందేమో!

తలుచుకుంటే హృదయం తరుక్కుపోతుంది. నాకు తెలియని విషయాలు ఎన్నో తనకు తెలుసు. తెలిసినా గర్వంతో ఏనాడూ— ఏమరిపాటున నైనా పొక్కేదిగాదు.

ఇక నా జీవితంలో సంపాదించుకోలేను. దురదృష్టమంటే ఎలాంటిదో అనుకునేవాణ్ణి. యిపుడిపుడే అర్థమయింది.

అయినా చే జేతులారా చేసుకున్న పనికి, అంతా అయిన తర్వాత వగచిమాత్రం ప్రయోజనం? ఎదురు తిరగడమన్న మాట ఏనాడూ లేదే! తనకు ఒక్కొక్కప్పుడు కడుపులో దహించుకపోతూవుంటే, నాలుక తడియారి, దీనవదనయై ... అయ్యో ... ఏమనను? నాకు చేతులాడేవి కావు. మెదడు పనిమానివేసేది.

నిర్దయుణ్ణి ... ఈ పాపిష్టి చేతులే నా క్షణిక దౌర్బల్యానికిలోనై, ప్రాణప్రదమైన వస్తువులెన్నో పోయాయనే దుఃఖముతో తన్నుకూడ గంగపాలు గావించాయి. నా వికలమైన హృదయాన్నీ, నన్నూ మోసుకుంటూ బస్సు అతివేగంగా పోతూవుంది. ఇదే సమయమని మెదడు ద్విగుణీకృతశక్తితో పనిజేస్తూ తప్పటడుగులు వేసింది. స్మశాన వైరాగ్యం నాలో పుట్టుకొచ్చింది. ఉత్తరక్షణంలోనే తన్ను కూడ గంగపాలు గావించా క్షణికమైన తృప్తికొఱకు. కడసారి, తనివితీర . . ఆ సుందరవదనాన్ని తిలకించిన వాణ్ణి అయినా కాను దౌర్భాగ్యుణ్ణి!!

ఆక్షణం.... ఆక్షణంలో నాకు తన ఎడబాటువల్ల కలిగే బాధ అణువంతైనా తోచి ఉంటే-ఆ నీచకార్యానికి ఒడిగట్టేవాణ్ణికాను. ఇపు డంగలారుస్తే....! ఆజన్మాంతమూ యిలా బాధపడేకంటే.... నేనూ ...

వీడిపోయింది మళ్ళీ తనకు పునర్జన్మలేదు. ఎన్నో మార్లు చెప్పిం దావిషయం నాతో. పలుమారు కొద్దీ నిమిషాలో, గంటలో ఒకర్నొకరం విడిచి వుండడం తప్పని సరియయ్యేది. అప్పుడు ఎంతగా బాధపడేదో?

ఒక్కొక్కమారు అత్యధికమైన కోపంతో నురుగులు గ్రక్కేది. ఒక్కసారి చేయెత్తి దించానా.... ఒకేఒక సెకనులో చప్పున చల్లారి మందహాసా లొలికించేది. తనే నాకు అందమూ, ఆనందమూ ! ఇంతకూ నను వీడి పోయింది.

ఒక్కమాసం అష్టకష్టాలూపడ్డా హృదయంలో ఆరని చిచ్చు రగుల్కొలిపింది. ఏపని జేయాలన్నా చేతులు కట్టైపోయాయి. అధికార్లతో ఎన్నోమార్లు చీవాట్లు తిన్నా !

కడకు నిశ్చయించుకున్నా. గుండె దిటవు "కలవాడు" గా మెలగా లనుకున్నా. ఆశాజీవిగా జీవించాలనుకున్నా. తనలాగే నేనూ, నా తనువునూ బుద్ధినీ సర్వస్వం పరుల కొరకే, ఇతరుల సుఖం కొరకే అర్పించి ఏకాకిగా మనా లనుకున్నా. ఇంకా ఏమేమో అనుకున్నా....

అయినా, నాలో దౌర్బల్యం మూర్తీభవించింది. తన లాంటి వారే తన స్థానంలో కాకపోయినా మరొకరు కావలసి వచ్చింది. నా భావికార్యక్రమం నడపటానికి ఏదో పెద్దదిక్కుగానుంటే మంచిదని తోచింది. కాస్త రంగంలో అనుభవం కలవారే మే లనుకున్నా.

అలానే దొరికింది. ఎర్రగా పొట్టిగా (పుట్టెడుబుద్ధు లన్నట్టు) కాస్త నోరు పెద్దదే- కీచుగొంతు. నురుగులు గ్రక్కే గుణమూ— ఉత్తమ వంశ సంజాతననే మిక్కుట మైన పొగరూ వున్నాయని తర్వాత అనుభవమయింది. అనతి కాలంలోనే- నా పనంటేనే.... కడకు 'జీవిత మంటేనే రోతపుట్టింది. ఈ క్రొత్తసంపర్కంతో !

తనలాగే భాషలన్నీ వచ్చునంది. తన వినయవిధే యతలకూ తన పనికి- కావలసినన్ని సర్టిఫికేట్లగా కాగి తాల కట్టలు చూపింది. నమ్మినా.... నమ్మి మోసపోయినా జీవిత మంధకారమయమైంది. మరి వెలుగెక్కడిది ? హతోస్మి ! హతోస్మి !!

తను "పైలెట్" జాతికి చెందినదానినంది. ఒక డాక్టరు దగ్గర పేరుప్రఖ్యాతులు గల ఒక ప్రజాసేవకునివద్ద తన పది సంవత్సరాల అనుభవమంతా- నా దగ్గర బూడిద పోసినపన్నీ రయింది. నే గంగపాలు జేసిన నా 'స్వాన్' లక్షరెట్లు మెరుగనిపించింది. చెడ్డ ప్రక్కన వుంటేనే మంచి ప్రకాశిస్తుంది. చీకటి వుంటేనే వెలుగు తెలుస్తుంది. తన పెద్దరికం నాదగ్గర సాగనప్పుడు, ఈసడింపులతో నాకే సుద్దులు జెప్పడం ఆరంభించింది.

నే ననుకున్నదంతా వ్రాసేది నా "స్వాన్." నేనోట చెప్పిందే వ్రాయక మొరాయిస్తుంది. ఈనాటి "పైలెట్" అదేమంటే నువ్వు అనుకున్నదంతా నాతో చెబుతున్నావా? నువ్వు చెప్పినదంతా నేవ్రాయడానికి?" ఎదురు ప్రశ్న. తల పొగరుగాక మరేమిటి ! విజయావారి 'చంద్రహారం' చూచి లోపాలన్నీ ఏకరువు పెట్టాలనుకున్నాను నేను ! "ఉడుకుమోతుతనంలో త్వరపడి ఏదీ వ్రాయవద్దని, పాతికలక్షల రూపాయల, వందలాది పనివారి శక్తికి అది నిదర్శనమనీ, శక్తివుంటే అందులోని మంచిని కీర్తించి చెడును వదిలేయమని తనపదేండ్ల అనుభవం ఆలాపించింది. నీవెంత ? నీ అనుభవమెంత ? అంటూ - ఎంత ! అవమానం !

పోనీ అనుకొని ఎవరూ ఎన్నడూ కని విని ఎరుగని ప్రణయాన్ని గురించి ఆలోచించి మొదలు పెడితే .... అసభ్యం .... అసంగతం .... అంటూత్రోసివేసి మూతి ముడుచుకుంది. చల్లబడిన తనరక్తాని కేం తెలుస్తుంది యవ్వనోద్వేగం ! ఏదో గేయాలైనా ప్రయత్నిస్తా మనుకుంటే .... చాల్లేవయ్యా నీ "కోయకవిత్వం" సమాధానం ! ఎంత లోకువయ్యాను! అంతా అయి వ్యాసాలేవైనా అని తయారైతే.... "మొదట కావలసిన స్టఫ్" సంపాదించుకో దిగ్గజాల్లాంటి వారున్నారు. వారిని వారి పరిశోధననూ, పరిశ్రమను చూడు ఒకసారి .... అంతూ పంతూ లేని నీతి బోధనలు ! అడ్డుపుల్లలు ! చచ్చానురా భగవంతుడా ! వేగలేక, వళ్ళుమండి పట్టరానికోపంతో "అయినా నీలాంటి సెకెండ్ హాండ్" బాపతును తెచ్చుకోవడమూ నాదేబుద్ధి పొరపాటన్నా దాంతో అగ్గయిపోయి నీదే సెకెండ్ హాండ్ మొఖమే ! నీ మొఖానికీ పనికి రాక పోయానా ? విసురుగా వచ్చింది జవాబు. ఛ ఛ పాడు నోరు.

గంగలో చేతులార జారవిడిచిన నా "స్వాన్" కలమే నా కుండి ఉంటే .... అయ్యోరాత .... చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకుంటేఏంలాభం? ఇక ఈ"పైలెట్" కలానికి నాకూ పొత్తు కుదరదు. ఇదే విడాకుల పత్రం అందిస్తున్నా !

ఎవరైనా ఒక "స్వానో" మళ్ళీ ప్రెజెంటిస్తే !

గమనిక :— ఇది "పైలెట్" కడసారివ్రాత. దాని మనసులో ఏముందో ఏమో !! తప్పొప్పులకు బాధ్యత నాదికాదు.

"భారత ప్రశస్తి"

శ్రీ పి. ఎన్. గోపాల్

ధర్మయుద్ధక్షేత్ర మందున
ఘర్మకణములు నుదుట మెరయగ
ఒరల వీడిన కరకుకత్తులు
వైరిశిరముల నరకు తరిలో
పరాజయమో విజయమో యను
భయము మమ్ముల జేర నీయక
కరుణారస ముప్పొంగి హృదిలో
కలచి కన్నీ రొలుక దయతో
క్షమాభిక్షను ప్రసాదింపగ
నివేదించిన దీవెగా !

కర్మవీరుల విజయపంక్తుల
గర్వ మన్నది చేరనీయక
సర్వమును నీ పాదపీఠిని
జేర్పు మన్నది నీవెగా !

అనాధులకూ అతిథితతికీ
పొరుగువారికి స్నేహితులకూ
ఉదారముగా హృదయమందిర
కవాటమ్ముల తెరచియుంచుట
తెలియజెప్పిన దీవెగా!

విషయవాంఛల దరియ నీయక
విషపు లేమికి వగవ నీయక
కొంచె మైనా ఉన్నదానిని
మంచిపనులకు ధార వోయుట
మంచి దని ఈ మానవాళికి
తెలియ జెప్పిన దీవెగా !

వ్యర్థమగు స్పర్థలను మరచి
స్వార్థమన్నది సమయ నడచి
సర్వమును నీపాద సన్నిధి
జేర్పు డన్నది నీవెగా !

[రవీంద్రుని కృతికి స్వేచ్ఛానువాదం]

★ గడియారం జయం పలికింది ★

'మీ న'

రావుగారి పెద్ద భవనంలో విశాలమైన డ్రాయింగ్ రూమ్‌లో ఫ్యాన్ క్రింద రావుగారు మూర్తి తెచ్చిన ఏవో కాగితాలు చూసుకుంటున్నారు. మూర్తి రావుగారి స్వంత కంపెనీలో క్రొత్తగా చేరిన గుమాస్తా. మూర్తి చురుకైన కుఱ్ఱవాడు. చాలా తెలివిగలవాడు. అతను బి. ఎ. ఫస్ట్ క్లాసులో పాస్ అయి లెఖ్ఖల్లో ప్రథముడుగా వచ్చాడు. ముందు ఇంకా పై చదువులకి వెళ్ళాలని అభిలాషవున్నా. తండ్రి హఠాత్తుగా పోవడంతో చదువుకి స్వస్తిచెప్పి కుటుంబ పోషణకోసం ఉద్యోగంలో చేరాడు. రావుగారు కూడా స్వతహాగా చాలా మంచి మనిషి, యిట్లాంటి యువకుల్ని పైకి తేవాలని అభిలాషకల మనిషి. కాబట్టి మూర్తికి త్వరగా ఉద్యోగం లభించింది. ఇందులో కొంత రామం సహాయం కూడా లేకపోలేదు. రామం ఎవరో కాదు, రావుగారి తమ్ముడి కుమారుడు. మూర్తికి స్కూల్ ఫైనల్‌నుంచి క్లాస్ మేటు, ప్రాణమిత్రుడు. రామానికి పైచదువులకి పోయే అవకాశాలు చాలా వున్నా, అతనికి అంత ఆసక్తి లేకపోవటంతో ఆ ఒక్క డిగ్రీ చా లనుకొని అంతటితో ఆపేశాడు. కాని ఊరికినే కూర్చోటం దేనికని పెత్తండ్రిగారి కంపెనీలోనే తను ఒక గుమాస్తాగా చేరాడు.

మూర్తి రావుగారి వైపు తదేక ధ్యానంతో చూస్తున్నాడు. తను వేసిన ఎక్కౌంట్స్‌లో ఏదన్నా తప్పు ఉందేమోనని, అది అతను చూసి ఏమంటాడోనని భయంతోను. ఇంతలో హఠాత్తుగా మేడమీదనుంచి కమ్మని పాట వినిపించింది. అదేదో హిందీ సినీమాలో లతా మంగేష్కర్ పాడింది. "ఎంత కమ్మని గొంతుక. అచ్చంగా లతయే" అనుకుంటున్నాడు మూర్తి. ఇంతలోకే రావుగారు తలెత్తి "అమ్మాయ్! రాధా," అని పిల్చారు. గదంతా ఒక్కసారి వెలుగు వెలిగినట్లనిపించింది మూర్తికి. "ఏం! నాన్నగారు" "ఏమి కమ్మదనం! ఎంత వినయం!" అనుకున్నాడు మూర్తి. "ఆ సన్నని, నాజూకైన తెల్లని శరీరానికి సువర్ణలత అనో, హేమలత అనో అంటే బాగుండేది" అనుకున్నాడు. "నేను యిప్పుడే కంపెనీకి వెళ్ళిపోవాలి. భోజనం క్యారియర్‌తో అక్కడికే పంపండి" అంటూ చివాల్న లేచారు రావుగారు. మూర్తికి ఏదో లోకంలోంచి తెప్పరిల్లు కున్న ట్లనిపించింది. తను ఆ కాగితాలు తీసుకుని యింటికి బయలుదేరాడు. తోవలో ఏవేవో ఆలోచించుకుంటున్నాడు. "రాధ! ఎంత చక్కటి పేరు. తనపేరు కృష్ణమూర్తి అయితే ఎంత బాగుండేది. పోనీ నారాయణమూర్తి అయితేమాత్ర మేం? నారాయణుని అవతారమేగా కృష్ణుడు. కాబట్టి తనూ, రాధ ... రాధ గొప్పయింటి బిడ్డ. పువ్వుల్లో పెరిగింది. తను ఆమె భర్త అవడానికి ఏమన్నా తగునా. తన తాహతెక్కడ, ఆమె తాహతెక్కడ. రాము చేత కబురంపితే మాత్రం ఆమె ఒప్పుకుంటుందని నమ్మక మేమిటి. తాహతు, హోదా అడ్డు రావచ్చు." "ఇలాంటి అఘాయిత్యాలకి పాలుపడితే వున్న ఉద్యోగం కూడ ఊడిపోతుందేమో" ఇలా తన ఆలోచనలు ఒకదారీ తెన్నూకు రాకుండానే యిల్లు వచ్చేసింది. టైము చూసుకున్నాడు. తొమ్మిదిన్నర. ఇంట్లో అడుగు పెట్టాడో లేదో గడియారం 'రంగ్'మని కొట్టింది. చెల్లెలు మణి ఎదురుగుండా పరుగెత్తుకొచ్చి "అన్నయ్యా, గడియారం జయం పలికిందిసుమా, నేనూ అమ్మా నీ పెండ్లి విషయమై మాట్లాడుతున్నాం. అమ్మ అన్నయ్యకి పెండ్లి చెయ్యాలి అంది. అన్నయ్యకి పెండ్లి అనేసరికే గడియారం కొట్టింది" మూర్తి ముఖం ఒక్కసారి విప్పారింది. తనకి అంతేగా జరిగింది. రాధ నా భార్యఅయితే ఎంత బాగుండును అని తానూ అనుకున్నాడు. వాక్యం పూర్తి కాకుండా భార్య దగ్గరే గడియారం కొట్టింది. "అన్నయ్యకి పెండ్లి...." "రాధ నా భార్య...." అబ్బ సత్యం అయేలాగు చెయ్యి భగవంతుడా అని అరచేతిని ముద్దు పెట్టుకున్నాడు.

సాయంత్రం మూడున్నరైంది. బద్ధకంగా ఒళ్లు విరుచుకొని కాఫీ కని బయలుదేరాడు మూర్తి రాధని మళ్ళీ ఎట్లా చూడడమా అని ఆలోచించుకుంటూ.

"ఏంరోయ్! దేవునిముందు నైవేద్యం పెట్టిన ఫలహారాల్లాగే వున్నాయే, కదలకండా నీ కాఫీ దోశాను" అంటూ రామం, మూర్తి కూర్చున్న టేబుల్ దగ్గరకి వచ్చి కూర్చున్నాడు. "ఏంరా దీర్ఘాలోచనలోపడి నన్ను పిలవకండానే యివాళ కాఫీకొచ్చేశావే. ఇంకా నీ ఫారన్ పిచ్చి పోలేదా? పోన్లేరా, మా కంపెనీకి మంచిభవిష్యత్తువుంది. అప్పుడు ఒకవేళ ఫారన్ కంట్రీస్‌తో ట్రేడ్ ప్రారంభిస్తే అప్పుడు నిన్ను రిప్రెజెంటెటివ్‌గా పంపుతార్లే, పెద్ద

నాన్నగారు" అంటూ తన ధోరణిలో పడ్డాడు రామం. "అన్నట్లు ఒరేయ్ యివాళ మా చిట్టి పుట్టినరోజు. నిన్ను సాయంత్రం పార్టీకి తప్పకుండా తీసుకరమ్మంది."అన్నాడు రామం. మొదట్లో ఒంట్లో బాగులేదనే సాకుతో తప్పించుకోవాలని నోరుతెరచి, యింతట్లో ఏదో ఆలోచన మెదడులోమెరియడంతో "సరే" అన్నాడు.

రామం వెళ్ళడానికని లేవబోతుంటే చెయ్యి పుచ్చుకుని ఆపి, "ఒరేయ్, యివాళ వాళ్ళ అమ్మాయి రాధను చూశాను. ఎన్నడు ఆ అమ్మాయిని గురించి చెప్పలేదు?" ఎంత ప్రాణ స్నేహితుడైనా అంతకంటే ఎక్కువ అడిగితే బాగుండదని సంశయంతో ఆపేశాడు మూర్తి.

"ఓ! ఆమె?" ఆ అమ్మాయి రావుగారి అసలు కూతురు కాదు. ఆ అమ్మాయి మిసెస్ రావుగారి అక్క కూతురు. వాళ్ళ నాన్న కలకత్తాలో ఉద్యోగం చేస్తూ పోయారు. వీళ్ళు యిన్నాళ్ళు అక్కడే వున్నారు. ఈ అమ్మాయి స్కూల్ ఫైనల్ పాసయి. లోకజ్ఞానానికి, ఆచదువు చాలనుకొని అక్కడికి ఆపి చిత్రలేఖనం సంగీతం అభ్యసిస్తోంది. ఈ మధ్య వాళ్ళ అమ్మకూడ పోవడంతో పినతల్లిగారింటికి వచ్చేసింది. రావుగారు కూడా ఈమెని చాల ఆదరంగా చూస్తువుంటారు. ఈమెకూడా తల్లి తండ్రులు లేనిలోటును పరిగణించకండా వీరినిగౌరవిస్తూవుంటుంది. అన్నట్లు తనుకూడా యివాళ సాయంత్రం వస్తుందిగా మాట్లాడవచ్చు. రాధకూడా చాలా సోషల్ గానే వుంటుంది. అన్నట్టు మీచెల్లెలిని కూడా తీసుకురా!" దీనితో మూర్తికి తన ఆలోచన నిజమైనందుకు చాలా సంతోషమయింది. మూర్తి కళ్ళలో కొత్త వెలుగును చూసి రామం కూడా సంశయంతో నవ్వాడు. "పోదాం పద!" అంటూ యిద్దరు స్నేహితులు ఒక్కసారే లేచారు.

ఆ రాత్రి చాలాసేపు మూర్తి ఆలోచించాడు. రాధకి హోదా కావాలట. డబ్బు ముఖ్యం కాకపోయినా ఆఫీసర్ గారి భార్యా అనిపించు కోవాలిట. ఆస్తిలేకపోయినా మంచి ఉద్యోగంలో వున్న అతన్నే తను వివాహమాడుతుందట. ఇవన్నీ తనకి రామం చెప్పేడు. రామం తన మనస్సు గ్రహించి చూచాయగ రాధకిచెప్తే ఆమె చెప్పిన సమాధానం. మొదట్లో మూర్తి దీనిని గర్వం, అహంభావంగా భావించినా రాధమీద తనప్రేమ అట్లా కాదనిపించింది. గొప్పయింట్లో పుట్టి హోదాగా పెరిగిన పిల్లకి పెద్ద ఆఫీసర్ భార్యా కావాలనే కోరిక సహజమే. ఎందు కంటే అది సాధ్యం కనుక. పోనీ తను ఐ. ఎ. ఎస్. చదివి ఆఫీసరే అయితే. ఈ ఆలోచన తట్టేసరికి మూర్తికి పడుతున్న మగతనిద్ర కాస్తా వదిలి పూర్తిగా మెళకువ వచ్చేసింది. తన అదృష్టం బాగుంటే సెలెక్టు అవ వచ్చు. ఇంకా ఎనిమిదినెలలు. బాగాకష్టపడి చదువుతే ఈ టైము చాలు. డబ్బుకి నాన్న మిగిల్చిన పొలంలో కొంత అమ్మవచ్చు. ఆ మర్నాడే అమ్మని ఒప్పించి ఢిల్లీ నుంచి పోస్టల్ ట్యూషన్ చెప్పించు కోవాలనే నిర్ణయానికి వచ్చాకనే మూర్తికి నిద్ర పట్టింది.

ఈ ఎనిమిది నెలలు మూర్తి అహోరాత్రాలు చాలా శ్రమపడి చదివాడు. పంతాలు ఏ సాహసాన్నయినా సాధ్యం చేస్తాయిగా. ఈ ఎనిమిది నెలలు ఎలాగడిచాయో మూర్తికి తెలీకుండానే అయిపోయాయి. పరీక్షలు చాలా బాగావ్రాశాడు. వ్రాయడమేమిటి తను సెలెక్టు అయి యిన్ కంటాక్స్ ఆఫీసర్ గా నియమింప బడటం ఏమిటి అన్నీ ఒక్కసారే జరిగాయి.

ఒకవేళ సెలెక్టుకాని పక్షంలో చేతిలో నున్న ఉద్యోగం పోకుండా మూర్తి రావుగారిని వేడుకుని యిన్నాళ్ళూ శెలవుమీదే వున్నాడు. ఇప్పుడు ఆయనవద్ద సెలవు తీసుకోడానికి వెళ్ళి వస్తూ ఒక్కసారి మేడనుచూసి "మళ్ళీ రాధను పెళ్ళిచూపులకి వచ్చినప్పుడు ఈ మేడను కూడా దర్శించటం అనుకుంటూ వెళ్ళిపోయాడు.

మధ్యవర్తులచేత కబురంపటం, పెళ్ళిచూపులకివెళ్ళటం, ముహూర్తం నిశ్చయించుకోటం అన్నీ అనుకున్నట్టుగానే జరిగి పోయాయి.

రావుగారింట్లో పాటకచేరి జరుగుతోంది. అందరు ఎవరి హడావిడిలో వారున్నారు. సంగీత ప్రియులు పాట వింటో తన్మయత్వంలో మునిగి వున్నారు. పెళ్ళివారు పనులలో హడావుడిగా వున్నారు. ఎవర్ని జూసినా హడావిడిగా తిరిగేవాళ్ళే. ఇంత తిరుగుతున్నా ఒక్కళ్ళ మొహంలోను, చిరాకుగాని కోపంగాని లేక అందరి మొహాలు కలకలలాడుతూనే వున్నాయి. రాధని పలకరించడానికి యిదే మంచి సమయ మనుకున్నాడు మూర్తి. "నేను నిన్ను పంతంతో పెళ్ళి చేసుకున్నా ననుకుంటున్నావా? అది కొంత వరకు నిజమైనా దీనికి కారణం నీమీద ప్రేమేకదూ?''

"...... ...."

"నేను యింతటి వాణ్ణయానంటే యిదంతా నీ ప్రభావమే. నీవు పెద్ద ఆఫీసరునిగాని పెళ్ళాడ నన్నావుట. అందుకే కష్టపడి చదివి ఈ ఉద్యోగం సంపాదించాను. లేకపోతే మీకంపెనీలోనే గుమాస్తాగావుండేవాణ్ణి. ఇదంతా నీ చలవేసుమా. మొదటిరోజు నిన్ను చూశాక నీవు నా భార్యవచ్చే విషయం ఆలోచిస్తుండగా గడియారం జయం కొట్టింది. అప్పట్నుంచి ఏదో వెఱ్ఱినమ్మకం నిన్ను భార్యగా పొందగలనని. అదీకాకుండా నేను ఎప్పుడు ఆశావాదినే. నేను యింత మాట్లాడుతున్నా నీవు ఏమీ మాట్లాడవేం. నిన్ను సాధించానని కోపమా?

"......................."

"మౌనం అంగీకార సూచకం. అంటే నామీద నీకు కోపమే"

"అబ్బే. లేదండి" గబుక్కున అనుకోకుండా అనేసి నాలుక కరచుకుంది. "మా బాబాయిగారికి తెలిసి నాయన ఢిల్లీ సెక్రటేరియట్‌లో మీకు ఉద్యోగం యిప్పిస్తానన్నారుట. అక్కడ వుంటే ఫారన్ వెళ్ళడానికి చాలా అవకాశాలు వుంటాయే. ఇదంతా నా అదృష్టం" అంటూ అతి కష్టంమీద సిగ్గణుచు కుంటూ అనగల్గింది రాధ. ప్రక్కన అమ్మలక్కల్లోంచి గుసగుసలు వినిపించాయి.

"ఇంకా పెళ్ళయి ఒకరోజన్నా అయిందో లేదో, అప్పుడే ఎలా నవ్వుతూ మాట్లాడుకుంటున్నారో"?

"అవును మరి ఈ కాలం వాళ్ళంతా అంతే."

ఈమాటలు వింటూ మూర్తి. రాధా సిగ్గుపడ్డారు. ఇంతలోకే పాట కచ్చేరి ముగిసింది. మూర్తి రాధ చేత ఆమెకు నూటపదహార్లు. చీరె, రవికలగుడ్డ యిప్పించాడు. ఆవిడ అవి అందుకుని "విష్‌యు ఎ లాంగ్‌హాపీ మారిడ్ లైఫ్" అంటూండగానే గడియారం సాయంత్రం ఏడు గంటలు కొట్టటం ప్రారంభించింది. రాధ అప్రయత్నంగా తన పల్చని టిష్యూ చీరెలోంచి కనపడే మంగళసూత్రాలని చూచుకొని మనస్సులోనే నమస్కరించు కుంది. మూర్తి కూడా తన అరచేతిని ముద్దుపెట్టు కుంటూ రాధ వైపు చూసి "జయం" అన్నాడు. ఇద్దరు సన్నగా నవ్వుకున్నారు.

★

★ సర్వసుందర నగరము ★

రూపకము

శ్రీ కవికొండల వేంకటరావు, బి.ఏ.బి.ఎల్.,

ఇతివృత్తము : నాగర ప్రపంచము

ఇందువచ్చు పాత్రలు

ఊహారావు	....	యువకుడు.	ఓంకారిలిలీ	....	మరోయువతి.
ఉపరిచరిణి	....	యువతి.	ఇక్బల్‌నారాయణ్	....	మరోయువకుడు.
ఓజప్రతాప్	....	ఊహారావు స్నేహితుడు.	శ్రేయశ్రీ	....	ముదుసలిస్త్రీ
			శ్రీమాన్	...	ముసలిమగవాడు.

మొదటి రంగం

[ఇక్బల్‌నారాయణ్ ఒక ఝంఝా మారుతమునకు వెనుకవచ్చే వడగళ్ళ దెబ్బకు జడిసి ఒక చిన్న గుడిసెలో దూరతాడు.]

ఇక్బల్‌నారాయణ్ : అబ్బా! ఏమి పెనుగాలి! గాలివాన గాలిలా ఇట్టే వచ్చేసింది. అవిగో తెల్లగా వడగళ్ళు. ఆరుబయట నించుంటే రాళ్లుఅవి. ఇంట్లోంచిచూస్తూంటే పువ్వులు.

ఓంకారిలిలీ : ఎంతెంతవడగళ్లు! [అగుడిసెలోకే దూరుతూ] నీవు ఇందులోనే వున్నావా? ఎంతసేపట్నుంచి.

ఇక్బల్ : ఈగాలికే ఈమబ్బులే. నేనూ ఏదైనా తల దాచుకోనిస్తుందా అని ఇటూ అటూ చూస్తుంటే ఈ గుడిసె కానవచ్చింది.

ఓం : గుడిసెలో ఎవరూలేరు అదివఱలో?

ఇక్బల్ : లేకేం! వారు నన్నుచూచి అటు పోదిగి వున్నారు. బహుశా చాలా పేదవాళ్ళ గుడిసె అని అనుకుంటాను ఇది. ఎటు చూచినా కంపే యీ వఱకూను.

ఓం : ఇప్పుడు?

ఇక్బల్ : ఇప్పుడు నీరాకవల్ల గులాబిసెంటు వాసన వేస్తూ వున్నది. ఇందలి వాతావరణమంతా!

ఓం : నామూలాన్నికాదు ఈసువాసన. ఇప్పుడు వీచిన పెనుగాలి వచ్చిన దిశగానుండి అని అనుకుంటాను. ఏదో పెద్దగు లాబి తోట పూసి పూసి వున్నది. దాని పరిమళ మనుకుంటాను ఇదంతా. మఱిసీన్ని గుడిసెకప్పు చూచావుకాదు? "స్నో" పడ్డట్టు యావత్తూ తెలు పెక్కిపోయింది వడగళ్ళచేత.

ఇక్బల్ : నవనాగరికతతోకూడిన నీవు ఈ క్లిష్టపరిస్థితిలో నాకు దొఱకబట్టె బ్రతికిపోయాను. లేకుంటే ముక్కు మూసికొంటూ కూర్చోవలసివచ్చును.

ఓం : ఏం! అంత ఖర్మ మేమొచ్చింది?

ఇక్బల్ : ఏమిటేమిటి? చుట్టూ పెంటపోగులు! పంది గోలాలు. చీడకుక్కలు. ఎడ్లదుమ్ములు చర్మాలు! రామ రామ. వీళ్ళు ఎలా కాపురం వుంటున్నారో ఇక్కడ!

ఓం : ఇదే దిక్కన్నట్టు మనమెలా ప్రవేశించామో వారు ఆలాగే ప్రవేశించి వుంటారు.

ఇక్బల్ : మనకీబాధ ఒక నిమేషము. వాళ్ళకి జన్మ జన్మేపీని. అని నా వూహా.

ఓం : ఒక నిమిషమైనా అరనిమిషమైనా వాళ్ళు నిలవ నిస్తేనేగా మనం నిలిచింది!

[వాన తగ్గును]

ఇక్బాల్ : వాన తగ్గిపోయినట్టుంది. గాలి అణగిపోయినట్టుంది. ఆరుబయట రోడ్డు మఱీ పుచ్చునంటే మెఱుగు— ఏం? నీవు మఱీ నాతో రావు?

ఓం : నీతోనే వస్తాను పద! ఇంతకూ నీవు విశేషం శ్రమ పడటు లేదు నాతో వుండి నా గాలి పీల్చినప్పటికీ నీవు. అప్పుడే ఎక్కడలేని చెమట్లు పోసేస్తున్నాయి నాకు మిక్కిలి యిక్కడపోసి!

ఇక్బాల్ : ఇక్కడ విద్యుద్దీపన లేదు. నా చేరుమాలే అది అగుత!

ఓం : ఎందుకులే!— ఈ యింటివాళ్ళనుండి మనం సెలవు పుచ్చుకోనక్కఱలే?

ఇక్బాల్ : పుచ్చుకోను అక్కఱలేదు. అచ్చుకోను అక్కఱ లేదు. వాళ్ళకు మన భాష తెలుస్తేగా పలుకరించడానికి? తాళమంటూ, తలుపంటూ వుంటేగా వెడుతున్నామని విన్నపము సేయడానికి?

ఓం : అదుగో ఇంటిల్లిపాదీ ఎల్లా తొంగిచూస్తూవున్నారో మనల్నిద్దర్నీ మన మివలపడి సంతోషించేలా!

ఇక్బాల్ : ఈ పట్టణంలో ఒక టిలాంటి గుడిసె వున్నందుకు చాలా విచారిస్తున్నాను.

ఓం : నీవు కాబట్టి విచారిస్తున్నావు. వాళ్ళే లేకుంటే మనకు జోళ్ళు కుట్టేవాళ్ళేరీ?

రెండవ రంగం

[వాయు విమానంమీద ఊహారావు, ఉపరిచరిణి]

ఉపరిచరిణి : అదిగో! చంద్రలోకము. దాని మీదకు మన మీపళంగా ఎగిరి దూకివేస్తేనో!

ఊహారావు : అది నిజమైన చంద్రలోకముకాదు. చేత చంద్రలోకము దాని మీదకు దూకావా అదే పోవడం అదే పోవడం. మళ్ళీ ఈలోకం చూడవు.

ఉప : అబ్బా! ఇదేమిటి ఇందులోకూడా నల్లులున్నాయి.

ఊహా : అవి భూమినుంచి వచ్చినవికావు. స్వేదజాటు.

ఉప : అంటే నీ చెమటనుంచో నా చెమటనుంచో అనా నీ అభిప్రాయం?

ఊహా : నీ చెమటనుండి అయివుంటే బంగారపు చెమట నుండి బంగారపు గుడ్లు పోసుకు పుట్టి వుండేవి! నా చెమటనుండే ఇది! [అని చంపి గిరాటేయును]

ఉప : చంపేశావు! ముండా నల్లిని భూమిమీదకు వదిలేస్తే!

ఊహా : అప్పుడు భూమిమీద మనం వున్నప్పుడు మనలను బాధించగలదు.

ఉప : అంచేత బాధ నివారణకోసం హత్యగావిస్తున్నా వన్నమాట!

ఊహా : ఇలా చంపగా చంపగా గాని శాంతి కనిపించదు మనకు ఉపరిచరిణీ!— అప్పుడే ఎన్నిమైళ్ళు కడచి వచ్చినామో మనం! ఇందాకా భారతదేశం మీద ఉన్నవాళ్ళము ఇప్పుడప్పుడే అమెరికామీద వున్నాం

ఉప : పెట్రోల్ అయిపోవస్తూవుంది కాబోలు ఎంజిన్‌కు పైలట్ వాయువిమానాన్ని క్రిందకు దింపేడు. ఈ క్రిందకు దిగడం అక్కర్లేకపోవునుగా ఇందాకా ఉపగ్రహం మీదకు దూకివుంటే? నీవే ఆదూకునుండి నన్ను ఆపేశావు.

ఊహా : నేనుకాదు! నల్లి!

ఉప : ఏది అది?

ఊహా : అట్లాంటిక్ మహాసముద్రంలో పడివుంటుంది.

ఉప : మహాసముద్రంలో పడివుంది కాబట్టి సరిపోయింది కాని, భూమి మీద పడివుంటే ప్రజల్ని ఎంతగా హింస పెట్టేదో?

ఊహా : కటకటా! నల్లిని గురించి అంతచేటు ఆలోచిస్తున్నావు? ఇక తోటి మానవుణ్ణి గురించి ఎంతగా విచారించావో?

ఉప : విచారము అంటే దుఃఖము అనేనా నీ అభిప్రాయము! దుఃఖమనేది నాకు లేదు నాకు రాదు. నల్లిని మహాసముద్రంలో పారేసి నాకు మహోపకారం కావించావు— దిగి చూడు వాయువిమానం ఎక్కడ ఆగిందో? భూమి మీదేనా ఆగుతా?

ఊహా : ఆ! భూమి మీదనే! నీవు దిగవలసినచోట నే!

ఉప : కొద్దిలో తప్పింది నాకు మోక్షం— తిరిగి తోలు మీద తోలు!

ఊహా : అనగా?

ఉప : తిరుగ ఈకాలికి జోడు తొడుక్కోవలసి వస్తూంది నేలమీద అడుగుమోపి.

ఊహా : చంద్రలోకాన వుంటే జోళ్ళక్కర లేదను కున్నావా?

ఉప : అక్కడ జోళ్ళు గొడారివాళ్ళు, ఇలాంటివాళ్ళు వుండరని? నా ఊహ!

ఊహా : బాటలు?

ఉప : బాటలూ వుండవు?

ఊహా : అలా అయితే "రోమా" నాస్తే "హోమా" నాస్తే.

ఉప : ఏమో! ఈ 'పైలట్' ఎంతో మంచివాడనుకున్నాను మనల్ని 'న్యూహారోన్' ఆలోకంలో కట్టుకోనిస్తాడను కున్నాను. ఉత్తి పిరికి పంద! ఉపగ్రహం దరిదాపుకు వెళ్ళి వెనక్కు త్రిప్పేశాడు వాయువిమానాన్ని.

ఊహా : వాడు ధైర్యస్థుడే! నీవే పిరికి పందవు. నల్లి కుట్టిందని ఉలిక్కి పడ్డావు! రేపట్నుంచి ముల్లు గ్రుచ్చుకుందని-ఊ- పలవరించేవు!

ఉప : ఈకబుర్లకేంలే! ముందీ నగరంలోగల మంచి హోటలుకు తీసుకువెళ్ళి సుష్టుగా భోజనం పెట్టునాకు.

ఊహా : భోజనముకెప్పుడూ కొదవుండదు మనకు— పద! జేబులో డాలర్లు గలగల లాడుతున్నంతసేపూ.

మూడవ రంగం

[శ్రీమాన్, శ్రేయశ్రీ శ్రీరంగంలో శ్రీనివాసుని విగ్రహాన్ని సందర్శిద్దామని గుళ్ళోకి ప్రవేశిస్తూవుంటారు]

శ్రీమాన్ : వీడెవడే? ఇలా తగులుకుంటూపోతూవున్నాడు కడజాతివాడల్లే వున్నాడు.

శ్రేయశ్రీ : అలాగేవున్నాడు! వాడే అనుకుంటాను నా జబ్బనుకూడా రాసుకుంటూ పోయాడు.

శ్రీమా : వెనకాల మరెవరో వస్తూవున్నారు?

శ్రేయ : ఆమె వాని పెళ్ళాం. మాలెత అయివుంటుంది.

శ్రీమా : శుచి శుభ్రత వీళ్ళకేం అక్కర్లే దనుకుంటాను. కొంచెం స్నానంచేసి వస్త్రేబాగుండును వీళ్ళీ గుళ్ళోకి.

శ్రేయ : అయినా దేవుడిక్కడే కలడని అనుకోవడం మద్దే తప్పు.

శ్రీమా : అలా అనకు. ముసలిదానవుకూడా అయివున్నావు ఇక్కడే ఏడీ తరాలు పులిహోరలూను— ఇప్పుడు మనం అదో ప్రపంచ సమాజంతో కలిసి మెలిసి వుండాలి. సాంఘిక మతలబులన్నీ తెలిసివుండాలి.

శ్రేయ : కడ కిదికూడాచూచిగాని చావము అనుకుంటాను.

శ్రీమా : నీ అదృష్టంకొద్దీ బ్రాహ్మణజన్మ ఎత్తావు కాబట్టి అందులోనూ అడియేం దాసోహం అంటూ నాతో మమైకంగా ఉండనేర్చావుకాబట్టి ఆలాంటి వాపోత పోతూవున్నావు గాని, నీవే కడజాతి కులంలో పుట్టి వుంటే నన్ను పట్టుకు దిగలాగి మట్టిచేసి పారేసివుందువు వీపాటికి— అవిగ్రహ మేనా శ్రీనివాసుల్ది?

శ్రేయ : అదే, ఆరాయే. అది ఒక్కతీరుగా కదలకుండా మెదలకుండా వుంది. ఈమార్పు లెన్నికలిగినా ఈ మనుష్యులకే!

శ్రీమా : ఒక్క మనుష్యులకే అన్నమాటేమిటి? దేవునకు మినహా చరాచర కోటి సమస్తానకు మార్పువచ్చి పడు తోంది. మనమింక తప్పుకుంటే మెఱుగు.

శ్రేయ : ఎక్కడకు తప్పుకోవడం. అంతా మానవకంచెలా చుట్టిముట్టివుంది! పైకి ఎగిరిపోదామంటే కష్టం. కిందికి దిగిపోదామంటే తిన్నే!

శ్రీమా : మరి గతి!

శ్రేయ : దానికేముంది? వీళ్ళందరితోపాటు భక్తి తాత్ప ర్యాలతోటి విగ్రహానికి మొక్కుకుంటూ వెనక్కు వెనక్కు నడిచిపోదాం!

శ్రీమా : ఏమి? పురోగాములమైతే?

శ్రేయ : విగ్రహం నుదుటికి తగిలి బొప్పి కడుతుంది.

శ్రీమా : మనకా బొప్పి ? విగ్రహానికా ?

[అని ముందుకుపోబోవును]

శ్రేయ : (వెనక్కు లాగుతూ) ఉండండి !_ ఎవరో ఎవర్నో ఈగుళ్ళో పిలుస్తున్నారు.

ఓం : ఏమోయి ! ఇక్బల్ నారాయణ్ ! ఎక్కడ నీవు ?

ఇక్బల్ : ఇక్కడ ఇక్కడ ! ఓంకారిలిలీ ! ఇటుచూడు !

శ్రీమా : అంటరానివాళ్ళే అనుకుంటే అన్యమతస్థులు కూడాను.

శ్రేయ : వారు అన్యమతస్థులో మనమతస్థులో ?__ ఇక్బల్ నారాయణ్ ఓంకారలిలీ— రెండూ రెండు విధాలగానూ ధ్వనిస్తున్నాయి.

ఓం : మనం నిన్నను తలదాచుకొన్నగుడిసెలోని కుటుంబం యావత్తూ ఈవేళ ఈ గుళ్ళోకి వచ్చి నిలిచివుంది.

ఇక్బల్ : మనలాగే వాళ్లూను. ప్రపంచసమాజాన్ని పెంపొందించే లక్ష్యం కలిగి ప్రవర్తిస్తూ వుండబోలు !

ఓం : అంటే జోళ్లూ గీళ్లూ మరి సై

ఇక్బల్ : అందులూ ఆపనులు ఈపైని నేర్వవలసిందే !

ఓం : మనమీ సంఘంలో ఉపరిచరిణిని గాని ఊహారావును గాని కానము !

ఇక్బల్ : వాళ్లు పరాయివాళ్లలా తప్పించుకు తిరుగుతూండబోలు ఏ అమెరికాలో నైనా !

ఓం : అక్కడ మాత్రం నల్ల తెల్ల భేదం వుండదూ ?

ఇక్బల్ : అయితే అంతకుమించిన మరో పట్నం ప్రవేశించి వుంటారు ! వాళ్ళ ఆశయాలేవేటు. ఇవాళ ఇక్కడ వుంటారు రేపు చంద్రలోకంలో వుంటారు.

శ్రీమా : నాయనా ! చంద్రలోకమంటున్నావు. అక్కడికి నన్ను తీసుకువెడుదు నీకు మహాపుణ్యం వుంటుంది. అక్కడిదంతా అమృతమేనట !

శ్రేయ : అమృతమే అయితే ఆకలిదప్పికలుండవు. ముదిమి వుండదు. నేనూ వస్తానుమీతో !

ఇక్బల్ : ఆకలి చంపుకు ?

ఓం : ఉండండి ! ముందు ఇరోగాణ్ణి నన్ను ఈ గుడి ఆవలకు

పోనివ్వండి ! ఇక్కడి కంపు కళ్మలం భరించలేకుండా వున్నాను. నిన్నను గుడిసె ఎలావుందో ఈరోజున గుడి ఆలాగుంది.

నాల్గవ రంగం

ఓజప్రతాప్ (బ్రహ్మాండంగా బుల్డోజరు నడిపిస్తూ పాట__)

ఓజప్రతాప్ :

గుళ్ళూ గుడిసెలు
ఏకం !
చంద్రుడు ఇంద్రుడు
ఏకం !

సర్వసుందర నగరము

ఇది ఆకలితీరే
    పదిలం !
బుల్‌డోజరు నడిపించేం !
ట్రాక్టర్లే విడిపించేం !
పండించేం వలసినంత !
ఇది ఆకలి తీరే
    సుదినం !
చెమటనుఓడ్చే రయితుదే
కమతం బీళ్లపైనుంచి ;
రయి తేవర్ణమువాడైనా
రాణించే డీనుంచి !
ఎవనిమడీ వానిదె యిక,
పాడిపంట పరిఢవిల్ల ;
అవనినవే సరిపోవలె !
తవుడొకనికి, తండులంబు
మఱియొకనికి మర్యాదా ?
మఱి మఱి మఱి
లెండూ ! కూడా
రండు ! నాకూడా
రండు !
సాంఘిక సమాన అంతె
దుంగలెత్తు టొకనివంతు
దొరతన మింకొకనివంతు
కాదు ! కాదు !
సరిపోవు సంపదసిరి
మనమంతా శ్రమపడితే !
భ్రమగాదిది !
ఆకలితీరా అన్నం
చాకలి తెచ్చిన మడత
నిత్యంబుండేచాలు !
నగరం వేరే వలదు !

నాగరీకము లెకద్దు !
రండు ! రండు నాకూడా !
లెండు ! లెండు ! మేల్కొండు !

ఓం : ఆపాట ఓజప్రాతాప్‌ది లాగుంది.

ఇక్బల్ : పాటేకాదు. పాటుకూడా అతనిదే. ఏలా నడిపించాడో బుల్‌డోజరు !

ఓం : "ఆ జోడు బాగుంది. ఎన్నుకుందాం" అనేలా బజ్

ఇక్బల్ : అసలు మనము తలదాచుకొన్న గుడిసెలేలేవు నేడు. వారూ ఓజప్రతాప్ కృషిలోనే నిమగ్నులై యున్నారు.

ఓం : ఇదిగో ఉపరిచరిణి, ఊహారావు వాయు విమానం ఇప్పుడే దిగినట్టున్నారు.

ఊహా : ఏమిటి ? మేము వాయువిమాన పర్యటనము పూర్తి చేయకుండానే భారతఖండ మంతటా పెద్ద మార్పు వచ్చింది.

ఉప : ఇదంతా ఊహారావు సంకల్పము !

ఊహా : మఱి పాటలుండవు. ఊహలూ వుండవు.

ఇక్బల్ : ఇలా ట్రాక్టర్లు బుల్‌డోజర్లు మానవజాతిమధ్య తిరుగుతూవుంటే ఇట్టె మనకో సర్వసుందరనగరం తయారు కావచ్చు— అరుగో ! శ్రీమాన్, శ్రేయశ్రీ పూర్వాచార పరాయణు లిటువస్తున్నారు. వారే మనేరో ?

శ్రేయ : మేము మాత్రం ఏమంటాం ! తథాస్తు అంటాం !

ఓజప్ర : అయితే పాడండి నాతో ! అందఱు పాటు పడండి నాతో

"గుళ్ళూ గుడిసెలు
ఏకం—"



మన గ్రామాదుల సమస్యలు

సాంఘిక సంక్షేమ సంస్థలు చేస్తున్న సేవ

డాక్టరు వి. ఎన్. శర్మ

"యథాచిత్రకరోరూపం, యక్షస్యాతిభయంకరమ్
సమావిఖ్యస్వయంభీతః సంసారేవ్యబుధస్తదా ॥
ఆలోక్యతానశరణాన్, కరుణావశమానసః
సత్వానాముపకారాయ, బోధిచర్యాంసమాచరేత్."

"ఆచార్యనాగార్జునుడు"

మానవుని అభ్యుదయ పతనానికి మానవుడే కారకుడని అచార్య నాగార్జునుడు చెప్పినట్లు మనదేశ అభ్యుదయ పతనాలకు కారకులం మనమే ననేసంగతి మరచిపోరాదు. కొన్ని శతాబ్దాలకు పూర్వము మన పెద్దలు ఆధ్యాత్మికంగా, భౌతికంగా అపారమైన కృషిసల్పి అజ్ఞానాంధకారములో మునిగి తేలుచున్న యితర దేశీయులకు జ్ఞానోదయం కలిగించారు. మనలను మిగిలివున్న ప్రకృతి రహస్యాలను కనుగొనమని ప్రబోధించారు. శాంతి, అభ్యుదయ, సౌభ్రాతృత్వ- సౌజన్యాలతో కలసికట్టుగా పనిచేయమని ఆజ్ఞాపించారు. కాని మనం మనపూర్వులే మనకు అన్ని శాస్త్రాలు తయారుచేసి పెట్టి పోయినారని, ఇక మనం శ్రమించి పరిశోధించ వలసిన విషయాలు లేవని గర్వపడి శాంతి, అభ్యుదయ, సౌభ్రాతృత్వానికి బదులుగా స్వార్థ, ద్వేషాలతో కాలము గడపి దేశాన్ని అధఃపతనానికి అతిదగ్గరగా నిలిపామని బాగా జ్ఞాపక ముంచుకొనండి.

కాలచక్రము మనకొరకు వేచి వుండేదికాదు. అది మనో వాయువేగాలకంటె త్వరితంతా నడుస్తుంది. కాబట్టి మనం గతాన్ని విస్మరించి కాలగమనముతో పాటు మన మందరము కలిసికట్టుగా పనిచేసిన ఎడల ఈ సభ్యతా ప్రపంచములో మనదే పైచేయి కావటానికి యే మాత్రం సందేహంలేదు.

పూర్వ మొకప్పుడు మన గ్రామాలు సహకార, సహజీవన సిద్ధాంతాలతో పారిశ్రామిక కేంద్రాలుగా ఏ గ్రామానికా గ్రామం శోభాయ మానంగా విలసిల్లుచుండే వని చరిత్ర ఋజువు చేస్తూవుంది. అట్టి వాసి కెక్కిన మనం పరప్రభుత్వ పరిపాలనలో ఎందుకూ పనికి రాకుండా పోయినాము. దీనికి కారణం విదేశీయుల పరిపాలన.

విదేశీయుల పాలనలో మన గ్రామసీమ లన్నీ దెబ్బ తిన్నాయి. దానితో గ్రామ సౌభాగ్యం అంతరించి స్మశాన వాటికల్లాగ నేడు మన గ్రామాలు కనబడుతున్నాయంటే అతిశయోక్తి కాదని నా అభిప్రాయం. అవిద్యకు, అజ్ఞానానికి, అనారోగ్య దారిద్ర్యాలకు నేడు మన గ్రామాలు ఆలవాలమై పోయాయి. గ్రామవాసులకు ప్రతివిషయంలోను పట్టణాలకు పరుగులెత్త వలసిన గతిపట్టినది. చదువులకు పట్టణం, వైద్యానికి పట్టణం, కూలినాలి చేసుకొనవలయునంటే పట్టణం ఒకటేమిటి పల్లెల జీవితమంతా పట్టణాల పైనే ఆధార పడవలసి వచ్చింది. ఆహా! ఎంత మార్పు! కాలం ఒకరీతిగా నుండదుకదా! "ఓడలు బండ్లౌను బండ్లు ఓడలౌనని" మన పెద్దలు చెప్పెదరు. వారుచెప్పిన యీ సామెత అక్షరాల సత్యం. పూర్వం కొన్ని శతాబ్దాల క్రిందట పట్టణవాసుల జీవితమంతా పల్లెలమీద ఆధారపడి యుండేది. అన్ని వృత్తులవారు తమతమ వృత్తులలో నైపుణ్యాన్ని చూపేవారు. ఉదాహరణ కన్నోజు పాత్రం ఆయుధాలకు, ఢాకా మజిలినువస్త్రాలకు ఆంధ్రప్రాంతంలో కలంకారి అద్దకాలకు యితర దేశాలలో ఎంతోగిరాకి, ఎంతో పేరు ప్రతిష్టలు వుండేవి. అవన్నీ బ్రిటీషు వాళ్ళపరిపాలనలో అంతరించిపోయాయి. గ్రామసీమలన్నీ రాళ్ళసీమలయినాయి.

ఇటువంటి విపత్కర పరిస్థితులలో మనం అహింసాత్మకంగా పోరాడి పరదాస్యశృంఖాలను బ్రద్దలుచేసి స్వతంత్రభారతికి పట్టముకట్టాము అంటే సంపూర్ణ స్వతంత్రులమైనాము అంతటితో మనిపని పూర్తికాలేదు. స్వరాజ్యము పొందిన తర్వాత స్వరాజ్యంగా చేయటానికి మనమెంతో కష్టించి పనిచేయవలసి వుంది. అందరము ఐకమత్యముతో కలిసికట్టుగా పనిచేసిననాడే మనగ్రామాలు పూర్వపుటౌన్నత్యాన్ని పొందగలవు. అప్పుడే మనగ్రామ సౌభాగ్యలక్ష్మికి పట్టము గట్టగలము. "దారి దొంకలు లేని

వూళ్ళున్నా : మన పల్లెటూళ్ళు దమ్మిడీకి పనికిరావన్నా" అనే పదానికి స్వస్తిచెప్పి స్వతంత్ర భారతములో "రాచ బాటలు కలిగినూళ్ళన్నా! మన పల్లెటూళ్ళు సమస్తకళలకు ఆటపట్లన్నా!" అని చాటి చెప్పవలసిన బాధ్యత ప్రతిభారతీయునకు వుంది.

రవిఅస్తమించని సామ్రాజ్యానికి అధినేతలైన బ్రిటీషు వాళ్ళను అహింసాత్మకంగా పారదోలిన మనం దేశాభ్యుదయానికి పాటు పడగలమని నా నమ్మకం. "కృషితో నాస్తి దుర్భిక్షం" అన్నారు. కృషిచేసిన ఎడల ఫలితం లేకుండా పోదు. పరాయివారు మనమీద పెత్తనం చేసిన కాలంలో మనకున్న దృక్పథంవేరు. యీనాటి దృక్పధం వేరు. మనది యీనాడు సంపూర్ణ ప్రజాప్రభుత్వం. దానిని నడుపు కొనవలసిన వారం మనమే. మనమే మన యిష్ట ప్రకారంగా మన ప్రతినిధులను పంపుకున్నాము. ఆ ప్రతినిధులే ఈ రాజ్యాంగ యంత్రాన్ని నడుపుచున్నది. వారు ఏపార్టీకి చెందిన వారైనప్పటికి ప్రజల యోగక్షేమాలకే వారు కృషిచెయ్యాలి.

నేటి ప్రభుత్వం ఈ దృష్టితోనే తనవిధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చడానికి సంకల్పించు కొన్నది. మన కష్టనిష్ఠురాలు మన ప్రభుత్వ అధినేతలకు బాగాతెలుసు. అందు చేతనే వారు ఒకచక్కని ప్రణాళికను తయారు చేశారు. దీనినే మొదటి పంచవర్ష ప్రణాళిక అంటారు. ఈ ప్లాను ననుసరించి ప్రజల సమస్యలను పరిష్కరించడానికి దేశమంతయు హోరాహోరిగా ప్రయత్నాలుజరుగుతున్నాయి. క్రొత్తక్రొత్త జలాధారాలను నిర్మిస్తున్నారు— శిధిలావస్తలో వున్న గ్రామాలను పునరుద్ధరించే కార్యకలాపాలు అతి చురుకుగా జరుగుతున్నాయి. కూడు, గుడ్డ, వసతి, విద్య, ఆరోగ్యం, విజ్ఞాన విషయాలు ప్రతిభారతీయునకు లభించే మార్గాన్ని అనుసరించుటకు మన ప్రభుత్వం అతిసాహసోపేతంగా ముందుకు నడుస్తుంది. మనది బీదదేశం అనే విషయాన్ని మరచిపోరాదు అయినను మన ప్రభుత్వం తనశక్తి కొలది అభివృద్ధికరమైన పనులు సాగించుచునే యున్నది.

ఈ ప్రణాళిక ప్రారంభమై నాలుగేండ్లకుపైగా అయినది. ఐదవ సంవత్సరం యికకొద్ది మాసాల్లో పూర్తి ఔతుంది. ఈ కార్యకలాపాలతో ప్రభుత్వం తృప్తిపడడం లేదు. రెండో పంచవర్ష ప్రణాళికను త్వరలో ఆచరణలో పెట్టడానికి చేయవలసిన ప్రయత్నమంతా చేస్తున్నది. ఆప్రణాళికలోని కార్యక్రమమంతా నిర్విఘ్నంగా కొనసాగించామంటే మనదేశం యితర దేశాలతో సరితూగ గలదు. అన్ని దేశాలకు ఆదర్శ వంతమై ప్రపంచ చరిత్రలో ప్రధాన స్థానాన్ని ఆక్రమించగలదు.

ఈప్రణాళికలు దేశసౌభాగ్యాన్ని పెంపొందించడానికి ఎట్టిపద్ధతులవలంభించాలో అట్టిపద్ధతులనే నిర్ణయించాయి. వాటిని కార్య రూపములో పెట్టడానికి ప్రభుత్వము యేమాత్రము సంకోచించకుండా ధనాన్ని ఖర్చుపెట్టు చున్నది. జలాధారాలకు, గృహపరిశ్రమలకు, పెద్దపెద్దపరిశ్రమలకు, రోడ్లు నిర్మాణానికి మొదలయిన కార్య క్రమమంతా యీ ప్రణాళికల్లో చూడవచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా మన దేశంలో నిరక్షరాస్యతను లేకుండాచేయటానికి అవసరమైన కార్య విధానాన్ని మనం చక్కగా గుర్తించవచ్చు. ప్రభుత్వ సహకారాన్ని మన సహకారంతో మేళవించి ద్విగుణీకృతంగా మనం పని చేయవలసిన తరుణం ఇది. యీ సహకారాన్ని మనం పొందలేనప్పుడు అది మన తప్పేగాని ప్రభుత్వానిది మాత్రంకాదు. మాటలకంటే చేతలవసరమన్న సంగతి మనంబాగా జ్ఞాపక ముంచుకోవాలి.

ఈ పనులన్నీ మన దేశాభ్యుదయానికి అవసరమై యున్నవి. అవిలేకపోతే మన గ్రామాలు బాగుపడవు. కలుషితమైన పట్టణవాతావరణాన్నుంచి మనపల్లెలను సంరక్షించాలి. ఈ సమస్యల్లో మన పురోభివృద్ధికి అవసరమైంది సాంఘికసమస్య. ఈ సమస్యమూలంగా గ్రామాల్లో స్త్రీలు, పురుషులు బిడ్డలు మొదలయినవారు అనుదినము ఎదుర్కొంటున్న కష్టాలను చూచినా, విన్నా గుండెలు జలదరిస్తాయి. వీటికి మూలకారణం పేదరికం, అవిద్య, అజ్ఞానం— మన గ్రామాలునేడు దరిద్ర దేవతకు ప్రధాన మందిరాలు, ఇకవారియసహాయతను గురించిచెప్పటం అనవసరమౌతుంది, అంతా మనఖర్మ- అనుభవించక తప్పదనే మెట్ట వేదాంతం పల్లెల్లో మితిమీరి పోయింది. అందుచేతనే వీరు అష్టకష్టాలను అనుభవించు చున్నారు అజ్ఞానాన్ని ప్రకోపింపజేసే ఈ కర్మసిద్ధాంతమనే చీడపురుగును నాశనం చేయకపోతే మనకు భవిష్యత్తే శూన్యం. దీనినే మనం అర్థం చేసుకోవాలి. ఈ సమస్యను నిర్బంధంగా, నిర్మోహమాటంగా చక్కబెట్టు కోడానికి మనం ముందుకు రావాలి. ఈ సమస్యను సర్వతో ముఖంగా పరిష్కరించటానికి పైవర్గాలవారు త్యాగం చేయాలి. మన

శక్తినంతా ప్రప్రథమంగా సాంఘిక వ్యత్యాసాన్ని నేల మట్టం చేసేవరకు ఉపయోగించి తీరాలని నా అభిమతం—

"కరో పహలే పీఛేకహో" అన్న గాంధీజీ పలుకులను మనం నేడు ఆచరణలో పెట్టినప్పుడే ఆ మహామహుని ఆత్మకు శాంతి. కనుక సాంఘిక సంక్షేమసలహా సంస్థ లిస్తున్న కార్యక్రమాన్ని ప్రజలు ఉత్సాహపూరితంగా నెర వేర్చగలిగిననాడు మనదేశం తేజోవంతమై, వీర్యవంతమై, కీర్తివంతమై విలసిల్లగలదు.

సాంఘిక సంక్షేమ సలహాసంఘము. దానిస్వరూపం.

ఈ సంస్థకు కేంద్రస్థానం ఢిల్లీనగరము అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ గారు. శ్రీమతి ఇందిరా గాంధి. హన్నాసేన్, పద్మినీసేన్ గుప్తా, మణిబెన్ పటేల్ మొదలగు ప్రఖ్యాతసంఘసేవాపరాయణురాండ్రు ఈసంస్థకు సభ్యురాండ్రు. ప్రభుత్వపువిద్యాశాఖ, ఆరోగ్యశాఖ, కార్మిక శాఖ, ఆర్థికశాఖ, ఈ సంస్థకు బెట్టిన కార్యకలాపానికి తోడునీడగా వుండటానికి ఆయాశాఖల ప్రతినిధులను సభ్యులనుగా ఈ సంస్థ నిర్వచించింది. సాంఘిక సంక్షేమ కార్యాల్ని ఒకఢిల్లీ నగరంలో నుంచే చూసు కొనడంలో యీపనిముగియదు. అందుచేతనే ప్రతిరాష్ట్రంలో సాంఘిక సంక్షేమసలహా సంస్థల్ని కేంద్రసంఘం నియమించింది.

ఇప్పుడు మన దేశాన్నంతట పనిచేస్తున్న సలహా సంస్థలు 28 వరకు వున్నాయి. ఈమధ్యనే క్రొత్తగా నిర్మింపబడ్డ పుదుచ్చేరి రాష్ట్రానికి ఈపంథాలోనే సలహా సంస్థ స్థాపింప బడ్డది.

మనతెలుగు దేశంలో క్రిందటి సంవత్సరమే నిర్మింప బడ్డ సలహాసంస్థకు శ్రీమతి చన్నఘంటమ్మ కృష్టారావు గారు అధ్యక్షురాలు. తెలుగుజిల్లాలో స్త్రీల అభ్యుదయానికి, పిల్లల సంక్షేమానికి నిరంతర సేవాదీక్షతో నిమగ్నులై వున్నవారు సభ్యులుగా వున్నారు. ఈ సంస్థకు కేంద్ర స్థానం ప్రస్తుతం మదరాసు.

ఈ సంస్థ యాజమాన్యం క్రింద జరుపబడే సాంఘిక సేవ యేపెద్దఅధికారుల అదుపాజ్ఞల్లోనో అధికారయంత్రా నికి అనుగుణ్యంగానో నడుపబడే పనికాదు. ఇది ప్రజల సంస్థ. ప్రజల్లో పలుకుబడి గలవారే ఈపనులను సమర్థించ గలరని మాత్రం మనం జ్ఞాపకముంచుకోవాలి.

జాతీయవిస్తరణ సేవాపథకాల మూలకంగా చేస్తున్న సేవనుచూస్తూ ఉత్సాహవంతులయిన యువతీ యువకులు కార్యరంగంలోకి దుముకుచున్నారు- శిశు సంరక్షణకు, స్త్రీ సంక్షేమానికి, వికలాంగుల సంరక్షణకు, బాలనేరస్తుల సంస్కరణకు యీ సంస్థ ఎంతో ప్రాముఖ్య మిస్తుంది. ఈకార్యం సామాన్యమైనది కాదు. ప్రభుత్వాధికారులు నిర్వహిస్తున్న సంస్థలు ఎంతఉత్సాహాన్ని చూపెట్టుతూ వున్నా వారు దీనిని సక్రమంగా గ్రామీణ ప్రజాకోటి వాతా వరణానికి అనుగుణ్యంగా పని చేయటం చాలా కష్టం— అంచేత ఈ సంక్షేమ సంస్థయొక్క దృష్టి సాంఘికసేవ కుల మీదనే యున్నది. ఈ పనులన్ని నిర్విఘ్నంగా కొన సాగటానికి అయ్యేఖర్చులో సగభాగం ఈసంస్థయిస్తుంది రాష్ట్రీయ ప్రభుత్వం పాతికభాగం గ్రాంటుగా నిస్తుంది. మిగతా పాతిక భాగాన్ని ఇట్టి పథకాలమూలంగా లాభం పొందే గ్రామీణులు భరించటానికి సిద్ధంగా వుండాలి.

ఏ పనైనా స్వయంకృషి వల్లనే నెరవేరుతుంది. దానికి ప్రజలు ఉత్సాహం చూపాలి. ప్రతి గ్రామంలో అందరూ కాకపోయినా యే కొద్దిమందో ఆస్తిగలవా రున్నారు. వారు ఎంతో దుబారా ఖర్చులు చేస్తూ వుంటారు. వారికి త్యాగబుద్ధి లేకపోలేదు. వారు పెట్టే ఇతర ఖర్చులనే యీ సాంఘిక సేవకు వినియోగించేరంటే తద్వారా తమ గ్రామాల్లో అష్టకష్టాలు పడుచున్నవాళ్ళకు ఈ సాంఘిక సంక్షేమ సంఘంద్వారా పైకి తీసుకొని రావటానికి ఉప యోగ్యపడినవారవుతారు. అప్పుడు మన సాంఘిక సమ స్యలు యే ఆర్భాటం లేకుండా అతిసులభంగా తీరి పోతాయి.

దేశం మొత్తంమీద 320 జిల్లాలలో ఈ పథకం చక్కగా సాగుతుంది. 811 కేంద్రాలు నెలకొల్పబడ్డాయి. 3500 గ్రామాలు వీనివల్ల సహాయాన్ని పొందుతూ వున్నాయి. ఈ మధ్య కేంద్ర సంస్థ ప్రకటించిన నివేదికనుబట్టి గ్రామస్తులు ఈ కార్యానికి చేయూతనిస్తూ ముందంజవేస్తున్నారని తెలు తుంది. 38 లక్షల ప్రజలు ఈ ప్రణాళిక మూలకంగా పూర్తి సహాయాన్ని పొందారు. ప్రభుత్వం ఈ సంస్థ సలహాపై శిశుసంక్షేమానికి 14 లక్షల రూ॥, స్త్రీ జనాభ్యు దయానికి 17 లక్షలు, ఇతర సంక్షేమ కార్యాలకు 25 లక్షలు గ్రాంటునిచ్చారు. ఈ మొత్తంలో సగభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరించాయి. గ్రామస్తులు మిగతా భాగాన్ని యేమాత్రం తటపటాయించక ఉత్సాహంతో భరిస్తూ లాభం పొంది ధన్యులయ్యారు.

మన గ్రామాదుల సమస్యలు

ఇదంతా దేశం మొత్తంమీద జరుగుతూవున్న కృషి. ఇక మన ఆంధ్రదేశం సంగతి. సేవానిరతిలో త్యాగంలో; ఉత్సాహంలో తెలుగువారు ఇతర రాష్ట్రాలవారికంటె తీసిపోరు. గత ఫిబ్రవరి వరకు మనదేశంలో ఈ పనిని వాకచక్యంగా కొనసాగించటానికి నిర్మించబడ్డ ఆంధ్ర రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా సంస్థ ప్రకటించిన రిపోర్టు ప్రకారం 122 స్వచ్ఛంద సేవా సంస్థలు రాష్ట్రంలో ఎంతో దీక్షతో పని చేస్తూవున్నాయి. 24 సంఘాలు శిశు సంక్షేమానికి 51 సంఘాలు స్త్రీ జనాభ్యుదయానికి 47 సంస్థలు ఇతర సంక్షేమ కార్యకలాపాలకు పూనుకొని పని చేస్తున్నాయి. వీటి కారక్రమానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ 5 లక్షల రూ॥గ్రాంటుల నిచ్చింది.

మన గ్రామాల్లో వైద్య సహాయం అసలే లేదని చెప్పాలి. వైద్య సహాయం లేనందువల్ల మన గ్రామాల్లో పసి పిల్లలు బాలింతలు చావటం ఎక్కువైపోయింది. అందరికి సమీపములో నున్న బస్తీ ఆసుపత్రికి మాతా శిశువులను పంపటానికి వలనుపడదు. గర్భిణీ స్త్రీ బ్రతికి బైట పడడం అంటే గ్రామాల్లో మరల పునర్జన్మ ఎత్తినట్లే. పల్లెల్లో తెలిసి తెలియని మంత్రసానులవల్ల ఎంతో మంది గర్భిణీ స్త్రీలు చనిపోవటం జరుగుతుంది. వున్నవారైనా ముందుగా సమీపములో నున్న యేదో ఒక ఆసుపత్రికి తీసుకపోదామని వారికి వుండదు. ప్రసవ వేదనతో పాటు గ్రామీణ మంత్రసాని వైద్యం అయిన తర్వాత ప్రాణంమీదకు వచ్చినప్పుడు ప్రయాణంకట్టారు. ఇంతలో ఆ పుణ్యకాలం కాస్త దాటిపోతుంది తర్వాత మన ఖర్మ అలావుందిలే అని సమాధాన పడటం చూస్తే చాలా బాధగా వుంటుంది. ఇటువంటి బాధలన్నీ ఈ గ్రామ సంక్షేమ సంఘాలద్వారా మన దేశంలో మాతా శిశువులకు రక్షణ గలగటం ఎంతో ముదావహం.

అందువల్ల గ్రామస్తులు ఈ మాతా శిశు సంరక్షణాలయాన్ని నిర్మించడానికి స్థలాలనుఉదారంగా దానరూపంతో యిచ్చివెయ్యాలి. ఇస్తున్నారు కూడాను. ఇండ్లను కూడా నిర్మిస్తున్నారు. వాటిలో వైద్య సహాయానికి అవుసరమైన పరికరాలను ఉత్సాహంతో యిస్తూనేయున్నారు. ఇట్టివైద్య శాలలవల్ల వాటిని నెలకొల్పిన గ్రామస్థులేకాక చుట్టు ప్రక్క నున్న గ్రామాల వారుకూడా వైద్య సహాయాన్ని పొందగలుగుచున్నారు.

మన గ్రామాల్లో స్త్రీలు సంవత్సరంలో 6 నెలలు తీరికగా వుంటారు. ఆ సమయంలో వారు తమ జీవితానికి అవసరమైన పనులను చక్కగా నేర్చుకోవాలిగాని కాలం వృధా చేయరాదు పోయిన సమయం మన జీవితం తిరిగి యిక రాదన్న సంగతి బాగా జ్ఞాపకముంచుకోవాలి. స్త్రీలు ముఖ్యంగా తీరిక సమయాల్లో కుట్టుపని, అల్లిక పని, అద్దకం మొదలయినవి నేర్చుకొనిన ఎడల వాటివల్ల ఆదాయం రావటమేగాక మందమతితనం పోయి చురుకుదనం యేర్పడి ఆర్థికంగా బాగుపడతారు. అనేక గ్రామాల్లో గ్రంథాలయాలు నెలకొల్ప బడుతున్నాయి. స్త్రీలకు ప్రత్యేకంగా చదువు చెప్పటానికి తరగతులను కూడా ప్రారంభించి పనిచేస్తున్నారు.

ఈ విషయంలో తెలుగు ప్రాంతంలో మహిళా సంస్థలు నేడు చేస్తున్న సేవ ప్రశంశనీయమనే చెప్పాలి. స్త్రీలకు తమవారి సాధక బాధకాలు బాగా తెలుసు. వాటిని సరిదిద్దటానికిఆయా గ్రామాలవాతావరణానికి అనుగుణ్యంగా ఆచరణలో పెట్టవలసిన పధకాలు వారికి చక్కగా తెలుసు. అందుచేనేత స్త్రీలు ఈరంగంలో చేస్తూవున్నకృషి ద్విగుణీకృతంగా కొనసాగిపోయింది అనారోగ్యం, అవిద్య అజ్ఞానం, అశుభ్రత మొదలయిన దురలవాట్లన్ని నేడు వీరి కృషివల్ల మటుమాయమైపోతున్నాయి. ఇక గ్రామ సీమలు యీ సంక్షేమ సంఘాల కృషివల్ల స్వర్గసీమలవటానికి యే మాత్రం సందేహంలేదు.

★



సంక్షేమం

నైతిక దృష్టియే
సాంఘిక సంక్షేమానికి పున



ప్రపంచంలోని దారిద్ర్యాన్ని, అనారోగ్యాన్ని, హింసనూ చూచి మహా పురుషుల హృదయాలలో ప్రజ్వరిల్లిన ఆవేదనయే కరుణరసంగా మారింది. ప్రాణికోటుల దుఃఖాన్ని నిర్మూలించుటకు ఎంతో తపస్సు చేసి "అహింసా పరమో ధర్మః" అను సూత్రమును ప్రబోధించి విశ్వమానవ కల్యాణమునకై స్వార్థమును త్యజించిన మహా పురుషుడు బుద్ధ భగవానుడు. స్వార్థరహితమైన సంఘ సంక్షేమ కృషివల్లనే "సర్వేజనాస్సుఖినో భవంతు" అను ఆర్యోక్తి సఫలీకృతము గును.

సంక్షేమ విస్తరణ ప్రణాళికలు

"ఈ ప్రణాళికా నిర్వహణలో- అకుంఠితమైన దీక్ష తోడుకాగా, విజ్ఞానము ప్రగతి పథాన నడిపించగా, మనం సంపాదించిన విశేషానుభవం కార్యసాధనకి తోడ్పడగా-ముందుకు సాగిపోదాం!"

—శ్రీమతి దుర్గాబాయ్ దేశ్ ముఖ్.

3,710, 455 జనాభాగల 3,445 గ్రామాలలో 181 సంక్షేమ విస్తరణ ప్రణాళికలు ఇంతవరకు స్థాపింప బడ్డాయి.— ప్రతిప్రణాళికా ప్రాంతంలోనూ 5 నుండి 7 వరకూ కేంద్రాలు పనిచేస్తాయి ఈ విధంగా ఇంత వరకు 811 కేంద్రాలు నెలకొల్ప బడ్డాయి. వీటిలో గ్రామ సేవకులు 1676 మంది నియమింప బడ్డారు. కేంద్రసాంఘిక సంక్షేమ సంస్థ ఇటీవలి నిర్ణయం ప్రకారం ప్రతి కేంద్రం లోనూ ఇప్పుడు పనిచేస్తున్న ఇద్దరికి బదులు ముగ్గురు నియమింప బడతారు. దీనివల్ల మరి కొంత మందికి పని దొరుకుతుంది. ఇంకొక 34 ప్రణాళికాప్రాంతాలు 1955 లోపుగానే పని చేయడం ప్రారంభిస్తాయని కేంద్రసాంఘిక సంక్షేమసంస్థ భోగట్టా.

అస్సాం రాష్ట్రీయసంస్థ ఇంతవరకూ ఎనిమిది ప్రణాళికా ప్రాంతాలలో పని ప్రారంభించింది. ఎంత తక్కువలో పని మొదలు పెడితే అంత చురుకుగా, అత్యధికమైన ప్రయోజనం సాధింపవచ్చునని వీరి అభిప్రాయం.

నౌగాంగ్‌లోని చక్‌చలీ సంక్షేమవిస్తరణ ప్రాంతంలో కిండర్‌గార్టెన్ పాఠశాలలు స్థాపింప బడ్డాయి— వీటిలో చేరే పిల్లల సంఖ్యకూడా రోజు రోజుకీ పెరుగుతుందని వార్తలు వచ్చాయి. ప్రతి కేంద్రంలోను దాదాపు 50 మంది విద్యార్థు లున్నారు. వీరికి భారత రెడ్‌క్రాస్ సంఘపు రాష్ట్రీయ శాఖవారు ప్రతిదినం ప్రతి బాలునికీ అరపౌను పాలు ఉచితంగా ఇస్తారు.

ఇక్కడ ఇంకొక ముఖ్యమైన విషయం— పిల్లలే బట్టలు శుభ్రంచేసే లాండ్రీని నడుపుతున్నారు. ఈ పాఠశాలకి వచ్చే పిల్లల ఉడుపులన్నీ, వీరే శుభ్రం చేసుకుంటారు. ఈ పని స్వయంగా చూడడానికి పిల్లల తల్లులు ఆహ్వానింప బడుతుంటారు! కుటీర పరిశ్రమల శాఖకీ, మాతాశిశు సంరక్షణ కేంద్రానికీ వీరే చిన్నచిన్న కుటీరాలు నిర్మించారు. వీరి పరస్పర సహకారానికి మచ్చుతునక "వీరి ధాన్యపు నిలువ గిడ్డంగి" ప్రబల తార్కాణం. ఒక వేళ క్లిష్టపరిస్థితులలో ఆహారపు దినుసులు దొరకక పోతే ఉపయోగించడానికి ఈ ధాన్యం నిలువచేసే పద్ధతి ఎంతగానో ఉపయోగిస్తుంది. ఈ పిల్లల దూరదృష్టికి ఇంతకంటే నిదర్శనం ఇంకేమి కావాలి? ఈ గ్రామాలలోని వివిధ ప్రజలకు కొంకిపురుగు వ్యాధి రాకుండా కన్నపు పాయఖానాలను నిర్మించడానికి ఈ స్వచ్ఛంద సేవకులు కృషి చేస్తున్నారు. ★


వెలుగుబాట

శ్రీమతి నీరాకార్వే.

మానవసేవయే మాధవసేవగా ఎంచి జీవితమంతా సంఘసేవకూ, మహిళాభ్యున్నతికీ అర్పణచేసి, అనేక సంఘసంస్కరణలకు మార్గదర్శకుడైన మహర్షి ధోండో కేశవకార్వే జీవితవిశేషాలను వారి మనుమరాలు, నీరాకార్వే చక్కగా వ్రాశారు. వారి మనుమరాలే వ్రాయుటవలన సన్నిహితంగాను ఆర్ద్రంగానూ ఉందని పాఠకులే గ్రహించగలరు.

తాతయ్య మాతో చాలా అరుదుగా ఉండేవారు. ఆయన జీవితమంతా ఆయనకు ప్రియమైన సంస్థకే అర్పణ అయింది. తమ పిల్లలకోసం కొద్ది క్షణాలు ఇక్కడా, కొద్ది క్షణాలు అక్కడా తప్పిస్తే తక్కిన కాలం అంతా నిరంతరమూ పనితో పెనగులాడుతూ ఉండేవారు. అయినా ఒక్కొక్కప్పుడు అనుకుంటాను 'మా తాతయ్య సంగతి మాకు కరతలామలక'మని. ఎందుచేతనంటే ఒక్కొక్కప్పుడు తాతయ్యను గురించి తెలుసుకోడానికీ, అర్ధంచేసుకోడానికీ మా కుటుంబంలో మాలో మేము సంప్రదించుకునేవాళ్ళం. ఆయన జీవితానుభవంనుంచి ఏమైనా నేర్చుకోవాలనే ఆశతోనే ఎప్పుడూ మాట్లాడుకొనేవాళ్ళం.

తాతయ్య శైశవం మురుద్ అనే గ్రామంలో ప్రారంభం అయింది. ఇది బొంబాయి రాష్ట్రంలో రత్నగిరి జిల్లాలో ఒక చిన్న గ్రామం. కార్వే వంశస్థు లక్కడ నివసించేవారు. తాతయ్య విద్యాభ్యాసం కొంత ఆలస్యంగానే మొదలుపెట్టేరు. మురుద్‌లోని పాఠశాలలో శిక్షణ మాత్రమే జరిగేది. పరీక్షలకు బొంబాయికో, సతారాకో, వెళ్ళవలసివచ్చేది. ఆరోజుల్లో రాకపోక లంత



తేలిగ్గా జరిగేవికావు. అయినా ప్రయాణీకులను బొంబాయి రేవుకు ఒక స్టీమరు దాటించేది. మాధ్యమిక పరీక్షతో సమానం అయిన పరీక్షకోసం బొంబాయి వెళ్ళడానికి తాతయ్య నిశ్చయం చేసుకున్నారు. తాతయ్య బొంబాయికి ప్రయాణం అవడానికి సరిగ్గా నాలుగు రోజులు ముందు వర్షాలు కురవడం ప్రారంభించాయి, విపరీతంగా కురవడం వల్ల స్టీమరు రాకపోకలుకూడా ఆగిపోయాయి. తాతయ్య బొంబాయి వెళ్ళలేకపోయారు. ఇంత శ్రమా వృధా అయిపోయేలాగ కనపడ్డది. అందుకు ఆయన సహించ గలరా? పరీక్షకు వెళ్ళాలి. పాస్ కావాలి పరీక్ష పాస్ కాకపోతే కాలేజీ చదువు సున్న. కాలేజీ చదువు లేక పోతే ఉద్యోగంలేదు. కార్వేయులు ధనవంతులుకారే, బొంబాయి కాకపోతే ఇంక సతారా వెళ్ళాలి. అది నూట పదిమైళ్ళ దూరంలో ఉంది. అప్పట్లో సతారాకు రైలు మార్గంలేదు. ఎవరైనా సరే నడిచి వెళ్ళాలి లేకపోతే ఇంట్లో కూర్చోవాలి. తాతయ్య నాలుగు రోజుల్లో నూట పది మైళ్ళ దూరం తన పదిహేడో ఏట నడిచివెళ్లారు.

పుస్తకాల సంచీ, సామానుల మూటా మోస్తూ అలసి పోయి సతారాచేరుకునే టప్పటికి రాత్రి అయింది. వర్షంలో తడిసిముద్దయి, రాత్రంతా బయటనే ఉండవలసి వచ్చింది. ఆరోజుల్లో పరీక్షలంటే పుస్తకాలు బట్టీపట్టడమేకాకుండా ఎన్నో జలప్రళయాలను ఎదుర్కొని మళ్ళీ పేపర్లు వ్రాయ డానికి తయారుగాఉండాలి. ఇంక తెల్లారితే పరీక్ష.

ఉదయం చాలా ఆశాజనకంగా ఉంది. సూర్యుడు స్వచ్ఛంగా వెలుగుతున్నాడు, ఎక్కడుందో తెలుసుకుని తాతయ్య స్కూలు చేరుకున్నారు. ఇంతకీ పరీక్షకు వెళ్లగలుగుతున్నారు. హాలు గుమ్మంలోనుంచి లోపలకు ప్రవేశించారు. అక్కడే ఆయన ఆశలన్నీ ఫలిస్తాయి కలలన్నీ రూపం ధరిస్తాయి. తాతయ్య ధైర్యంగా లోపలికి ప్రవేశించారు.

"నీ పేరేమిటి అబ్బాయ్!" అనే ప్రశ్న వినవచ్చింది.

"ధోండో కేశవ కార్వే! మాది మురుద్."

"ఈ పరీక్షకు కూర్చోవాలంటే నీకు పదిహేడు ఏళ్ళ వయస్సుండాలి. నీకు తెలియదూ?"

"తెలుసు. నాకు పదిహేడేళ్ళూ ఉన్నాయి. ఈ పరీక్షల కోసం నూట పది మైళ్లు నడిచి వచ్చాను.

వారు ఆమాటలు నమ్మలేదు. పుట్టిన తేదీ సర్టిఫికెట్టు చూపిస్తానన్నాకూడా వారు ఒప్పుకోలేదు. ఆయనవైపు చూచి అందరూ లేదని తలలూపేరు. పాపం వాళ్ళు వయసు తక్కువవాణ్ణి పరీక్షలో కూర్చోనిచ్చి తమకు ఆపద తెచ్చుకో దలచలేదు.

ఇంత కష్టపడి చదివి, ఇన్ని బాధలూ పడినా అప్పుడు పరీక్షకు వెళ్ళడానికి వీలులేకపోయింది. ఖిన్నుడై తిరిగి వచ్చేశారు. తాతయ్య పొట్టిగా పీలగా ఉండేవారు. అందు చేత వయసు ఉన్నట్టు కనపడేవారుకాదు. మరుచటి సంవత్సరం పరీక్షలో కూర్చున్నారు. ఘనంగా పాస్అయారు. మురుద్ పాఠశాల చదువు ఆఖరయింది.

* * *

తాతయ్య పూర్వులు అంతగా ధనవంతులుకారు. అప్పటి పీష్వాలకు ఉపాధ్యాయులుగా ఉండి సామాన్య జీవితం వెళ్ళబుచ్చేవారు. తాతయ్య తండ్రిగారికి సంవత్సరానికి ఇరవై అయిదున్నర రూపాయల జీతం. తన సంసారంలో అయిదుగురుని పెంచాలి. తాతయ్య పెద తండ్రిగారు తాతయ్యమీద ఎంతో ఆశ పెట్టుకుని పెద్ద చదువు చదివించాలని నిశ్చయంచేశారు. తాతయ్యను రత్నగిరికి చదువుకోసం పంపేరుకాని మలేరియా జ్వరం వల్ల అక్కడ సాగిందికాదు. తిరిగి వచ్చి ఆ సంవత్సరాంతంవరకూ మురుద్‌లోనే చదివి తరవాత బొంబాయి వెళ్ళడానికి నిశ్చయించారు. కాని బొంబాయిలో కాపురం చెయ్యడం మాటలా? ఎంత ధనం ఉండాలి!

తాతయ్య ఎన్నో కష్టాలు పడవలసి వచ్చింది. స్కాలరుషిప్ కోసం ప్రయత్నాలు చేశారు. అందుకు దస్తూరీ బాగా ఉండాలి. తాతయ్య దస్తూరీ బాగా ఉండేది కాదు. ఎంతో శ్రమపడి అభ్యాసం చేశారు. పరీక్షకు వెళ్లారు. మేష్టరు జాక్సన్‌దొర ఆ దస్తూరీ నమ్మక తన ఎదుట వ్రాయమన్నాడు. రెండు దస్తూరీలు సరిగా ఉండక పోతే తాతయ్య బెత్తం దెబ్బలు తినవలసినవారే. కాని రెండు దస్తూరీలు సరిగ్గానూ, చక్కగానూ ఉన్నాయి. ఇదంతా ఇంకొక విద్యార్థి తాతయ్యమీద అసహనంచేత ఇంకొకరిచేత వ్రాయించారని అసత్యం ఆరోపించాడు.

తాతయ్యకు స్కాలరుషిప్ లభించింది. ఆ సంవత్సరం ప్రధమ శ్రేణిలో పాస్ అయిన పదహారుగురిలోనూ తాతయ్య ఒకరు. ఇందువల్ల నెలకు ఎనిమిది రూపాయల

స్కాలరుషిప్ వచ్చింది. పైగా క్రింది తరగతి పిల్లలకి పాఠాలు చెపుతూ కొంత సంపాదించేవారు. తన అవసరాలనుకూడా కొంత త్యాగం చేసి ఎలాగో బొంబాయిలో సంసారం గడుపుతూ తన ఇరవై ఎనిమిదో ఏట ధొండో కేశవ కార్వే అనే తన పేరుకు బి. ఏ. అనే అక్షరాలు చేర్పించారు. ఇది చాలా గొప్ప విషయం ముఖ్యంగా ఆరోజుల్లో. బి.ఏ లు అప్పుడు అరుదు. అందులోనూ నెలకు మూడున్నర రూపాయలతో బొంబాయిలో జీవించడం అసంభవం. సంతోషించతగ్గ సంగతి. పట్టభద్రు లెవ్వరూ నిరుద్యోగులుగాలేరప్పుడు. తాతయ్యకు మంచి ఉద్యోగం దొరికింది- అధ్యాపకత్వం.

తాతయ్యకు అప్పటి ఆచారాన్నిబట్టి పదునాలుగో ఏటే వివాహం అయింది. వధువుకు ఎనిమిదేళ్ల వయస్సు. ఆమె అంటే అందరికీఇష్టం. పెద్దవాళ్ళయాక తాతయ్య సెలవుల్లో ఇంటికి వచ్చేవారు. పెళ్లయిన పదేళ్ళకి ఒక కుమారుడు కలిగాడు. కాని ఆమె ఆరోగ్యం చెడిపోయింది. తాతయ్య ఉద్యోగంలో స్థిరపడడంతోనే భార్యనూ కొడుకునూ బొంబాయి తీసుకువెళ్ళారు.

బొంబాయిలో జోషీ అనే ఒక స్నేహితుని కుటుంబం తాతయ్య కుటుంబం కలిసి ఉండేవారు. త్వరలోనే కష్టాలు వచ్చాయి. పాపం జోషీ భార్య చనిపోయింది. వారి కుటుంబానికి కూడా అన్ని పనులూ వంటతోసహా ఈమెయే చెయ్యవలసివచ్చింది— జ్వరంతో ఉన్నానరే. జబ్బు ఎక్కువైపోయింది. ఆమెను మురుద్‌కు పంపేశారు. ఇప్పటిలాగ అప్పుడిన్ని మందులా? పాపం తాతయ్య భార్య మరణించడానికి కారణం తాను తగిన సదుపాయాలు చేయలేకపోవడమేనని తాతయ్య ఎంతో బాధపడుతూండేవారు.

* * *

తన మొదటి భార్య చనిపోవడంతోనే తాతయ్యకు మళ్ళీ వివాహం చేసుకోవాలి అన్న ప్రశ్న అంకురించింది.

తాతయ్య అనుకునేవారు "భర్తయే చనిపోయి ఉంటే భార్య తిరిగి వివాహం చేసుకోరాదుకదా: ఆమెను అశుభ సూచకంగా చూస్తారు. నలుగురిలోనుంచి వేరుచేసి నీచ పరుస్తారు. అవమానించి చిత్రహింసలు పెడతారు. భార్య పోయిన భర్త ఈ బాధలన్నీ లేకుండా ఎందుకు తప్పించుకుపోవాలి. స్త్రీలే ఎందుకు అనుభవించాలి" అని. తన దృష్టిలో స్త్రీ పురుషులు సమానులే; ఇద్దరూ మానవులే; ఇద్దరినీ ఒకే విధంగాచూడాలి. భర్తపోయిన స్త్రీకి పునర్వివాహానికి హక్కులేకపోతే భార్యపోయిన పురుషునికి కూడా తిరిగి పెళ్ళిచేసుకోడానికి అధికారం లేదు. అందుచేత కన్యను వివాహం ఆడడానికి తాతయ్య సమ్మతించలేదు. గోపాలకృష్ణ గోఖలే ఆహ్వానంమీద తాతయ్య పూనా వెళ్ళి గణితశాస్త్రోపాధ్యాయునిగా పనిచేయడం మొదలుపెట్టేరు.

పూనాలో పండిత రామాబాయి అనే ఒక అసమానురాలైన గొప్ప మహిళామణి ఉండేవారు. వారు 'శారదా సదన' మనే పేరుతో ఒక స్త్రీ సదనాన్ని నడిపేవారు. తాతయ్య స్నేహితుడైన జోషీగారి చెల్లెలు- వితంతువు- అక్కడే ఉండేవారు. జోషీ తండ్రిగారు ఆమెను చూడడానికి పూనా వచ్చినప్పుడల్లా తాతయ్యవద్ద బసచేసేవారు తండ్రిగారి కోసం ఆమెకూడా తాతయ్య ఇంటికి వచ్చేది. ఆమెకు తిరిగి వివాహం చెయ్యాలని జోషీగారి ఉద్దేశం ఉండేది. కన్య అని ప్రజలను మభ్యపెట్టి వివాహం చెయ్యడానికి ఆమె ఒప్పుకోలేదు. జోషీగారు తాతయ్య అభిప్రాయం తెలుసుకున్నారు. ఆమె కూడా అంగీకరించిన మీదట తాతయ్య అన్నారు "నేను ధనికుణ్ణికాను. పండిత రామాబాయిగారివద్ద పొందుతున్న సదుపాయాలు నేను కల్పించలేనే; అదీగాక మాది అవిభక్త కుటుంబం. చాలా కష్టపడాలి; మళ్ళీ ఆలోచించుకోవలసింది" అని.

తాతయ్యకు మళ్ళీ పెళ్ళి అయింది. వితంతువైన గోదూబాయి కార్వేగారి ధర్మపత్ని అయింది. దేశంలో గొప్ప సంచలనం బయలుదేరింది. ఇది ఒక్క బ్రహ్మాండమైన తిరుగుబాటు పూనాలో జరిగిన మొట్టమొదటి వితంతు వివాహం అదే.

1893 వ సం॥ మార్చి 11 వ తేదీనాడు జరిగింది. అప్పటి సంఘంలో పాతుకుపోయిన ఆచారం పునాదులతో కదిలిపోయింది. అరవై సంవత్సరాల క్రిందట హైందవ కుటుంబాలలో ఇలా జరగడం సామాన్యమైన విషయం కాదు. సాధ్యమూకాదు. ఎన్నో విమర్శలు, ఎన్నో తిరస్కారాలు, బహిష్కారాలు. తాతయ్య, తన బంధువులకు ఆమెను చూపించాలని మురుద్ తీసుకువెళ్లారు. అక్కడి పురోహితుడు వారిని బహిష్కరించాడు. ఆయనతో సంపర్కం పెట్టుకున్న వారినికూడా బహిష్కరిస్తానని భయపెట్టేడు. తాతయ్య భార్యతో కలిసి పశువుల

పాకలో ఉండవలసివచ్చింది. అన్నిటికంటే సహించ రానిది అందరూవచ్చి వారిని అసహ్యంగా చూడడం.

తాతయ్యకు తరువాత నలుగురు కుమారులుకలిగారు. ఇంకా పునర్వివాహితులకు ముందుగానే ఉన్న కొందరు పిల్లల్నీ దిక్కులేని అనాధ బాలురనూ తాతయ్య పెంచే వారు. మా నాయనమ్మ ఆశ్రమానికి చందాలు వసూలుచేసి ధనం సంపాదించి వీరందరినీ పెంచేవారు. తన పిల్లలకు ఇరవై సంవత్సరాల వరకే తాను వ్యయం చేస్తాననీ తరవాత చదువుకి అయిన ధనం వారికి అప్పుక్రింద కడతాననిచెప్పేరు. నాయనమ్మ తన పిల్లల విద్యాభివృద్ధు లకు ఎంతోశ్రద్ధ తీసుకునేవారు తాతయ్య తన ఐదువేల రూపాయీల ఇన్స్యూరెన్సు పోలసీని ఆశ్రమానికి ఇచ్చేరు.

ఈరోజుల్లోనే నాయనమ్మకూడా స్కూలుకి వెళ్ళి చదువు కునేవారు. నాగపూర్ పంపి అక్కడ మంత్రసానిగా తరిఫీదు చేయించారు. వారు అక్కడ ఉన్నప్పుడు ఆశ్రమం తాలూకు బాధ్యతలు తాతయ్యమీద పడ్డాయి స్వజనం నిమిత్తం తాతయ్య ఏ సిఫారసులూ చేసేవారుకాదు.. అందుచేతనే మా పెదనాన్నగారికి ఫెర్గూసన్ కాలేజీలో సహాయవేతనం లభించిందికాదు. మా నాయనమ్మగారు చదివిన క్లాసులోనే పాసయినా రెండేళ్ళుండవలసివచ్చింది.

తాతయ్య రెండో వివాహంవల్ల వితంతువుల అభ్యు దయం ముందుకు సాగింది. "వితంతువుల వైవాహిక సంఘం" ఒకటి నెలకొల్పబడింది. ఇదికాక ప్రత్యేకంగా 1896 లోనే "వితంతు శరణాలయం" స్థాపించబడి అందు స్వయంపోషకవిద్య నేర్పే ఒక పాఠశాల కూడా నెలకొల్పబడింది.

పూనాలో ప్లేగు రావడంవల్ల వితంతు ఆశ్రమం హింగనేకు మార్చవలసివచ్చింది. తాతయ్య పూనాలో ఉద్యోగం చేసుకుంటూ సాయంత్రం ఆశ్రమానికికావల సిన సామానుల మూట మోసుకుంటూ హింగనేకువచ్చి రాత్రి అక్కడి పిల్లలకు పాఠాలు చెప్పి ఉదయాన్నే తిరిగి పూనా వచ్చేసేవారు. ఇలా రెండు సంవత్సరాల పాటు చెయ్యవలసివచ్చింది. అప్పుడు ఒక వసతిగృహంగా ప్రారంభించిన శరణాలయం ఇప్పుడు ఎంతో అభివృద్ధి పొందింది. ఎన్నో భవనాలు నిర్మింపబడ్డాయి. అయిదు వందలమంది విద్యార్థులు చదువుకోడానికి తగిన స్కూళ్ళు- చిన్నపిల్లలకు, ప్రాథమిక విద్యార్థులకు, హైస్కూలు విద్యా ర్థులకు— అన్నిసౌకర్యాలతోనూ నిర్మింపబడి జాతిమత వివక్షతిలేకుండా, బాలికలూ, స్త్రీలూ, వితంతువులూ అందరి నివాసానికి ఆటపట్టయింది ఆ ఆశ్రమం.

వైవాహిక వయోపరిమితి పెంచిన ట్లయితే కొన్ని దుస్సంఘటనలు అరికట్టవచ్చు ననుకునేవారు తాతయ్య. తరవాత తమ భావిజీవితానికి అనువయ్యేటట్టు దేశభాషలో ఉన్నత విద్య నేర్పే ఒక "మహిళా విద్యాలయం" స్థాపించారు. అది ఇప్పుడు ఒక విశ్వవిద్యాలయంగా మారి 'శ్రీమతి నాతీబాయ్ దామోదర్ ఠాకర్సే యూనివర్సిటీ' అని పిలవబడుతూ అక్కడ ఉత్తీర్ణులైనవారు బొంబాయి విశ్వవిద్యాలయంలోని బి ఏ. లతో సమానంగా గుర్తించ బడుతూ ఉన్నారు. దక్కన్ విద్యా ప్రచారకసంఘమూ. సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసైటీ శ్రీ జనాభ్యుదయానికి కృషిచేసే "నిష్కామకర్మమఠా"న్ని స్థాపించడానికి తాతయ్యను ప్రోత్సహించాయి

1936 వ సంవత్సరంలో తన 78 వ ఏట తాతయ్య "మహారాష్ట్ర గ్రామ ప్రాథమిక విద్యాసంస్థ" ను నెల కొల్పారు. పదకొండు సంవత్సరాల నిరంతరకృషివల్ల దీని ఆధ్వర్యమున నలభై పాఠశాల లేర్పడ్డాయి. 1942వ సంవత్సరంలో అంటే ఆయన 84 వ యేట "సమత సంఘం" స్థాపించబడింది. మానవులలో సమత్వాన్ని వృద్ధిచెయ్యటానికితాతయ్య ఈ సంఘాన్ని నిర్మించారు క్రమంగా అది జాతిభేదాన్ని అస్పృశ్యతనూ నిర్మూలించడా నికి కృషిచేసే 'జాతివిభేదనిర్మూలనసంఘం'గా తయారైంది.

నేను చదువుకోడానికి అమెరికా వెడుతున్నప్పుడు తాతయ్య నాతో "సీరా! నీ ఆశయాలను నీకంటె ఉన్నతంగా చూచుకో. భయపడకు. మంచినే ఆశించు. కష్టాలను ఎదుర్కోడానికి సిద్ధపడు" అని అన్నారు.

తాతయ్యకు ఇప్పుడు కొంత విశ్రాంతి దొరికింది గనక తనకిష్టమైన శాస్త్ర సంగీతం వింటూంటారు. అప్పుడప్పుడు చీట్లాట ఆడుతుంటారు. ఇప్పుడు 97 సంవత్సరముల వయస్సు ఉన్నా, ఆరోగ్యంగా ఉన్నారు. ఆయన పనులు ఆయనే చేసుకుంటారు. తన జీవితకాలం లోనే తన ఆశయాలు నెరవేరి తన కలలు రూపం ధరిం చడం ఎంతో అదృష్టం తాతయ్యది అలాంటి అదృష్టం

ఆయనకు జరిగే సన్మానసభలలో "ఈ గౌరవంలో సగానికిపైగా నా భార్యకు చెందాలి. నేను ఏదైనా సేవ చేస్తే అది నా భార్య సహాయంవల్లనే" అని చెపుతూ ఉంటారు. మా నాయనమ్మగారు 1951 వ సంవత్స రంలో హింగనేలో కాలధర్మంచేశారు దహనం చేసిన చోట ఒక తులసి బృందావనం నిర్మించారు. హింగనే వచ్చినప్పుడల్లా తాతయ్య తప్పకుండా ఆ తులసి బృందా వనాన్ని చూచివస్తారు

★

ఐచ్ఛిక సేవకు ప్రభుత్వ సన్మానం

——.o:——

సాంఘిక సేవ ప్రాముఖ్యతను గుర్తించి ఇటీవల భారత ప్రభుత్వం సంఘ సేవకులకు 'పద్మవిభూషణ' 'పద్మశ్రీ' మొదలైన బిరుదులను ఇచ్చినది. ఈ బిరుదప్రదానం యావద్భారత దేశంలోని సంఘ సేవకులకు తృప్తికరంగానూ, ప్రోత్సాహజనకంగాను ఉన్నదనుట నిర్వివాదాంశం. రాష్ట్ర సంక్షేమ సంస్థల అధ్యక్షులతో ప్రస్తావిస్తూ ప్రెసిడెంటు రాజేంద్రప్రసాదు "నిర్లక్ష్యభావంతో చూడబడుతున్న స్వయంసేవా కృషి మొదటిసారిగా సర్వజన సమ్మానమైనది" అని అన్నారు. బిరుదులు గ్రహించినవారిలో ఏడుగురు తమ సాంఘిక సంక్షేమ సేవానిరతికి గౌరవింపబడ్డారు. విద్యాభివృద్ధికీ, స్త్రీ జనాభ్యున్నతికీ పాటుపడినవారిలో ప్రప్రథమునిగనీ, మార్గదర్శకుడనీ ప్రభుత్వం గుర్తించి మహర్షి కార్వేను గౌరవించినది. కేంద్ర సంక్షేమ సంఘంలోని ఒక సభ్యురాలుకూడా ఈవిధంగా గౌరవింపబడుట సంఘానికి గర్వకారణము.

——:o.——



పద్మవిభూషణ బిరుదమును పొందిన కార్వేమహర్షి అప్పటి పూర్వాచార పరాయణుల అభివృద్ధినిరోధక చర్యలను ఎదుర్కొని అనేక కష్టనిష్ఠురములకు పాల్పడి మహిళాభ్యున్నతికి— ముఖ్యంగా వితంతువుల సౌభాగ్యానికి— వెలుగుబాటలు నిర్మించారు. 1858 వ సంవత్సరములో జన్మించారు. పూనాలోని ఫెర్గూసన్ కాలేజీలో గణిత శాస్త్రాచార్యపదవి వహించారు. దేశంలోని వితంతువుల దుర్గతివారి మనస్సు కరిగించింది. 1893 వ సంవత్సరంలోనే ఒక 'వితంతు వివాహ సంఘము'నువారు స్థాపించారు. పిమ్మట 'వితంతు శరణాలయ సంఘం' అను ఇంకొక సంస్థను నెలకొల్పి దాని అధ్వర్యమున నొక వృత్తి విద్యల పాఠశాలను నిర్మించారు. 1916 వ సంవత్సరములో 'భారత మహిళా విశ్వవిద్యాలయా'న్ని స్థాపించారు. అందు ఉన్నత విద్యలుకూడ దేశభాషలలోనే బోధిస్తారు. ప్రజలే వారి నిరంతరసేవను గుర్తించి 1949 వ సంవత్సరంలో వారి తొంబదిఒకటవ యేట ఒక లక్షరూపాయీలు కానుకగా సమర్పించారు.

* * *

శ్రీ జె. ఆర్. డి. తాతా. వీరు ప్రఖ్యాతి చెందిన తాతా కుటుంబానికి పెద్ద. వారి పూర్వులచే ఏర్పాటు చేయబడ్డ అనేక గొప్ప గొప్ప ధర్మ నిధులకు, దానాదాయములకు ధర్మకర్తృత్వం వహిస్తూ దేశంలో ప్రజాక్షేమాభివృద్ధికై కృషిచేయు వివిధ వైజ్ఞానిక, సాంకేతిక, వైద్యవిద్యా పరిశోధక సంస్థలను నడుపుచున్నారు.

* * *



శ్రీమతి రామేశ్వరీ నెహ్రూ పద్మభూషణ బిరుదాంకితురాలు. దేశంలోని అనేక స్వచ్ఛంద సేవక సంఘములకూ, సాంఘిక సంక్షేమ సమాజములకు అత్యంత సన్నిహితమైన సభ్యురాలు. వారి శాంత స్వభావమునకు, వక్తృత్వమునకు, ముఖ్యంగా, ప్రసిద్ధిగాంచిన వారి సేవాతత్పరతకు వారిని దేశం అశేషంగా గౌరవిస్తారు. కేంద్ర ప్రభుత్వ పునరావాస శాఖ సలహా సంఘములో గౌరవసభ్యురాలుగా ఉండి స్థానభ్రష్టులైన అనేక స్త్రీబాలబాలికలను పశ్చిమ పాకిస్థానునుండి రక్షించి వారి పునరావాసమునకు అమూల్యమైన కృషి సాగించారు. స్థానభ్రష్టులైన హరి

ఐచ్ఛిక సేవకు ప్రభుత్వ సన్మానం

జనులకోసం 1949 లో నిర్మింపబడిన "రామేశ్వరీనగర్" ఆమె పేరు కలిగి ఉండుట ఆమెకు హరిజనులయెడ గల అఖండాదరాభిమానములను రుజువుచేయుచున్నది.

* * *



పద్మభూషణ బిరుదమును స్వీకరించిన శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ సంపన్న గృహంలో జన్మించి వైభవంగా పెరిగినప్పటికీ శైశవంనుంచీ ఆమె మనస్సు బీద ప్రజలమీద కనికరము చూపుతూనే ఉండేది. వీరు భారత స్వాతంత్ర్య సమరంలోకూడ ప్రధాన పాత్ర వహించి 1930 లోను, 1942 లోను కారాగారశిక్ష అనుభవించారు. ఎన్నో అంతర్జాతీయ మహిళా సమావేశాలలో భారతదేశ ప్రతినిధిగా పాల్గొన్నారు. అఖిలభారత కుటీర పరిశ్రమల సంస్థకు అధ్యక్షురాలై నిరంతర కృషి సాగించుచున్నారు. భారత సహకార సంస్థ వ్యవస్థాపకులలో ఒకరై సహకార పద్ధతులపైన ప్రవాసులకు పునరావాసం కల్పించి ఆర్థికస్థోమత హెచ్చించడానికి అమూల్యమైన సేవచేశారు.

* * *



శ్రీమాడపాటి హనుమంతరావు పద్మభూషణులు హైదరాబాదు రాష్ట్రంలో చాల ప్రఖ్యాత పురుషులు. విద్యా సాంఘిక సంస్కార విషయములలో మార్గదర్శకులు. కొందరు స్వయం సేవకులను కూడగట్టుకుని హైదరాబాదు రాష్ట్రంలో బాలికలకు ఎన్నో విద్యాసంస్థలను నెలకొల్పినారు ఆంధ్ర మహిళాభ్యుదయానికి ఒక సంఘమును స్థాపించినవారు. అంటరాని తనాన్ని పోగొట్టడానికి సక్రమపద్ధతులలో ఒక ఉద్యమాన్ని లేవదీశారు. ప్రథమంలో హరిజనులచేత స్థాపించబడ్డ 'ఆది హైందవ సంఘ సేవా సమితి'కి చేయూతనిచ్చి అస్పృశ్యతా నివారణకు ఎన్నోవిధాల సహాయపడుచున్నారు.

* * *


శ్రీ ఎస్. కె. డే నవభారత గ్రామ పునర్నిర్మాణ కార్యకర్తలలో అగ్రగణ్యులు. కమ్యూనిటీ ప్రాజెక్టుల నిర్వహణాధికారి. ఈపదవిని ఐచ్ఛికంగా గౌరవార్థం నిర్వహిస్తున్నారు. నిలోఖేరీ పట్టణాన్ని నిర్మించి కమ్యూనిటీ ప్రాజెక్టుల సంస్థకు ఒక నిర్దుష్టమైన స్వరూపాన్ని కల్పించగలిగిన దీ మహామేధావి దక్షతయే. ఈయనకు పద్మభూషణ బిరుదము ఇయ్యబడినది.

* * *



పద్మశ్రీ శ్రీమతి మేరీ క్లబ్‌వాలా జాధవ్ మద్రాసులోను, అఖిల భారతంలోను వివిధ సాంఘిక సంక్షేమ కార్యకలాపాలకు చెందిన నూటయాభై సంస్థలకు సన్నిహితురాలు. ఆమె సేవానిరతిగొన్న పంధొమ్మిది సం॥ లోను ఒక కోటీ ఇరవైఅయిదు లక్షల రూపాయిలు మద్రాసులోనూ ఇతర రాష్ట్రాలలోనూ ఉన్న సంక్షేమ కార్యక్రమాల నిమిత్తము విరాళముగా వసూలు చేశారు. ఇది అపూర్వం. కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ ఏర్పాటు చేసిన బాలనేరస్థుల సంక్షేమ సంస్థకు అధ్యక్షత వహిస్తున్నారు. బాలనేరస్థుల సమస్యలను పరిశీలించి తగిన సిఫారసులు చేయుటకుగాను ఏర్పడ్డ దక్షిణభారత సలహా సంఘమునకు అధ్యక్షురాలుగా ఉండి బాలలకు ఎన్నోవిధాల సేవ చేయుచున్నారు.

* * *



శ్రీమతి జరీనా కరీంభాయ్ కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘ సభ్యురాలు. వీరికి పద్మశ్రీ బిరుదమునిచ్చి ప్రభుత్వం గౌరవించింది. రమారమి ఇరవై సంవత్సరాలనుంచి బొంబాయి రాష్ట్రంలో అపారమైన సంఘసేవ చేయుచున్నారు. అత్యుత్సాహముతో అనేకవిధాల వారు రావించిన సాంఘిక సేవయేగాక విద్యావ్యాప్తికై వారు చేసిన నిరంతరకృషియు ఎంతయు శ్లాఘింపబడుచున్నది. ఇప్పుడు వీరు కేంద్ర విద్యావిషయిక సలహా సంఘమున సభ్యురాలుగా పనిచేయుచున్నారు.

* * *

శ్రీమతి రతన్‌శాస్త్రి పేరు వినగానే బనస్థలీ విద్యాపీఠం జ్ఞాపకం వస్తుంది. జైపూర్‌లో ఈ విద్యాపీఠం స్థాపించినవారు వీరే. దీనికి ఒక ప్రత్యేకమైన విశిష్టత ఉన్నది. ఇక్కడ బాలికలకు ప్రధానంగా వ్యాయామ

శిక్షణ ఇవ్వబడుతూంది. అనేక సంవత్సరాలనుంచి వీరు విద్యా సాంఘిక విషయాలలో నిరంతరసేవ చేయు చున్నారు. వీరు పద్మశ్రీ బిరుదు స్వీకరించారు.

* * *

శ్రీలక్ష్మీనారాయణ సాహు ఒరిస్సా రాష్ట్రంలోని సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసైటీలో ప్రఖ్యాతి చెందిన సభ్యులు. వీరు పద్మశ్రీ బిరుదాన్ని గ్రహించారు. వీరి జీవితమంతా కొండ జాత్యుద్ధరణకు అంకితమైంది. వీరు ఒరిస్సా రాష్ట్రంలో పేరుకెక్కిన రచయితకూడ. వివిధ విషయాలను గురించి అనేక భాషలలో దాదాపు 80 గ్రంథములను రచించినారు. భగవద్గీతా రహస్య పరిశోధనకు 'తత్వనిధి' అనియు బెంగాలీ వాఙ్మయమున గల పాండితీ గరిమకు 'విద్యారత్న' అనియు బిరుదములు ఈవరకే పొందియున్నారు.

దేవదూత



ధక్కర్ బాపా

నా చిన్నతనంలో ఎప్పుడూ ఏదో పనిచేసే ఒక దేవదూత కథ చదివాను. తళతళామెరిసిపోయే రెక్కలూ, ధగధగలాడే కిరీటాలూ ధరించే పెద్ద పెద్ద దేవతలుకూడా చెయ్యలేని కష్టమైన, క్లిష్టమైన పనులు చేసేవాడాదేవదూత. రాను రాను ఆయన అవసరం అందరికీ తప్పనిసరి అయింది. సామాన్య జనులందరికీ సేవచేయడమే ఆయన పని. చేస్తూన్నపని మానివేసి ఇంకొక పని చెయ్యడానికి ఆయన నిరాకరించేవాడు.

ఒకప్పుడు ఒక రాజకీయ సమస్యను పరిష్కారం చెయ్యడానికి తక్షణమే రావలసిందని ఆ దేశం ప్రధాన మంత్రి ఆ దేవదూతకి కబురు పంపాడు. పాపం! తల్లి మరణించిందని కన్నీరుమున్నీరుగా విలపించే ఒక అనాధ బాలికను ఓదారుస్తూ ఉన్నారాయన ఆ సమయంలో. "మీ పిచ్చి రాజకీయాలతోనూ, మీ పిచ్చి యుద్ధాలతోనూ నా కేంపని? తల్లికోసంఏడ్చే ఈబిడ్డ దుఃఖం మాన్పించి ఇల్లు చేర్చేవరకూ నేను రాను" అని ఆ దేవదూత చెప్పాడు.

అలాంటి దేవదూత ఎవరో తెలుసా? ధక్కర్‌బాపా! ధక్కర్‌బాపాకు విసుగు విరామం లేదు. వారు చేసే పనుల విలువ వారికి తెలుసు. ఆయన కార్యదీక్ష ఎవరూ సడలించలేరు తల్లిలేని ఒక బిడ్డను ఓదార్చడం కంటె, ఆకలితో అలమటిస్తూ చెప్పులు కుట్టి జీవించే ఒకమాదిగ వానికి సహాయం చేయడంకంటె చాలీచాలని జీతంతో అర్థాకలితో పనిచేసే పాకీవానికి చేయూత ఇవ్వడం కంటె బీదరాలైన ఒక కొండజాతి బిడ్డను ఉద్ధరించటం కంటె ధక్కర్‌బాపాకు ప్రభుత్వ ప్రతిష్టంభనలూ, భయంకర యుద్ధ ప్రకటనలూ ఎక్కువకావు.

అయితే మనం అంతాచెపుతాం అవన్నీ చాలా మంచి పనులే నని. కాని ధక్కర్‌బాపా మాత్రం ఆచరించి మరీ చెప్తారు. —వెర్రియర్ ఎల్విన్

నిజమైన సేవకురాలు

గడచిన అక్టోబరు మాసంలో మధ్యప్రదేశ్ లోని సంఘ సంక్షేమసంస్థల కార్యకలాపాలు పరీక్షించడానికి నాగపూర్ వెళ్ళాను.

'సితాబాల్డీ' మాతా శిశు సంరక్షణాలయానికి వెళ్ళి, అన్ని గదులూ చూస్తూండగా నాకు ఒక ముసలి స్త్రీ కనపడింది. ఆమె అక్కడ పనిచేసే వాళ్ళలో ఒకామె అనుకొని ఆమెను పలుకరించకుండా నాపని చూసుకుంటూ ఉండిపోయాను. తరువాత ఆ సంస్థ తాలూకు లెక్కలు చూస్తూండగా తక్కిన పనివారితో ఈమె మరల నాకు కనుపించింది.

మధ్యాహ్నం ఈ లెక్కలు ముగించి, విశ్రాంతి తీసుకుంటూండగా ఒక ముసలి స్త్రీని — ఈ సంస్థాపకురాలుగా — నాకు పరిచయం చేశారు. నేను తెల్లబోయి, ఉదయం తక్కినవాళ్ళతోపాటు ఈమెనుకూడా ఒక మామూలు పనిమనిషిగా పొరపాటు పడ్డందుకు చాల సిగ్గుపడ్డాను! ఆమె అతి సామాన్యమైన ఖద్దరు దుస్తులు ధరించి ఉంది. ఆమె చేతిని మాత్రం ఒక సంచి వ్రేలాడుతూంది. ఆ భవనంలో మేమున్నంతసేపూ తనకి సంబంధం లేనట్లు తన పని చూసుకుంటూ ఉండిపోయింది — నిజంగా మాతో ఉండవలసిన ముఖ్య వ్యక్తి ఆమె అయినా!

తరువాత ఆమెను గురించి నాకు ఇలా తెలిసింది: ఆమెకు చాలా చిన్నతనంలో పెళ్ళి అయింది. పెళ్ళి అయిన కొద్దిరోజులలోనే భర్త చనిపోయాడు. ఆనాటి ఆచారం ప్రకారం ఆమెను రెండవ పెళ్ళి చేసుకోనివ్వలేదు. —"రికామీగా ఉండేవాళ్ళకి ఎంతసేపూ చెడ్డ ఆలోచనలు పుడుతూంటాయట! —" అందుచేతనే ఏదో ఒక నిర్మాణాత్మకమైన పనిలో మునిగి ఉండిపోవాలి. అందుచేతనే ఆమె కాలాన్ని వృధాచేయక ఒక మాతా శిశు సంరక్షణాలయం ప్రారంభించింది. దాని ఫలితమే నేడు నాగపూర్ లో ఉన్న 'సితాబాల్డీ' మాతా శిశు సంరక్షణాలయం, మధ్యభారత్ లో దానికి సంబంధించిన 16 కేంద్రాలున్నూ!

నాగపూర్ లో ఉన్న రెండు కేంద్రాలలోనూ ప్రతి సంవత్సరం 2500 పురిటి కేసులు చూస్తారు. నాగపూర్ కి బయట ఉన్న కేంద్రాలలో దాదాపు మరి ఇంతమందికి వైద్యసదుపాయం లభిస్తూంది. ఈసంఖ్యలో దాదాపు మూడోవంతు జనానికి ఉచితంగా చికిత్స చేస్తారు. సీనియర్ మంత్రసాని పనిలోనూ ప్రాథమిక నర్సింగ్ పనిలోనూ ఇక్కడ శిక్షణ ఇస్తారు. ప్రతి దళంలోనూ నలభైమంది మంత్రసానులనీ, ఇరవై ఐదుగురు దాదులనీ తర్ఫీదు చేస్తారు. ఇంతవరకూ ఇక్కడ మూడు వందలమంది మంత్రసానులు తర్ఫీదు పొందారు. నాగపూర్ లోని కేంద్రంలో రోగులకు దాదాపు 250 మంచాలున్నాయి. మధ్యతరగతి పేదప్రజలకి ఈ సంస్థ చేస్తూన్న సేవ అపారం. నాగపూర్ లోని ఈ రెండు కేంద్రాలనీచూస్తే అవి 'శ్రీమతి కమలాబాయి హాస్పిటల్' అనే వితంతువు స్వార్థరహితంగా కష్టించి నిర్మించిన సంస్థలని ఎవరూ అనుకోరుకూడా! కాని ఇది కాదనరాని సత్యం! ఆమెకి కావలసింది చాలా కొద్ది! సంఘసేవకి ఎన్ని కష్టాలు పడవలసివచ్చినా లెక్క చేయదు — ఆమెకి ఉండడానికి ఒక ప్రత్యేకపు గది కాని, ఒక నీళ్ళగది కాని ఏమీ అక్కరలేదు ఆవిడకి ఉన్నదల్లా రెండు జతల ఖద్దరు గుడ్డలూ, బుజాన ఉండే సంచీ — ఆసంచీలోనే ఆవిడకున్న కొద్దివస్తువులూ ఉంటాయి!

భారతదేశంలో ఎంతోమంది సంఘసేవకులని నేను కలసికొన్నాను. కాని మానవసేవ తప్ప రెండో వాంఛలేని ఇలాంటి స్వార్థత్యాగినీ, ఉత్సాహవంతురాలినీ నేనెక్కడా చూడలేదు. ఇప్పుడు ఆలోచించి చూస్తే, బహుశా నేను మొట్టమొదట అనుకున్నట్లు — ఆవిణ్ణి ఒక సేవకురాలు "నిజమైనసేవకురాలు" — అనడమే సరియైనదేమో!! ప్రజలామెను సంస్థాపకురాలని చెప్పినా!!!

డి. పాల్ చౌదురీ.

దిగువ మధ్యతరగతి స్త్రీలకు ఆదాయాన్ని
వృద్ధిచేసే పనిసౌకర్యం వారివారి ఇండ్లలోనే
సమకూర్చేపద్ధతి.

నజఫ్‌ఘర్ అగ్గిపెట్టెల కర్మాగారం

ఎన్నో మధుర స్మృతులకీ, ప్రేమకీ ఆలవాలమైనది ఇల్లు. పుట్టి పెరిగిన ఇంటినీ, ప్రేమాస్పదులైన బంధుజనాన్నీ కోరుకొనటంకంటె గొప్ప వరం వేరే ఏముంది ? మనతోపాటే మన కుటుంబమూ పెరుగుతుంది; తల్లీ, భార్యా, పిల్లలూ, అందరూను ! పాషాణ జీవిత పథానికి సంసారం ఒక అల లాంటిది ! మానవ జీవితమనే సముద్ర తరంగాల గర్జనని ఎదుర్కొనే బలిష్టమైన కొండలాంటిది సంసారం ! జీవిత సంక్షోభాన్నుంచి మానవ జాతిని రక్షించే పవిత్ర దేవాలయం లాంటిది గృహం !

—"ప్రేమ్‌చంద్"

కేంద్ర సాంఘికసంక్షేమసంస్థ గృహమూ, సంసారమూ, వీటిప్రాముఖ్యతని పూర్తిగా గుర్తించింది. శాంతియుత మైన సంఘ నిర్మాణానికి ముఖ్యమైన ఈ మూల స్థంభాన్ని పటిష్టం చేయడానికి సర్వవిధాలా ఇది తోడ్పడుతుంది. "ప్రేమ్‌చంద్" నిర్వచించిన గృహనిర్మాణమే మన లక్ష్యం !!!

పరిస్థితులు మారడం వల్ల అనేక క్లిష్టసమస్యలు మనకి ఎదురై మన ప్రశాంతసంసార జీవనానికి విఘాతం కలుగుతూంటుంది.

మానవుని ప్రాధమికావసరాలని తీర్చలేని ఆదాయం మన కష్టాలకీ, సమస్యలకీ మూల కారణం. పట్టణ ప్రాంతాలలో నివసించే క్రిందిమధ్యతరగతిప్రజలు దీనివలన చాలా దెబ్బ తింటూన్నారు.

కేంద్రసంస్థ దీనిని అతిముఖ్యమైన ప్రాధమికసమస్యగా పరిగణించి, దీనిని ఎదుర్కొనడానికి— కుటుంబసంక్షేమసంస్థ సలహా ప్రకారం ఒక సహాయక ప్రణాళికని ప్రారంభించడానికి నిశ్చయించింది. కేంద్ర వాణిజ్య,పరిశ్రమల మంత్రిత్వశాఖ సహకారంతో ఒక అగ్గిపెట్టెల కర్మాగారాన్ని నిర్మించి ఫలితాలని చూడాలని నిశ్చయించింది. ఈపరిశ్రమలో అంతగానిపుణత, శరీరదార్ఢ్యం అవసరం లేదుకనుక, ముసలివారూ, అంగహీనులూ కూడా సులువుగా పాల్గొన వచ్చును.—అదికాక కర్మాగారంలో తయారుకావలసిన కొద్ది దశలలో తప్ప ఎక్కువభాగం వీటిని ఇంటి వద్దనే తయారు చేయవచ్చును.

రోజుకి దాదాపు 1000 గ్రోసుల అగ్గిపెట్టెలు తయారయే కేం. సాం. సం. సంస్థవారి ఈ అగ్గిపెట్టెల కర్మాగారం 1955 సంవత్సరం మార్చిలో ప్రారంభింపబడింది. ఇందులో పనిచేసే స్త్రీ కార్మికులకి ఆరువారాల పాటు శిక్షణ ఇవ్వబడింది. స్వల్పమైన రాబడి వచ్చే క్రింది మధ్య తరగతి స్త్రీలకి తీరిక సమయాలలో పనికల్పించి వారి ఆదాయాన్ని పెంచడం దీని ముఖ్యోద్దేశం.

కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖవారి సహకారంతో స్థాపింపబడిన "కుటుంబ సంక్షేమ సహకార సంఘం" ఈ ప్రణాళికని నిర్వహిస్తుంది. నజఫ్‌ఘర్ రోడ్‌లో స్థాపింపబడిన ఈ కర్మాగారం పటేల్ నగర్, రామేశ్‌నగర్, మోతీనగర్, ప్రాంతాల నివసించే నిర్వాసులైన స్త్రీలకి ఎంతో సహాయకారిగా వుంది. — పెట్టెలు తయారు చేయడం, పుల్లలకి మందు అంటించడం, పైన కాగితం అంటించి సీలుచేయడం ఇదంతా తమతమ ఇళ్ళదగ్గరే చేస్తారు. మందు తయారు చేయడం ఇతర కష్టమైన పనులూ మాత్రం కర్మాగారంలో జరుగుతాయి. వీరికి తరిఫీదు నిచ్చే సమయంలో రోజుకి ఎనిమిదణాలు ఒక్కొక్కరికి ఇచ్చి, ఉచితంగా తర్ఫీదు ఇవ్వబడింది ! ఈ స్త్రీ కార్మికులు పదిరూపాయల కనీసపు వాటా కొని ఈ సహకారసంఘంలో సభ్యులుగా వుంటారు. ఈ పదిరూపాయలు ఒక్కసారిగా కాక ఒక సంవత్సరం లోపులో వాయిదాల పద్ధతిని చెల్లించవచ్చు.

ఢిల్లీకి ఐదుమైళ్ళ దూరంలో ఒంటరిగా నున్న ఈ కర్మాగారాన్ని నేను చూశాను. అప్పటికి కట్టడాలు పూర్తి

నజఫ్‌ఘర్ అగ్గిపెట్టెల కర్మాగారం

కాకపోయినా శిక్షణ పొందుతూన్న మహిళలు బారులు తీర్చి, కూర్చొని పని చేస్తున్నారు! వీరిలో ఎంతో ఉత్సాహం స్వయంశక్తి నాకు కనపడ్డాయి. త్వరలో పూర్తిగా పని మొదలుపెట్టడానికి వీరు ఎంతో ఉత్సాహంతో వున్నారు.

ఒక శ్రీమతి కాందిశీకుల కుటుంబాన్నుంచి వచ్చింది. ఆమెకి నలుగురు పిల్లలు. భర్తకి ఉద్యోగం దొరకలేదు. అతడు వీధులలో కిళ్ళీలమ్మి డబ్బు సంపాదించడానికి తంటాలు పడుతున్నాడు. ఎంతో కష్టంమీద వారికి మోతీ నగర్‌లో ఒక చిన్నగది దొరికింది తల దాచుకోడానికి. దీనికితోడు ముసలి అత్తగారూ, విధవ ఆడపడుచూను! వీరందరి సహకారంతోనూ. ఆమె తన కుటుంబాన్ని పోషించ గలుగుతూంది ఈ కర్మాగారం ద్వారా.

మరొక శ్రీమతి బాగా వయస్సు మళ్ళినా ఆరోగ్యవంతంగా వుంది. ఈమె పటేల్ నగర్‌లో నివసిస్తూంది. చౌకీదార్ పనిచేస్తూ ఉద్యోగాన్నుంచి రిటైరయిన ఈమె భర్త ఉబ్బసం వ్యాధితో బాధపడుతున్నాడు. దురదృష్టవశాత్తు తన రోగిష్టి భార్యనీ, ముగ్గురు పిల్లల్నీ విడిచి ఆమె కొడుకు ఒక కారుప్రమాదంలో మరణించాడు. వీళ్ళ భారమంతా ఈ శ్రీమతి మీదపడింది. అయినా ఫరవా లేదు. ఈ కర్మాగారం సహాయంతో వాళ్ళందరికీ జీవనోపాధి లభించింది.

ఈ ప్రణాళిక క్రింద దాదాపు ఐదువందల కుటుంబాలకి పని కల్పింప బడుతుంది. ఈ అగ్గిపెట్టెల కర్మాగారానికి ఒక "క్రేచీ" కూడా జేర్చబడుతుంది. ఇది కాక ఇక్కడ పనిచేసే స్త్రీలకు చదువుచెప్పే తరగతులు కూడా ప్రారంభింప బడతాయి. ఒక ఆరోగ్య కేంద్రం; విశ్రాంతి కేంద్రంకూడా స్థాపింప బడతాయి.

ఇది పూర్తికాగానే మరి ఐదు వందల కుటుంబాలకి పనికల్పించే మరియొక ప్రణాళికా కేంద్రం సబ్జిమండీ, రూప్‌నగర్, జవాహర్‌నగర్ ప్రాంతాన స్థాపింప బడుతోంది.

ఈ అగ్గిపెట్టెల కర్మాగారాన్ని అతి సమర్థతతో నిర్వహిస్తూన్న సంస్థలో ఈ క్రింది సభ్యులున్నారు.

శ్రీమతి టి. వి. పాయ్,
కుటుంబ సంక్షేమ సహకార అధ్యక్షులు.

శ్రీమతి ఉమా అగర్వాల్.
కార్యదర్శిని.

డాక్టర్ ఎస్. పి. వర్మ
శ్రీ కె. పి. సోనీ,
శ్రీమతి కర్తార్ కౌర్
} కార్యవర్గ సభ్యులు.

—సీరా కార్వే



[కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ సహకారములతో కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ వారిచే నజఫ్‌ఘరాలో స్థాపింపబడిన అగ్గిపెట్టెల కర్మాగారం కుటుంబ సంక్షేమ సహకార సంస్థ ద్వారా ఢిల్లీ ప్రాంతంలో— కుటుంబాదాయాన్ని ఏవిధంగా వృద్ధిచేయవచ్చునో చూపుతుంది.]

ఆంధ్ర మహిళా సభ
సంక్షేమ కేంద్రాలు



వాటంచేడు గ్రామస్థులు కట్టియిచ్చిన ప్రసూతి గృహము

గతనెల 27 తేదీని ఆంధ్ర మహిళా సభ సంక్షేమ కేంద్రాలు ఇంకో రెండు స్థాపించబడినవి. ఇదివరలో మాంబట్టు, చేనిగుంట గ్రామాలలో ప్రసూతి కేంద్రాలు పెట్టబడినవి. ఇప్పుడు తడ గ్రామములో పిల్లలకొరకు ఒక విజ్ఞాన-వినోద క్రీడా కేంద్రమును, వాటం చేడు గ్రామములో ప్రసూతి కేంద్రమును స్థాపించబడినవి.

ఈ కేంద్రములు నెల్లూరు జిల్లా కలక్టరు శ్రీ యం. బి. రాజారావుగారు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి జిల్లా ప్రభుత్వోద్యోగులు, ప్రముఖులు, మదరాసు ఆంధ్ర మహిళలు, ఆంధ్ర బాలానంద సంఘ సభ్యులు పలువురు వచ్చారు.

వాటంచేడు గ్రామములో 27 తేదీ ఉదయం మంగళ వాద్యములతో శ్రీ ఈ. వేణుగోపాలరెడ్డిగారిచే పతాక వందనోత్సవము జరుపబడెను. ప్రాజక్టు కన్వీనరు శ్రీమతి న్యాయపతి కామేశ్వరమ్మగారు స్వాగతం చెప్పారు. కలక్టరు శ్రీ రాజారావుగారు సంక్షేమ కార్యక్రమములను ప్రజల సహకారమును కొనియాడారు. శ్రీమతి కస్తూరి రుక్మిణమ్మగారు, శ్రీ వి. ఎన్. శర్మ గార్లు మాట్లాడారు. ఆంధ్ర బాలానంద సంఘ బాలలు నృత్యగాన వినోదములను ప్రదర్శించారు. శ్రీమతి జి. లీలగారి వందన సమర్పణతో సభ ముగిసింది.


తడ బాలానంద కేంద్రము

తడ గ్రామములో ఆ సాయంత్రమే. బాలలకు ఒక విజ్ఞాన వినోద క్రీడా కేంద్రము తెరువబడింది. ఆనాటి కార్యక్రమానికి వేలకొలది తల్లులూ, పిల్లలూ, తండ్రులూ వచ్చారు. సుల్లూరుపేట బాలలు, చేనిగుంట బాలలు, తడ బాలలు, మదరాసు బాలానంద సంఘ బాలలు ఆ సాయంత్రం ఆటలు, పాటలు, నృత్యములు, ప్రహసనములతో ప్రజలను సంతోషపరచారు.

నెల్లూరు జిల్లా కలక్టరు శ్రీ యం. బి. రాజారావుగారు "ఊగుడుపడవను" ఊపి కేంద్రమును ప్రారంభించారు. విజ్ఞాన జ్యోతిని వెలిగించి బాల గ్రంథాలయమును తెరచారు. బాలలకు ఇటువంటి కేంద్రములు ఎంతో అవసరమని సభకు అధ్యక్షత వహించిన శ్రీ వేణుగోపాల రెడ్డిగారు చెప్పారు. ప్రాజెక్టు కన్వీనరు శ్రీమతి కామేశ్వరమ్మగారు కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థవారి విస్తరణ ప్రణాళిక వివరములను విస్తరించి చెప్పారు.

ఈ కేంద్రముల ప్రారంభోత్సవమున ప్రజల సహకారముతో బాటు స్థానిక డిప్యూటీ తహసిల్దారు గారగు శ్రీ నాగభూషణరావుగారు, సుళ్ళూరుపేట పంచాయితీ బోర్డువారు, హైస్కూలు హెడ్‌మాస్టరుగారు, సినిమా ప్రొప్రయిటరు శ్రీరాజుగారు, శ్రీ అయిదా ఆనందకృష్ణగారును అనేకవిధాల ఆనాటి కార్యక్రమము జయప్రదముగా జరుగుటకు తోడ్పడినారు. ప్రజలలో నూతనోత్సాహం చెలరేగింది. మదరాసు బాలానంద సంఘ కార్యదర్శి, ఆంధ్ర సంక్షేమ సలహా సంఘ సభ్యులు శ్రీన్యాయపతి రాఘవరావుగారు బాలానంద సంఘము గురించి ఉపన్యసించారు.

జనగణ జాతీయ గీతముతో సభముగిసింది.



తడ గ్రామంలో బాలవిహార్ ప్రారంభోత్సము జరిపిన నెల్లూరు జిల్లా కలెక్టరు ఆంధ్ర మహిళా సభ ప్రాజెక్టు కమిటీ కన్వీనరు శ్రీమతి న్యాయపతి కామేశ్వరమ్మ గారు.

నూతన ప్రసూతి కేంద్రములు

లక్ష్మణేశ్వరములో ప్రసూతి కేంద్రము

సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు వారి, పశ్చిమ గోదావరి జిల్లా సంక్షేమ విస్తరణ ప్రణాళిక 5 వ ప్రసూతి కేంద్రం ప్రారంభోత్సవము 26-3-'55 తేది నర్సాపురం తాలూకా లక్ష్మణేశ్వరం గ్రామంలో జయప్రదముగా జరిగినది. ఆంధ్ర శాసన సభ్యులు శ్రీ గ్రంధి వెంకటరెడ్డి నాయుడు ఎం.ఏ., బి.ఎల్., గారు ప్రారంభోత్సవము చేశారు. నర్సాపురం సబ్ కలెక్టరు శ్రీ బి. ఎన్. జయసిన్హా ఐ. ఎ. ఎస్. గారు అధ్యక్షత వహించారు.

ఈ ప్రణాళిక ఉద్దేశ్యములు, ప్రభుత్వ బాధ్యత, ప్రజల కర్తవ్యము, గ్రామోద్ధరణ వీని వివరాలు కార్యదర్శి శ్రీమతి డి. లక్ష్మిబాయమ్మగారు ప్రస్తావించారు సెంట్రల్ బోర్డు చైర్మను శ్రీమతి దుర్గాబాయి దేశానికి చేస్తున్న అపార సేవను గూర్చియు, తదనుగుణ్యముగా రాష్ట్రీ బోర్డు చైర్మను శ్రీమతి ఎ. చన్నఘంటమ్మగారు చేస్తున్న విశేష కృషిని గూర్చియు, ఇంతవరకు జరిగిన కార్యక్రమము గూర్చియు విశదంగా చెప్పారు.


అధ్యక్షులు శ్రీ జయసిన్హాగారును, శ్రీ రెడ్డినాయుడు గారును. ఈ ఉద్యమాన్ని ప్రజలూ ప్రభుత్వమూకూడా జయప్రదం చేయాలని ఉద్బోధించారు. ప్రసూతి కేంద్రంలో శ్రీ ఎమ్. శేషమ్మను మిడ్‌వైఫ్‌గా ఏర్పాటు చేశారు.

పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు గ్రామ సమితి పక్షాన స్వాగతపత్రాలు సమర్పించి సుమారు రు. 8,750. విరాళాలు వాగ్దానం చేస్తూ గ్రామస్థులవంతు మిగతా భాగాన్నికూడా తప్పక పూర్తిచేయుటకు కృషి చేస్తామన్నారు. పరస్పర అభివందనాలతో సమావేశము జయప్రదంగా వీడ్కోలు ఇచ్చారు.

దిరుసుమర్రులో ప్రసూతి కేంద్రము

సెంట్రల్ సోషల్ వెల్‌ఫేర్ బోర్డువారి పశ్చిమ గోదావరిజిల్లా సంక్షేమ విస్తరణ ప్రణాళికలో 6 వ ప్రసూతి కేంద్రము ప్రారంభోత్సవము 12-4-'55 వ తేదీ భీమవరం తాలూకా దిరుసుమర్రు గ్రామంలో జయప్రదముగా జరిగినది.

ఆంధ్ర శాసన సభ్యులు శ్రీ ఎన్. వెంకట్రామయ్య **(M.L.A.)** మరియు మునిసిపల్ ఛైర్మన్‌గారు ప్రారంభోత్సవము చేశారు. శ్రీ గాధిరాజు జగన్నాధరాజు గారు **(M L.A.)** అధ్యక్షత వహించారు. స్థానిక నాయకులు, పురప్రముఖులు కమిటీ కార్యకర్తలు చుట్టుపట్ల గ్రామాల ప్రజలు వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రోజక్టు కమిటీ కన్వీనరు శ్రీమతి డి. లక్ష్మిబాయమ్మ గారు సంక్షేమ ప్రణాళిక ఉద్దేశము వివరిస్తూ యింతవరకూ జరిగిన కార్యక్రమాభ్యుదయమును గూర్చి వివరించారు.



పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం తాలూకా లక్ష్మణేశ్వరం గ్రామంలో **C.S.W.B.** వారి ప్రసూతి శిశు సంక్షేమ కేంద్రము ప్రారంభోత్సవ సందర్భంలో శ్రీమతి డి. లక్ష్మిబాయమ్మ గారు ఉపన్యసిస్తూన్నప్పటి చిత్రం. కూర్చున్నవారు శ్రీ గ్రంధి వెంకటరెడ్డి నాయుడుగారు, **(M.L.A.)**, శ్రీ బి. ఎన్. జయసిన్హా (సబ్ కలక్టర్)

కస్తూర్బా గాంధీ జాతీయ సంస్మరణ సంస్థ

సంక్షేమ విస్తరణ ప్రణాళికాప్రాంతాల గ్రామసేవికల శిక్షణకై ఏర్పాటు.

కేంద్ర సాంఘికసంక్షేమసంస్థ ఆధ్వర్యమున ప్రారంభింప బడిన వివిధ సంక్షేమవిస్తరణప్రణాళికాప్రాంతాలలో దేశమంతటా గ్రామసేవికలకు శిక్షణ గరపుటకు కస్తూర్బాగాంధీ జాతీయ సంస్మరణసంస్థవారు నిశ్చయించారు.

లోక్‌సభాధ్యక్షులు, కస్తూర్బా జాతీయనిధి అధ్యక్షులు, శ్రీ డి. వి. మావ్‌లంకర్ అధ్యక్షతను ఇటీవల సమావేశమైన సభలో ఈ నిర్ణయం చేయబడింది.

కస్తూర్బాజాతీయనిధిసంస్థ సభ్యులూ, కేంద్ర సాంఘిక సంక్షేమసంస్థ సభ్యులూ, ఈ సమావేశానికి హాజరయ్యారు.

1. శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్
   (కేం. సాం. సం. సంస్థ అధ్యక్షురాలు,
   క. గాం. జా. సం. సంస్థ ధర్మకర్త్రి.)
2 శ్రీమతి రామేశ్వరీ నెహ్రూ
   (క. గాం. జా. సం. సంస్థ ధర్మకర్త్రి)
3. శ్రీమతి మణిబెన్ పటేల్.
   (కేం సాం. సం. సంస్థ సభ్యురాలు,
   క, గాం. జా. సం. సంస్థ ధర్మకర్త్రి)
4 శ్రీమతి ఇందిరా గాంధీ
   (కేం. సాం. సం. సంస్థ సభ్యురాలు:
   క. గాం. జా. సం. సంస్థ ధర్మకర్త్రి)
5. శ్రీమతి మృదులా సారాభాయ్.
   (క. గాం. జా. సం. సంస్థ ధర్మకర్త్రి)
6. శ్రీ ఆర్. ఎస్. ధోత్రే.
   (కార్యదర్శి, గాంధీ స్మారకనిధి)
7. శ్రీమతి సుశీలా పాయ్.
   (కార్యదర్శిని; క. గాం. జా. సం. సంస్థ)
8. శ్రీ శ్యామ్‌లాల్. అధికార కార్యదర్శి,
   క. గాం. జా, సం. సంస్థ.

ఈ సమావేశంలో గ్రామసేవికలను సంక్షేమవిస్తరణ ప్రణాళికా ప్రాంతాల శిక్షణ ఇచ్చే నిమిత్తం ఒక కార్యక్రమం సిద్ధంచేయబడింది ఒక వెయ్యి మంది గ్రామసేవికలను కస్తూర్బా గాంధీ జాతీయ సంస్మరణ సంస్థ వారిచే దేశములో వివిధ రాష్ట్రాలలో పనిచేస్తున్న "గ్రామసేవికా విద్యాలయాల"లో శిక్షణ ఇవ్వడానికి ఈ సంస్థ సమ్మతించింది. ఈ గ్రామ సేవికల శిక్షణకయ్యే ఖర్చు, వసతి సౌకర్యాలు, విద్యార్థి వేతనాలు, కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ కస్తూర్బాసంస్థ వారికి నగదురూపంలో సహాయం చేయడానికి సమ్మతించింది. ఈ శిక్షణ తరగతులు 1955 జూలైలో ప్రారంభింపబడును. ఒక సంవత్సరం వరకూ విద్యార్థులు ఇందులో శిక్షణ పొందాలి.

దేశములోని వివిధ ప్రాంతాలలో వున్న 352 సంక్షేమవిస్తరణప్రణాళికా ప్రాంతాలలో మొదటి పంచవర్ష ప్రణాళిక క్రింద 6390 మంది పని చేస్తారు. వీరిలో 2130 మంది గ్రామ సేవికలు, అంతే మంది మంత్రసానులు, తక్కినవారు చేతిపనులు నేర్పేవారికి సహాయకులు గాను వుంటారు. ఈ మొత్తంలో ఇంత వరకూ 181 కేంద్రాలలో 1700 మంది సుశిక్షితులైన పనివారు నియమింప బడ్డారు. ఈ కేంద్రాలు గడిచిన ఎనిమిదినెలల నుండి పనిచేస్తున్నాయి.

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక క్రింద ప్రతి జిల్లాలోనూ ప్రస్తుతం పనిచేస్తున్న ఒక్కొక్క కేంద్రంకాక మరిమూడు కేంద్రాలు నెలకొల్పడానికి నిశ్చయింప బడింది. వీటిలో శిక్షణపొందిన గ్రామసేవికలు, మంత్రసానులు, చేతిపనుల ఉపాధ్యాయులు 25000 మంది పని చేస్తారు.

సంక్షేమ విస్తరణ ప్రణాళికా కార్య క్రమంలో మంత్రసానులు, దాదులు వీరికి ప్రాధమిక ఆరోగ్య సూత్రాలలో శిక్షణ ఇచ్చే నిమిత్తం కేంద్ర ఆరోగ్య శాఖతో ప్రస్తుతం సంప్రదింపులు జరుగు తున్నాయి.

ANDHRA MAHILA SABHA
NURSING HOME

STATISTICS FOR THE MONTH OF APRIL '55

OUT-PATIENT REGISTER:


Surgical cases	107
Medical ,,	834
Gynaecological cases	113
Ante-Natal ,,	230
Post-Natal ,,	95
E E. N. T. ,,	64
Total No. of New Pts.	1452
,, ,, ,, Old Pts.	1595
Grand Total	3047

IN-PATIENT MATERNITY REGISTER:

No. of Patients Delivered	92
Normal Deliveries	89
Abnormal ,,	3
Total No. of Patients	92

ADMISSION REGISTER·

No. of Patients Admitted for Deliveries	86
(No. of Babies)	89
No. of Surgical cases treated	5
,, ,, Medical ,, ,,	7
,, ,, Ante-Natal ,,	27
,, ,, Post-Natal ,,	1
,, ,, Gynaecological ,,	1
,, ,, Abortion ,,	7
,, ,, Abnormal Deliveries	5
Total No. of Admissions	228





త్యాగిని

శ్రీ కొల్లకుదురు రాజశేఖరరెడ్డి.

అవి విద్యానగరపు ప్రౌఢదేవరాయలు పరిపాలించే రోజులు. ప్రౌఢదేవరాయలు తన సరదారులలో ఒకడైన "కాటారెడ్డి"ని రాయచూరులో ఒక కోటగట్టమని ఆజ్ఞాపించాడు ఆ కోటగట్టినఎడల శత్రుదాడిని నిర్మూలించ వచ్చును. కాటారెడ్డి రాజాజ్ఞ ప్రకారము రాయచూరు వెళ్ళి పనిప్రారంభించాడు. కోట బురుజువరకు లేచింది. కాని ఉన్నట్టుండి పడిపోయింది. మఱల కూలీలు ప్రయత్నించారు. మరల కూలింది. ఇటుల ఎన్నిసార్లు కట్టినను కోటకూలిపోవుచున్నది. కాటారెడ్డి ఖిన్నుడై పోయాడు. అతనికేమియు తోచలేదు. ఇట్లా వుండగా, కూలీలలో ఒకనికి వళ్ళు పెరిగింది. "నేనొక ఆదిశక్తిని. నాకు పచ్చిబాలింతరాలూ ఆమె శిశువూ ఇద్దరినీ బలియిస్తే కోటనిలుస్తుంది. లేనిచో కోటకూలుతుంది." అన్నది.

ఈవిషయాన్ని విని కాటారెడ్డి కుప్పగా కూలి పొయ్యాడు. ఎవరు తనముక్కు పచ్చలారని ముద్దు బిడ్డను, తన తనువును ఈకోటకు బలియిస్తారు? ఇక లాభం లేదనుకొన్నాడు. ఇది ఇట్లావుండగా ఆ గ్రామములో "సంగమ్మ"అనే మూడు దినముల పచ్చిబాలింతరాలున్నది. ఈవార్త ఆమె విన్నది. ఆమెనాడులు ఉప్పొంగాయి. కీర్తిశాశ్వతం. ఇహ సుఖాలు అశాశ్వతం అని తలచింది. ఈకోటకట్టినచో ప్రజలు బాగుపడెదరు. రాజ్యం సుస్థిరంగావుంటుంది. దీనికోసం రెండుప్రాణులు బలి అయినచో ఎందరికో మేలుకలుగుతుంది.

పుట్టుట గిట్టుటకేకదా! ఈనాడు కాకపోయినా ఏనాటికైనా మృత్యువు తప్పదుగదా! అని పరిపరివిధముల సంగమ్మ మనస్సు నడిచింది. ఆమె చటుక్కున లేచింది. ఆంధ్రమాతను స్తుతించింది. ముక్కు పచ్చలారని ముద్దు బిడ్డను చంకనిడుకొని బయలుదేరింది. దారిలో తన పుత్రుని చూచి ఇలా అన్నది. "భావి భారత బాలకా! నా చిట్టిబాబూ! ఇంత పిన్న వయస్సులో రాజభక్తుడివై, ప్రజాసంరక్షకుడవై ప్రాణత్యాగం చేస్తున్నావు. తరతరాలకు నీ కీర్తి తరగదు. ఇవే నా ఆశిస్సులు" అని ముద్దాడి కోట పునాదులవద్దకు నడిచింది. కోటదాపునకువచ్చి వున్నట్టుండి కోటపునాదులలోనికి తన ముద్దుబిడ్డతో కూడ సంగమ్మ దూకినది.

కూలీలు ఇదిచూచారు. ఆమెను వారు వేయినోళ్ళ పొగిడారు వెంటనే కూలీలు రాళ్ళుపేర్చి ఆమెమీద గోడ కట్టారు. ఈసంగతి తెలిసి కాటారెడ్డి ఆశ్చర్యపోయాడు. ఊరివారందరు ఆమెనెంతో మెచ్చుకొన్నారు. క్రమముగా బురుజులేచింది. ఈసారి ఏ ఆటంకము కలుగలేదు. కోట పని పూర్తయింది. ఆమె పవిత్ర జీవిత చిహ్నంగా ఆ కోటకు "సంగమ్మ కోట" అని నామకరణము చేశారు.

ప్రభుక్షేమంకోసం, ప్రజారక్షణకోసం ప్రాణత్యాగము చేసిన "త్యాగిని" "సంగమ్మ చరిత్ర" ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరములతో లిఖించియుండుగాక.

ఇటువంటి "ఆంధ్ర మహిళ"ను గన్న ఆంధ్ర మాత ధన్యురాలు.

మోసానికి పోతే?

శ్రీ సన్నాకుల సుందరరావు

బుద్ధుడు తనయొక్క మతవ్యాప్తికై అనేక మఠాలు నెలకొల్పాడు. అనేక వేలమంది స్త్రీ పురుషులు అతనికి శిష్యులై మానవ సేవలో పాలు పంచుకొనసాగారు. బుద్ధునియొక్క కీర్తి దేశదేశాలా వ్యాపిస్తూయుంది. చిన్నపిల్లాడి మొదలుకొని పెద్దలవరకూ బుద్ధుని స్మరించ సాగారు. మరి ఇంతమంది మఠాలలోని సన్యాసులను పోషించటానికి డబ్బు అధికంగా కావాలి. రాజుగారైన శుద్ధోధనుడు మాత్రం ఖజానాలోని డబ్బు ఎంతని ఇస్తాడు. అందుకని గౌతముడు దేశ సంచారం చేసి ధనికులయొద్ద డబ్బువిరాళంగా తీసికొనేవాడు. "మోక్షానికి వెళ్లాలంటే డబ్బు ఆటంకమవుతుంది కనుక ధనాన్నంతా మఠాలకువిరాళంగాయిచ్చి సన్యాసం స్వీకరించండి అంటూ" బోధించాడతడు.

గ్రామగ్రామాలూ, దేశదేశాలు యాత్ర చేసివిరాళములు, స్వీకరిస్తూ కాశీనగరానికి వచ్చాడు. కాశీనగరంలో, ప్రజలంతా తమ యొక్క ఆస్థిఅమ్మి, ధనాన్ని, బుద్ధునియొక్క పాదాలముందు సమర్పించసాగారు. ఆనగరంలోనే సునందుడు అనే ధనికుడుండేవాడు. అతడుపిల్లికి కూడాభిక్షం పెట్టిఎరుగడు. "ఇతరులంతా తమ యొక్క ఆస్థిపాస్థులను అమ్మివిరాళంగాఇస్తున్నారామె. తనుమాత్రం ఇవ్వకపోతే లోకులంతా హేళనచేస్తారు. గొప్పకోసమైనా విరాళం ఇవ్వాలి" అని చెప్పిందతనిభార్య శ్రీలక్ష్మి. అందుకతడు అంగీకరించాడు. ఆస్థిలోసగభాగం అమ్మివేసి లక్షవరహాలూ బుద్ధుని చేతికి అందించాడు సునందుడు. బుద్ధుడతనివైపు ఆశ్చర్యంగా, చూచి, సునందా నీ ధనమంతా కలసి ఇంతేనా అని ప్రశ్నించాడు. అందుకతడు ఔను స్వామీ! ఆస్థి అంతా అమ్మి ఈ డబ్బు తెచ్చాను అని చెప్పాడు.

బుద్ధుడతన్ని చూసి సునందా! ఎవ్వర్నయినా మోసగించవచ్చు కాని భగవంతుణ్ణి మోసగించలేము. నిజంగానీయొక్క ఆస్థి నంతా అమ్మివేశావా? అని ప్రశ్నించాడు. అందుకు మరల సునందుడు అబద్ధం ఆడాడు. ఇలాముమ్మారుబుద్ధ భగవానుడు ప్రశ్నించినప్పటికీ అబద్ధం, చెప్పాడు. సునందుడు మూడవసారికూడా అబద్ధం ఎప్పుడయితే చెప్పాడో అప్పుడే రక్తం కక్కుకుని చనిపోయాడు. భర్త ఎంతసేపటికి రాకపోయేసరికి భార్యశ్రీలక్ష్మి బుద్ధభగవానుడున్న ఆశ్రమం చేరింది. స్వామీ నాభర్త విరాళం తీసుకుని ఇచ్చుటకి వచ్చారు. కన్పించుటలేదు! దయచేసి ఏమయ్యారో చెప్పండి అని అడిగింది.

అందుకుభగవానుడు మారుమాట చెప్పక శ్రీలక్ష్మీ! నీభర్త ఆస్థిఅంతాఅమ్మి ధనం తెచ్చాడా అనిఅడిగాడు. ఔనుస్వామీ! అనిబదులుచెప్పింది. శ్రీలక్ష్మి అబద్ధం ఆడకు అని క్రోధంగా చూశాడు బుద్ధుడు. ఔను స్వామీ అని బదులుచెప్పింది. శ్రీలక్ష్మి మూడవసారికూడా అబద్ధం ఆడేసరికి ఆమెకూడా భర్తలాగే రక్తం కక్కుకుని మరణించింది.

శిష్యులంతా వాళ్లిద్దరూ చనిపోవటానికి కారణంఏమిటి? వాళ్లిద్దర్నీ బ్రతికించండి అని ప్రార్థించారు. అందుకు బుద్ధుడు నవ్వి వీళ్లిద్దరూకలసి భగవంతుని సేవకోసం సగం ఆస్థిఅమ్మి ధనంఇచ్చి ఆస్థిఅంతా అమ్మి ఇచ్చామని అబద్ధం ఆడారు. అందువల్ల భగవంతుడు వీనికి మరణశిక్ష విధించాడు. వారిని బ్రతికించడం ఎవరితరంకాదు అని చెప్పాడు. అచ్చట ఉన్న వారంతా ఈసంఘటన చూచి ఆశ్చర్యం చెంది భగవంతుని యొక్క మహిమను కొనియాడుతూ తమ గృహాలకు పోయారు. చూశారా! దైవాన్ని మోసంచేయాలంటే ఎలాటిశిక్ష అను భవించారో?

స్కూలు పిల్లలతో నా అనుభవాలు

శ్రీ సుందరీశంకరం

నేను ఆ రోజే స్కూల్లోచేరి చార్జి పుచ్చుకున్నాను. పెద్దరకం పిల్లలకి పాఠం చెప్పడం అదే మొదలు. చెప్పేది శుద్ధ తెలుగు. అందులో యీరోజుల్లో తెలుగు టీచర్లకి యెంత మదుపు వున్నదో అందరు యెరిగిన విషయమే. సరే - కానీ, చూద్దామని క్లాసుకి వెళ్ళాను. పిల్లలంతా రకరకాల ముస్తాబులతో చిరునవ్వుముఖాలతో నమస్తే చెప్పి నన్నాహ్వానించారు. ఆరోజుకి ప్రశ్నల తోను, సమాధానాలతోనూ కాలం గడిచిపోయింది.

అసలే యేదో బితుకుగావుంది. దానికి తోడుగా యీ స్కూల్లో పిల్లలు తెలుగుక్లాసులో అల్లరిచేస్తారని నా చెవిలోపడింది. దాంతో నాకు గాభరా యెక్కువైంది

మామూలుగా మర్నాడు ధైర్యం తెచ్చుకుని స్కూలుకి బయలుదేరాను. వెళ్ళగానే మా సెక్రెటరీగారు కనబడి 'ఏమండీ! పిల్లలు యెలావున్నారు! .చూడండి యింకో విషయం! వీళ్లకి బొత్తిగా తెలుగులో మార్కులు రావండీ! మీరు కాస్త జాగ్రత్తగా చెప్పాలిమరి! ఏమం డోయ్! మరో విషయం. మీరు మాత్రం వీళ్ళదగ్గిర చాలా జాగ్రత్తగావుండాలి. లేకపోతే చెవులకి తాటాకులు కట్టేస్తారు' అన్నారు. ఇంక చూసుకోండి, నాకు ముచ్చె మటలు పోసినయ్. 'ఫరవాలేదులెండి. ఆవిషయం నేను చూచుకుంటాను' అని మాత్రం అన్నాను.

క్లాసులు మాత్రం యేమీ వడిదుడుకులు లేకుండానే జరిగిపోతున్నాయి.

నిజం చెప్పాలంటే మా స్కూలు పిల్లలంతా మంచి వాళ్ళే, అందరూ ఓనమాలు దగ్గరనుంచీ యింగ్లీషే చదివి వుండడం వల్లను, తప్పనిసరిగా మాతృభాష నేర్వవలసిన వారైనందువల్లను యీ చిక్కంతా వచ్చిపడ్డది. తెలుగు క్లాసంటేనే వాళ్ళకి బలవంతపు బ్రాహ్మణార్థం క్రింద తయారయింది.

మరొక తమాషా యేమిటంటే మా పిల్లలకి వారానికి ఒకసారి వ్యాసరచన వుంది. ఆరోజు మాత్రం నాకు గండంగా తయారయింది. ఏదో ఒక విషయాన్నిగురించి బోర్డుమీద వ్రాయగానే యిదికాదని అది, అదికాదని మరొకటి, సలహాలు యిచ్చి చివరకి మొదట యిచ్చిన విషయం మీదనే వ్రాయటం ప్రారంభించే వారు. వాళ్ళు వ్యాసం వ్రాయటం ప్రారంభమయినది లగాయతు నాకు ట్రాన్సులేషను పని ప్రారంభమయేది. నిజమనుకోండి! అబద్ధమనుకోండి! ఆరోజు వాళ్ళతో నాకు యమ యాతనగావుండేది. మధ్యలో ఒక పిల్ల 'యూనివర్సిటీ' అంటే తెలుగుపదం చెప్పండీ అని - మరొక పిల్ల 'ప్రావెన్సు' అంటే చెప్పమని, అందరు తలొకపదము తర్జుమాకి యిచ్చేసేవారు. ఈశతావధానంతో నాకు ప్రాణ సంకటమయ్యేది. ఎందు కంటారా? అసలేనాకు యింగ్లీషు రాదు. ఆ సమయంలో నాకు 'యింగ్లీషు రాదర్రా' అని చెప్పడం నామర్దా. మిడతంభొట్లు సామ్యంలాగ యింగ్లీషులో నాకున్న శ్రుతపాండిత్యాన్నంతా ప్రయోగించి యెలాగో బయటపడడం జరిగేది. వాళ్ళు తెలుగు నేర్చుకోవడం యెలావున్నా నాకు మాత్రం యింగ్లీషు నేర్వవలసిన అవసరం యేర్పడింది.

ఇంకొకటి; బొత్తిగా మావాళ్ళకి పద్యాలంటే పడదు. అదే కథగాని, నాటకంగానీ అయితే మారాం చెయ్యకుండా నిశ్శబ్దంగా వుంటారు. మరొక చిత్రమేమిటంటే కర్మం చాలక ఏపిల్లనైనా క్లాసులో పద్యంగాని, వచనం గాని చదవమన్నామా - అందరుకలిసి 'బోర్ బోర్' అని కేకలువేసి చదివే అమ్మాయి నోరు మరుక్షణంలో మూయించేసేవారు. విధిలేక ఆపుస్తకం వచ్చి నాచేతిలో వ్రాలేది. కాస్త సలక్షణమైన భాషలో పాఠం చెప్పడం ప్రారంభించామా 'టీచర్ హార్డు లేంగ్వేజి వాడేస్తున్నారు. సింపుల్ లేంగ్వేజిలో చెప్పండి' అని కేకలు. సాధ్యమైనంతవరకు కఠినపదప్రయోగం తీసిపారేశాను. వాళ్ళకి సులభంగా అర్థమైపోవాలి. 'అసలు యీ సంస్కృతం మూలాన యిన్ని ఒత్తక్షరాలు మన తెలుగుభాషలోకి వచ్చి పడ్డాయికాని లేకపోతే మన అచ్చతెనుగులో వీటికి నిలువనీడేనా వుందా!' అంటారు మావాళ్ళు. భాషా వాదంలో మాత్రం మావాళ్ళు మరొకరికి తీసిపోరు.

సంస్కృతాన్ని త్రోసి రా జని దానికి మంగళం పాడుతారు.

ప్రబంధ నాయికానాయకుల జీవితాలంటే వీరికి వుత్సాహం యెక్కువ. వారి జీవితాలు మేడమెట్లుయెక్కి దిగినట్లుగా ఏమీ ఒడిదుడుకులు లేకుండా, ఒకవేళవున్నా అవికూడా శృంగార సంబంధమైనవే గనుక అపురూపమైనవిగానే వుండటం, రేడియో ప్రోగ్రామువతుగా నాయికానాయకుల మనోరథాలు నెరవేరిపోతూవుండటం మొదలైనవి మావాళ్ళ వుత్సాహానికి కారణం.

ఒకచోట 'స్త్రీకి ప్రేమయేపట్టుగొమ్మ!' అని చెప్పబడి వుంది. ఈవిషయాన్ని గురించి ఒకమ్మాయికి సందేహం కలిగింది. 'ఏమండీ! స్త్రీలు ప్రేమలేనిదే బ్రతుకలేరా?" అని ప్రశ్నించింది. 'ప్రేమ' అనే పదానికి అర్థం చెప్పడం చాలకష్టం. అది అనేక రూపాలలో వుండవచ్చు 'ఒక్క స్త్రీలేకాదు, యావత్ప్రపంచములోని పిపీలికలు మొదలు మానవులవరకు ప్రేమలేనిదే బ్రతుకలేరు' అన్నాను. ఒకమ్మాయికి యెక్కడలేని రోషము వచ్చింది. 'ఒక్క ప్రేమలేకపోతే జీవితమంతా వ్యర్థమైపోవాల్సిందేనా? దేశానికీ తోటిమానవులకీ యెంతైనా సేవచేయవచ్చు. జీవితాన్ని స్వేచ్ఛగా స్వతంత్రంగా యితరుల ఒత్తిడి లేకుండా గడపవచ్చు. పాతివ్రత్యము, ప్రేమ అంటూ వంటయింట్లో కూర్చుని కూపస్థమండూకా ల్లాగ కాలాన్ని వ్యర్థం చేసేశారు మనవాళ్ళు." అంటూ ఒక లెక్చరు ప్రారంభించబోయింది. వెంటనే అది క్లాసని గుర్తుకి తెచ్చి "సరేలెండి! ఇలాగంటి విషయాలు మరొకసమయంలో చర్చిద్దాము. క్లాసు నడవనివ్వండి" అన్నాను. దాంతో అందరు తమతమ అభిప్రాయాలు ముందుకి తెచ్చారు. ఇంక గదమాయించకపోతే లాభం లేదని కొంత హంగామా చెయ్యవలసి వచ్చింది. వెంటనే సర్దుకున్నారు.

పాఠం ప్రారంభమయింది. 'యధారాజా తథాప్రజా' అని ఒకచోట వచ్చింది. ఒక పిల్లలేచి, క్లాసులోకూడ అంతేకాదండీ! 'యథాగురుః తథాశిష్యః' అన్నది. నాకు మాత్రం నవ్వొచ్చింది: ఇలాగంటి ప్రశ్నలు పిల్లలకి యిట్టే తట్టుతూవుంటాయి. ఆపిల్ల అన్నమాట అక్షరాలా సత్యం. పిల్లలకి తిన్నగా చదువురాకపోతే గురువుని అంటారు. పిల్లలు అల్లరిచేసి చెడుగా ప్రవర్తిస్తే తలిదండ్రులను తిడతారు. ఇదిలోక సహజం. కాని, తాను చదువుచెప్పే శిష్యులు యితరులకన్నా యెక్కువ తెలివిగా వుండాలని కోరని గురువు, తమ పిల్లలు పేరు ప్రతిష్టలుగా బ్రతకాలని కోరని తలిదండ్రులు సాధారణంగా వుండరు. తండ్రి అస్తి కొడుకుకి సంక్రమించినట్లుగా, గురువు యొక్క పేరు శిష్యులకుకూడ సంక్రమిస్తుంది. 'నీవన్నమాట నిజమే. గురువునుబట్టి శిష్యులుకూడా వుంటారు. గురువుగొప్పవాడైతే ఫలాని గురువు దగ్గర చదివినవాడనని వానికి గర్వకారణంగా వుంటుంది. తప్పకుండా గురువుగారి ప్రతిష్ఠలో కొంతభాగానికి హక్కుదారుడౌతాడు. ఆకారణంవల్లనే మీకంటేకూడా నేనే యెక్కువ జాగ్రత్తగా వుండవలసిన అవసరం యెంతైనా వుంది. మంచి ప్రవర్తనము, నిరాడంబర జీవితము, నియమయుక్తమైన అలవాట్లు మొదలైన విషయాలలో పిన్నలకంటె పెద్దలే యెక్కువ పాటించవలసి యుంటుంది' అని యేకధారగా వెళ్ళింది నావేగం." దీన్ని చూచి పిల్లలంతా ఆ అమ్మాయికేసి తీక్ష్ణంగా చూశారు. తరువాత తన తప్పు తెలుసుకుని క్షమాపణ కోరుకుందనుకోండి. ఈవిధంగా మా క్లాసులు శరవేగంతో గడిచిపోయినాయి. మావాళ్ళ కాశీప్రయాణం సమీపించింది.

నాబితుకు మాత్రం అలాగేవుండిపోయింది సుమండీ! తాటాకులు తలపుకి వచ్చినప్పుడల్లా చేతులు చెవులదగ్గరకు పోతాయేమోనని —





మాలతి (కారము):—

గోధుమపిండి — 1 అళాకు
పచ్చిమిర్చి — రెండు మూడు.
ఇంగువ — చిటికెడు.
ఉప్పు — ½ టీస్పూను.
డాల్డాగాని నెయ్యిగాని — 1 టీస్పూను.
పసుపు — చిటికెడు.
వేయించుటకు వలయునూనె.

పచ్చిమిర్చి బాగుగా నూరుకొన వలయును. పై చెప్పబడిన వస్తువుల నన్నిటిని కొద్దిగానీరుపోసి ముద్దగా కలిపి పెట్టి రెండు గంటలసేపు నాననియ్య వలెను. తరువాత ఆ పిండిని పూరీలవలె వత్తి, డైమండు ఆకృతిలో బిళ్ళలగా కోసి నూనెలో వేయించ వలయును.

మాలతి (తీపి):—

మైదాపిండి — 1 అళాకు.
చక్కెర — ½ అళాకు

మైదాపిండిలో ½ గరిటెడు డాల్డానో నెయ్యినో వేసి కొద్దిగానీరు పోసి ముద్దగా కలుపుకొన వలయును, ఆ పిండిని పూరీలుగా వత్తి, డైమండు ఆకృతిలో బిళ్ళలుగా కోసి డాల్డాలోగాని నేతిలోగాని వేయించ వలయును.

చక్కెరలో ఒక గరిటెడు నీరుపోసి పాకము చేయ వలయును. పాకపుచుక్క నీటిలోవేసిన మెత్తని ముద్ద అగున ట్లుండ వలెను. ఆ పాకములో వేయించినమైదా బిళ్ళలను వేసి బాగాకలుప వలయును.

అప్పము:—

బియ్యము — 1 పావు.
గోధుమలు — 1 పావు.
బెల్లము — 1/16 వీశె
నెయ్యి — 1 కప్పు.
ద్రాక్ష జీడిపప్పు, యాలక్కాయలు } — .... 10 చొప్పున.
అరటిపండు — ½ పండు.

గోధుమలు బియ్యము కలిపి నీటిలో ఒక గంటసేపు నానబెట్ట వలయును. తరువాత వడేసి వీటిని చేతికి నీటిని అద్దుకొనుచూ బాగా మెత్తగా రుబ్బుకొనవలయును. బెల్లముకూడా వేసి రుబ్బివేయ వలయును. ఈ పిండిలో అరటిపండు, జీడిపప్పు, యాలక్కాయలపొడి, ద్రాక్ష వేసి బాగా పిసకవలయును. నెయ్యి బాణలిలో ఈ పిండి ఒక్కొక్కసారి రెండేసి టీ స్పూనుల చొప్పున బాణలిలో కాగుచున్న నేతిలో వేయవలయును, రెండువేపులా ఎర్రగా కాలిన తరువాత చిల్లుల గరిటెతో దేవేయ వలయును.

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

"ప్రథమ చికిత్స"

డాక్టర్ ఎన్. హనుమంతరావు.

1. ఒకవేళ ఆసిడ్ విషమని తెలసిన ఎడల వెంటనే ఆల్కాలీ నిమ్ము. అవేవన:—

సున్నపునీరు విస్తారముగానిచ్చుట. (ఒక పెద్ద గరిటెడు సున్నము లేక మెగ్నిషియా అర్ధగ్లాసు నీళ్ళలో కలిపి గడియగడియకు త్రాగనిమ్ము.)

2. ఒకవేళ ఆల్కాలీ విషమని తోచినఎడల ఆసిడ్ నిమ్ము. అదేదన చిరకా చెరిసగముకలిపిన నిమ్మపండ్ల రసము గ్లాసుతో త్రాగించుము.

3. పుండుచేసిన విషము ఆసిడో ఆల్కాలీయో తెలియని ఎడల చాలనీళ్ళు త్రాగుటకిమ్ము.

1. పుండు గలుగజేయు విషమైన ఎడల ఒలీవనూనెగాని, సలాదనూనెగాని, పారఫిన్‌గాని, మృదుత్వము గలుగజేయు పదార్థములు అనగా బార్లీనీళ్ళులేక గంజిగాని యిచ్చిన ఎడల నొప్పి తక్కువగును.

2. మంటను పుట్టించు విషమైన ఎడల వాంతిని గలిగించు పదార్థములనిచ్చిన తరువాత ఆముదము త్రాగుటకిమ్ము. పెద్దవారికి రెండు పెద్ద గరిటెలు చిన్నవారికి రెండు చిన్న గరిటెలు నివ్వవలెను. ఒలీవ నూనె, వాలడ్ నూనె, పారఫిన్‌యను మందు లేక మృదుత్వమును గలిగించు పదార్థము అనగా బార్లీలేక గంజినిచ్చిన నొప్పి తగ్గును. గాని ఫాస్ఫరస్ విషమైన ఎడల ఏనూనెయు నియ్యవలదు.

"నిద్రమైకము కలుగజేయు విషములు"

1. రోగి నిద్రించుటకు ప్రయత్నించుచున్న ఎడల నిద్రపోనివ్వకుండ మెలకువ పరచుము. అట్లుచేయుటకు రోగిని నడిపించవలెను. లేదా, తడిబట్టను ముఖము మీదను రొమ్ముమీదను, మెడమీదను పెట్టుము. నల్లటి చిక్కని కాఫీనీళ్ళను గడియగడియకు త్రాగించుము.

2. రోగి సన్నిపాతపు స్థితిలోనున్న ఎడల వాంతి పుట్టించుమందును త్రాగించుము.

3. రోగి ఈడ్పు రోగపు స్థితిలోనున్న ఎడల వాంతికి మందిచ్చి, యీడ్పులకు మధ్య కృత్రిమ సాధకమైన యూపిరినిమ్ము.

4. అన్ని విషములందు పాలు పచ్చిగ్రుడ్డుపాలలో గాని నీళ్ళలోగాని కొట్టియిమ్ము. మీగడను పిండినికలిపి యియ్యవచ్చును. చిక్కని తేనీళ్ళనియ్యవచ్చును.

5. అదురునకు కాళ్ళు చేతులు చల్లబడుటకు చికిత్సను చేయుము.

"ప్రత్యేక చికిత్సను చేయవలసిన విషయములు"

Poisons which need special treatment

కార్బాలిక్ ఆసిడ్‌ను లైసాలును కండరములను తిని వేయు విషమునకుగల గుణలక్షణములే యుండును. వాసననుబట్టి ఈవిషమును తెలిసికొనవచ్చును.

"చికిత్స"

1. లభించిన ఎడల నొక పెద్ద గరిటెడు ఎప్సం ఉప్పును. లేక గ్లాబర్ ఉప్పును ఒక గ్లాసు నీళ్ళలోగాని పాలలోగాని కలిపి త్రాగించుము.

2. విషములకు జేయు సాధారణ చికిత్స చేయుము.

"అయోడీను"

మంటను పుట్టించు గుణలక్షణములే గలిగియుండును. ఇంతియేగాక విస్తారమైన దాహమును పసుపులేక నీలి వర్ణపు వాంతులును గల్గియుండును.

"చికిత్స"

1. గంజినీళ్ళు విస్తారముగా త్రాగుటకీయవలయును. లేదా మొక్కజొన్న పిండిపల్చగా చేసి యియ్యవలయును.

2. విషములకు జేయు సాధారణ చికిత్సనే చేయుము.

"నల్లమందు"

నల్లమందులేక నల్లమందు కలిపిన మందులు, నిద్రమైకమును గలుగజేయు విషములకుండు గుణలక్షణములే యుండును.

1. పది గ్రైనుల పొటాస్ పరమాంగనేటును లేక రెండు పెద్ద గరిటెల క్యాండీస్ ఫ్లూయిడ్ ఒక గ్లాసు నీళ్ళలో కలిపి త్రాగించుము. ఇట్లరగంట కొకసారి యిచ్చుచుండవలయును.

[సశేషము]

ఆటల కోసం.

డి. వి. ఆర్. భాస్కరశాస్త్రి బి. ఎ, బి. ఇడి.

రోడ్డు మలుపులో కారు హారన్ చప్పుడు వినపడగానే. లలితమ్మగారు విరబోసుకున్న జుట్టుతోనే, చేతిలో దువ్వెనతోనే వీధిలోకి వచ్చింది. శేఖరం "అమ్మా! అమ్మోయ్! ఈవేళ కోతి కొమ్మచ్చి ఆడుకోడానికి వెళ్తానే!" అంటూ కారు దిగేడు తొందరగా. డ్రైవరు పుస్తకాలు కారులోంచి తీసి ఇంట్లో పెట్టాడు. "అమ్మో! కోతి కొమ్మచ్చే? క్రిందపడితే కాళ్ళు విరిగిపోతాయి. వద్దుబాబూ!" అంటూ తొమ్మిదేళ్ల శేఖరాన్ని ఎత్తుకోబోయింది ఆవిడ. "పోవే నువ్వెప్పుడూ నన్ను ఆడుకోనియ్యవ్!" అని తల్లి కడుపుమీద ఒక గుద్దు గుద్ది, శేఖరం "నేను వెళ్తానే! అమ్మా! వెళ్ళి తీర్తానే!" అంటూ దీర్ఘంతీస్తూ నేలమీద పడి దొర్లడం ప్రారంభించేడు. సావిడి నల్లగచ్చుదైనా, శుభ్రంగా తుడిచినదైనా, "అయ్యయ్యో! వళ్ళు అంతా మట్టి అవుతుందిరా నాయనా లే!" అంటూ దగ్గరకు రాబోయింది లలితమ్మగారు. "అయితే అయిందిలే!" అంటూ బొల్లి ఏడుపు ఏడుస్తూ దూరంగా దొర్లడం మొదలెట్టేడు శేఖరం. "అరెరె, అదేంపనిరా, నాన్నా!" అంటూ చేతిలో పేపరుతో మేడమీంచి దిగేరు వెంకట్రావుగారు శేఖరం అల్లరి విని. "చూడండి! వాడు కోతి కొమ్మచ్చి ఆడుకోడానికి వెడ్తాడట- కాళ్లు విరగ కొట్టుకోడానికి" అంది లలితమ్మగారు, జుట్టు ముడివేసుకుంటూ. "నే వెడతా నాన్నా, ఆడుకోవాలి!" దీర్ఘం తీసేడు శేఖరం. "అబ్బెబ్బె!-లే, వెడుదుగానిలే!" అన్నారు వెంకట్రావుగారు, శేఖరాన్ని వంగుని లేవదీస్తూ శేఖరం నవ్వుతూ, "అమ్మ మంచిది కాదు నాన్నా! వెళ్ళ వద్దంటోంది!" అని ఫిర్యాదు చేసేడు. "అమ్మకు తెలియదురా, అమ్మ మంచిదికాదు. మన మిద్దం మిప్పుడు కార్లో." అనే తండ్రి మాటను "వెళ్ళి కోతి కొమ్మచ్చి ఆడుకుందాం మా స్నేహితులతో" అని పూర్తిచేసేడు శేఖరం. "నీలాటి మంచి కుఱ్ఱాడు వేశేడట 'దీక్ష' అనే సినీమాలో! చూచివద్దాం" అన్నారు వెంకట్రావుగారు. శేఖరం మాట విననట్టు. నాలాంటి వాడేనా??... అయితేనడు!" అని ఒక్కసారి పైకిసాగి, కన్బొమలెగరేసి, శేఖరంకూడా బయలుదేరేడు. లలితమ్మగారి ముఖం చేటంత అయింది. కొడుకు కోతి కొమ్మచ్చి కోసం వెళ్ళడం మానినందుకు!

వెంకట్రావుగారికి అది అలవాటు. ఎప్పుడు శేఖరం ఆడుకోడానికి బయలు దేరినా, ఏవో మాయ మాటలు ఆ గుంటడికి చెప్పి మానిపిస్తుంటాడు, ఆయనకూ లలితమ్మకూ కూడా సాధారణముగా ప్రతి ఆటలోనూ, ఏదో ఒక ప్రమాదం కనపడుతూనే ఉంటుంది! పరుగెత్తితే, పడితే కాళ్ళు కొట్టుకు పోతాయి! చెడుగుడు ఆడితే, కాళ్ళు బెణకవచ్చు, వంటినిండా మట్టి అవవచ్చు! బంతి ఆడితే కాళ్ళుమెలివేసుకు పడవచ్చు, బంతిదెబ్బ తగలవచ్చు!! ఇట్లా ప్రతి ఆటలోనూ, ఏదో ఒకహాని కనపడుతూంటే, శేఖరాన్ని ఆటలకు వాళ్ళు మాత్రం ఎట్లా పోనివ్వగలరు? అదేమిమాయయోగాని, శేఖరానికిఅస్తమానం "పరుగెత్తాలి, ఉరకాలి, పడాలి," అని ఉంటుంది! లేకపోతే ప్రక్కవాడిని ఒక గుద్దు గుద్ది, తానొక నాలుగు తినాలని ఉంటుంది! ఆ దెబ్బలలోనె, ఆ బాధలలోనే, అతనికి ఒకసౌఖ్యం కనబడు తున్నట్లుంది.

శేఖరంమాట అటుంచి, వెంకట్రావుగారు మాత్రం ఏమీ ఆటగాడుకాదు. తన తండ్రి తనకు బాగా ఆర్జించి ఇచ్చేడు. ఒక్కగాని ఒక్కకొడుకు అవడంవల్ల అల్లారు ముద్దుగా పెంపుడు పిట్టలా పెరిగేడు. తనలాగే తన సుపుత్రుణ్ణికూడా పెంచుతున్నా డాయన. కాని శేఖరం, తనలాగ తండ్రి చెప్పినట్లు వినక, వెంకట్రావు పద్ధతులను ప్రతిఘటిస్తూ ఉంటాడు. అయినా వెంకట్రావుగారు మాయమాటలు చెప్పి కుఱ్ఱాణ్ణి మరిపించి. వాడికి ఏవిధమైన హాని కలుగకుండా, పూలలో పెట్టినట్లు పెంచుతున్నాడు.

ఎప్పటిలాగే ఈ సారికూడా శేఖరాన్ని ఆటలకు పోకుండా తప్పించివేశాడాయన. సినిమా చూసి, శేఖరం చాలా ఆనందించేడు. తాను అక్కడ కూచున్నంత సేపూ తానే నాయకుడ ననుకున్నాడు. ఆరాత్రి ఇంటికి వచ్చి పడుకున్నాక, తోటల్లోకి స్నేహితులతో వెళ్ళినట్లు, అక్కడ హాయిగా ఆడుకుంటుంటే, లలితమ్మగారు పిలిచినట్లు కలవచ్చింది అతనికి. "ఆడుకొనివస్తాలే" అని చెప్పేడు సమాధానంగా. లలితమ్మ డ్రైవరును పంపింది. పట్టుకొని బలవంతాన్ని తీసుకురమ్మని. డ్రైవరు పట్టుకోబోతే అతని చెయ్యి నెత్తురు వచ్చేలా కరిచేశాడు శేఖరం. డ్రైవరు ఏడుస్తూవెళ్ళి వెంకట్రావుగారితో చెప్పేడు.

అబ్బాయిగారు కరిచేరని, నెత్తురుకారేచెయ్యి చూపుతూను. వెంకట్రావు పేక బెత్తం పుచ్చుకుని శేఖరాన్ని వీపుమీద చురుకు చురుకు కొట్టూ .... ఇంట్లోకి తీసుకు వస్తూంటే "బాబోయ్! బాబోయ్! కొట్టకు నాన్నోయ్" అంటూ, ఏడుస్తూ ప్రక్కమీద గిలగిల లాడుతూ లేచేడు శేఖరం. "హాఁ! హాఁ! ఏమిటది శేఖరం! పడుకో!" అంటూ, లలితమ్మలేచి వాడిని పడుకో బెట్ట బోయింది, వీపుమీద చెయ్యివేసి.


"అమ్మా! .... ఆడుకోడానికి వెళ్తేనేం ... నాన్న కొ .... కొ .... కొట్టేడు!" అంటూ ఏడుస్తున్నాడు శేఖరం. "అయ్యో! నాతండ్రీ! కలవచ్చింది కాబోలు! పాడుకల వట్టిది నాయనా! మీ నాన్న మేడమీద నిద్ర పోతున్నారు!" "లేదమ్మా! .... నావీపుమీద .... పే పే ... పేకబెత్తం పుచ్చుకొని ...." అని ఏడుస్తున్నాడు శేఖరం. ఇంతట్లోకి మేడ మెట్లమీద లైటు వెలిగింది. వెంకట్రావుగారు దిగివచ్చేరు "ఏమిటే, అది!" అంటూ. లలితమ్మ తన తొమ్మిదేళ్ళ కొడుకుని ఎత్తుకుని సంగతి చెప్పింది.

"వెఱ్ఱివెధవాయి! అస్తమాను ఆటలు! ఆటలు! పగలూ, రాత్రీ! .... నిద్రకూడా పట్టటంలేదు ఈ ఆటల కోసం! రా, అబ్బీ! దా! నేనెత్తుకుంటా దాఁ!" అని వెంకట్రావుగారు శేఖరాన్ని ఎత్తుకున్నాడు. శేఖరం "నాన్న .... నువ్వేం ... నన్నేం .... ఆడుకోడానికి వెడితేనేం ...." అంటూ ఒక్కుమ్మడిగా ఏడ్చేడు. ఈ బెంగతో కొడుకు ఆరోగ్యం చెడుతుందేమోనని భయ పడ్డాడు వెంకట్రావుగారు. "పిచ్చితండ్రి! తెల్లవారేక .... రేపు నీ స్నేహితులతో నీ ఇష్టం వచ్చినట్లు ఆడుకో!" అన్నాడాయన "అయితే కోతికొమ్మచ్చి ఆడుకుంటాము నాన్నా!" అని అడిగేడు శేఖరం ఏడుపు మానడానికి యత్నిస్తూ. "ఊఁ, సరే! అట్లాగే" "ఊహుఁ, అది కాదు, నాన్నా! మా స్నేహితులంతా రేపు నేరేడు పండ్లు కోసుకోడానికి వెళ్తామన్నారు! నేనుకుడావెళ్తా నాన్నా!" "హుఁ సరే!! పండుకో!" అన్నాడాయన, శేఖరం తల తన రొమ్ముమీద ఆన్చుకొని, జుట్టు నిమురుతూ.

★







కాళ్లు

శ్రీమతి సువేణీకాశ్యప్

స్త్రీ సౌందర్యానికి తోడుపడేవాటిలో కాళ్లఅందం కూడా ఒకటి. కాని పాపం కాళ్ళు చేసుకొన్న పాపం ఏమిటో గాని వాటిని ఎవరూ లెక్కచేయరు. ఏదైనా అయిష్టత తెలియచేసేటప్పుడు కాలిగోరు మీ దున్నంత ఇష్టంకూడ లేదు అంటారు. కాలిని హీనంగా చూస్తారు. కాని అసలా కాలేలేకపోతే జీవితం ఎంత దుర్భరం అవుతుందో ఊహించరు. కాలు కాలినప్పుడు, కాలికేమైనా దెబ్బ తగిలినప్పుడు అది గుర్తుకొస్తుంది. అప్పుడు దానిమీద ఎక్కడలేని జాలీ కలుగుతుంది. కాని ఎల్లప్పుడుకూడ కాళ్ళను జాగ్రత్తగా కాపాడుకోవాలి.

కొందరి కాళ్ళు చూస్తాను ఎంత అసహ్యంగా ఉంటాయో! మచ్చలతో, దుమ్ముధూళితో, వంకరటింకర వ్రేలిగోళ్ళతో అబ్బ! ఘోరంగా ఉంటాయి. కొంచెము జాగ్రత్త తీసికొంటే కాళ్ళు చక్కగా ఉండి, ఆకర్ష వంతంగా ఉంటాయి. ఒకసారి ఎక్కడో చదివాను; "ఆ చక్కని కాలి చెప్పు దెబ్బ అయినా తినగల్గితే .." అని. బహుశ అది దేవతల కాలిలాంటిదేమో! కాని మన కాళ్ళనుకూడ అలా చేసుకోవచ్చు ఎలాగో చూదాము.

స్నానం చేసేటప్పుడు కాళ్ళను బాగా సోపుతో రుద్దుకొంటే మన్ను. అదీ పోయి శుభ్రంగా ఉంటుంది. అప్పుడే వ్రేళ్ళసందునా, గోళ్ళను బాగా కడుగుకొంటే బాగా ఉంటుంది.

కాలికి సామాన్యంగా చెప్పుపుండ్ల మచ్చలు, ఎదురు దెబ్బల మచ్చలు ఉంటుంటాయి. అవి పోయేందుకు ప్రయత్నించాల్సిన అవసరం ఎంత అయినా ఉంది. కొన్ని ఎర్రవాగుగా ఉంటాయి. అలాంటి మచ్చలను, **Table Salt** లో నిమ్మరసం వేసి బాగా కరగనిచ్చి దానితో రుద్దుతే పోతాయి. కొన్ని నల్లని మచ్చలుంటాయి. అవి తేనెతోపోతాయి. అంటే తేనెలో నిమ్మరసం వేసి కలిపి దానితో రుద్దుతేపోతాయి. అయితే ఇలా వరసగా వారం పదిరోజులు, రోజుకు రెండు మూడుసార్లు రాయాలి.

తర్వాత నీళ్ళలో ఎక్కువనానితే కాళ్ళుపాస్తాయి. అలాంటప్పుడు బాగా సోపునీళ్ళతో పాసినచోటులను కడిగి తడిలేకుండాతుడిచి, ఫేస్ పౌడరుగాని, బోరిక్‌పౌడరు గాని వేస్తే తగ్గిపోతుంది. అలాగే మడమలు పగులు తూంటాయి. అలాంటప్పుడు వాసలైనో, ఆముదమో వేసి బాగా రుద్దుకొంటే త్వరగా తగ్గిపోతాయి. వీటిబదులు సైబాల్, జాంబక్ మొదలైన ఆయింటుమెంట్సు ఉపయోగించవచ్చు. **Hand cream** గాని **Hand lotion** గాని రాయటం మంచిది. కొంత మంది నవనీతముపయోగిస్తారు. అంటే కొబ్బరినూనెలో నీళ్ళుపోసి బాగా చిలకరిస్తే తెల్లగా వస్తుంది. అదే నవనీతమన్న మాట. ప్రతి రోజూగాని, వారాని కొకసారిగాని పసుపు కాళ్ళకు రాసుకోవటం మంచిది.

ఇక గోళ్ళు చూదాము. గోళ్ళను శుభ్రంగా కడిగి దాని మీద క్యూటెక్సువేయుటయో, గోరింటాకు పెట్టుటయో చేయాలి. ఒకొక్కసారి కాలిబొటనవ్రేలిగోరు పెరగటం ఆగిపోతుంది. దానికి కారణం కాలిషియం లేకపోవటం ఒకటి అనుకోండి. రెండోకారణం గోరుచిగురునంటించి కత్తిరించటము. బొటనవ్రేలిగోరును అర్ధచంద్రాకారంగా కత్తిరించకూడదు. **Straight** గా కత్తిరించాలి. రోజూ చేతితో మండశిలదగ్గర గుండ్రంగా తిప్పుతూంటే మంచి వంపు వస్తుంది.

సామాన్యంగా కాళ్ళద్వారానే వేడిచేయటం, జలుబు చేయటం జరుగుతూంటుంది. అందుకని ఎక్కడ నడిచేటప్పుడైనా దానికి తగిన చెప్పులు వేసుకోవటం అలవాటు చేసుకోవాలి. చెప్పులు ఎంచుకొనేటప్పుడు కాలికి సరిగా సరిపోయే చెప్పులను చూసుకోవాలి. ఈ ఎండాకాలంలో మధ్యాహ్నంపూట కాళ్లుబ్బుతాయి అప్పుడు మన చెప్పులు ఇరుకుగా ఉండి కాళ్ళు నొప్పిగా ఉంటాయి. అందుకని చెప్పులు కొనేందుకు మధ్యాహ్నంపూట **Shops** కెళ్ళాలి. ఈ చెప్పులు ఏరుకోవటంలో తెలివి తేట లుపయోగించాలి మంచిచాయ ఉన్నవాళ్ళు నల్ల రంగు చెప్పులు వేసుకొంటే బాగుంటాయి. చామనచాయగ ఉన్నవాళ్ళు ఎర్రచెప్పులు ఇంకా దానికి సంబంధించిన రంగులు బాగుంటాయి. అలాగే కొంచెము పొట్టిగా ఉన్నవాళ్ళు ఎత్తు మడమల చెప్పులు వేసుకొంటే బాగుంటుంది. కాని ఎక్కువ నడవాల్సివచ్చినప్పుడు ఎత్తు చెప్పులు పనికిరావు. అలాగే పొడుగుగ ఉన్నవాళ్ళు వేసుకోకుండా ఉంటే బాగుంటుందని వేరేచెప్పనక్కర్లేదు. తర్వాత చీరరంగుకు సరిగా చూసుకొని వేసుకొంటే చూసేందుకు చక్కగా ఉంటుంది. చెప్పులు ఎక్కువగా **Fashion** కోసంకంటే ఆరోగ్యంకోసం కొనటం నేర్చుకోవాలి. కరిచేచెప్పులు కాకుండా మెత్తని తోలు చెప్పులు సింపుల్‌గా ఉండేవి తొడుక్కుంటే ఈవేసవి కాలంలో హాయిగా, అందంగా ఉంటుంది. సరే ఇంక కాలికి ఎలా **Rest** ఇవ్వాలో చూదాము. బాగా నడిచినప్పుడు కాలు నొప్పిపెట్టడం సహజము. అప్పుడు గోరువెచ్చని నీళ్ళతో మోకాళ్ళవరకు ధారగాపోసి, తర్వాత చన్నీళ్లతో ధారపోస్తే నొప్పులు తగ్గుతాయి. కదుములు కడితే వేడినీళ్ళు ధారగాపోస్తూ మెల్లిగా వ్రేళ్ళతో ఆ కదుమును రుద్దుతే కరిగిపోతుంది.

తర్వాత పీలైనప్పుడల్లా కాళ్ళు మెలికలువేసి బరువును చిటికెన వ్రేలివైపు మడమమీద అపుకొంటే కొంత విశ్రాంతి కలుగుతుంది.

తర్వాత కాళ్ళకు మంచి వ్యాయామము నడక. కనీసం రోజు కొకమైలు నడవటం చాలమంచిది. లేకపోతే కాళ్ళు కదుములు కడ్తాయి. నడకవలన బాగా కాళ్ళు సాగుతాయి. ఒంటికికూడ మంచిది. తర్వాత కాళ్ళు మంచి **Shape** లో ఉండాలంటే **Skipping** ఆడటం మంచిది. ఇలా ప్రయత్నిస్తే చక్కని కాళ్ళు అతి త్వరలో అమర్చుకోవచ్చును



బిడ్డలు - తలిదండ్రులు

శ్రీ కె. వెంకట్రామయ్య

సెక్సు విషయములను గూర్చి బిడ్డకు తెలుపు విధానము.

(Sex Education for the Child)

'సెక్స్'అను మాటకు సరియగు తెలుగు పదమేదియు లేదనియే చెప్పవలెను. సెక్స్ అనగా లైంగిక కామవిషయము మాత్రమే యని తలంపరాదు. స్త్రీలు పురుషులు వ్యక్తిగతముగ నెట్లు చరింతురో, ఎట్టి మనోభావములను ప్రకటింతురో, పరస్పరమెట్లు వ్యవహరింతురో యను విషయములన్నియు నీ 'సెక్స్'అను పదమున నిమిడి యున్నవి.

సెక్సును గూర్చి బిడ్డలతో ప్రసంగించవలెననెడి తలంపే మన పూర్వుల కెంతో తప్పుగను ఘోరముగను తోచెడిది. ఇప్పటికిని చాల మంది పెద్దల యుద్దేశము లట్లేయుండుట ఎంతయు శోచనీయము. ఇది వారు పొందిన పెంపకప్రభావము చేతనే కావచ్చును. లేదా సెక్సన నేమో సరిగా తెలిసికొనకుండుట చేతనే కావచ్చును.

సెక్సును గూర్చి బోధించుట ముఖ్యముగా రెండు విధములైయుండును.

1. సెక్సునకు సంబంధించిన శరీరవిషయములను గూర్చి సరియగు జ్ఞానము నలవడజేయుట.

2. సెక్సు యెడను, దానికి సంబంధించిన సమస్యల యెడనూ సరియగు శుద్ధ భావములను గలుగజేయుట.

సెక్సు నేదృష్టితో జూడవలెను ?

సెక్సన నేదో నసహ్యాకరమును సిగ్గుకరమును నగు సంగతిగా తలిదండ్రు లుద్దేశపడుచుండిరేని బిడ్డలు నదే విధముగ తలంపగలరు. సెక్సు నెడ బిడ్డల భావములు సరియైయుండవలె ననిన తలిదండ్రులు తమ భావములను మొదట సరిదిద్దు కొనవలెను. కాని అది సాధ్యమా యను ప్రశ్న గలదు ప్రయత్నించిన నేదైనను సాధ్యమే యగును. తలిదండ్రులు మొదట తమ చిన్నతనమును జ్ఞప్తికి దెచ్చుకొని అప్పటి యేపరిస్థితులలో వారికి సెక్సన, నసహ్యమును సిగ్గును జనించెనో యోచించవలెను. సెక్సును గూర్చి వారే స్వయముగ దెలిసికొనగలరని వారి తలిదండ్రు లూరకుండిరా ? సెక్సును గూర్చిన జ్ఞానము వారికపమార్గముల నబ్బెనా ? వారి తలిదండ్రులు దాని ప్రసక్తియే రాకుండ జాగ్రత్త పడుచు అది యాలోచింపతగని సంగతిగా సూచించిరా ? తమ తలిదండ్రులు సెక్సు నెడ నట్టి భావములను జూపుటచే తమ సంతోషమున కది తోడ్పడెనా ? తాము ను దాని నట్టి భావములతోనే జూచెదరా ? లేక తమ బిడ్డల కంతకన్న నుత్తమ భావములను గలిగింప ప్రయత్నింతురా ?— ఈ విషయములన్నియు తలిదండ్రులు బాగుగా నాలోచించుకొనవలసినవే యైయున్నవి. చిన్నప్పుడు సెక్సు నెడ తమ కేర్పడిన సంకుచిత భావములను మాన్పుకొనుట కష్టమే యైనను బిడ్డల కొరకని గట్టి ప్రయత్నము జేసిన నవి చాలవఱకు మారగలవు.

సెక్సనునది శరీర విషయములకును సంతాన సృష్టికిని సంబంధించినది మాత్రమేగాదు. అంతకంటె నుత్తమమును ఉత్కృష్టమును నైనది. మానవ ప్రేమకును, కుటుంబ జీవనమునకును మూలాధార మిదియే. పరస్పర గౌరవానురాగములమీదను అన్యోన్యాభిలాషల మీదను ఆధారపడి ఏర్పడిన కుటుంబమే ఎదిగెడి బిడ్డ కెంతయు ననువగు పరిసరమగునుగదా. అతి సుందరములును శాశ్వతములును నగు విషయము లీ లోకమున వెలయుట కేదికారణ మన 'సెక్సే' యని తెలియగలదు. కవిత్వము, సంగీతము, నృత్యము, చిత్రలేఖనము, శిల్పము మున్నగు కళలన్నియు స్త్రీ పురుష ప్రేమావేశ ప్రేరితములే. మానవులను ఘనకార్యములకు ప్రేరేచున దీ సెక్సు ప్రభావమే. ఇది యొక శక్తి. కళాసృష్టి కిదియే ఆధారము. పరమార్థమును సాధింప ప్రయత్నించెడి సాధుపుంగవులకును నిది యవసరమే.

సెక్సును గూర్చి చెప్పగల చెడుగును యెంతో యున్నది. అను దినమును మానవు లాచరించెడి యవినీతియు, అపచారమును, అనుభవించెడి దుఃఖమును చాలవర కీ సెక్సునకు సంబంధించియేయుండును. కాని ఇది చాల వఱకు వారి యజ్ఞానము వలనను సెక్సు విషయములలో సరియగు శిక్షణ లేకుండుట వలనను జరుగుచుండును. సెక్సును గూర్చి యపార్థము జేసికొనుటయును, తక్కిన జీవితముతో సెక్సున కెట్టి సంబంధము లేదని తలంచుటయును గూడ కారణములు కాగలవు

బిడ్డలు - తలిదండ్రులు

ఇప్పటికిని చాల మంది తలిదండ్రులు తమ బిడ్డలతో సెక్సును గూర్చి ప్రసంగించుట తప్పుగ నెంచి మౌనము ధరింతురని చెప్పితిమి. కాని విచిత్ర మేమన, వీరే, తమ వయస్సు పెద్దలతో సెక్సును గూర్చి చర్చించుచు ముచ్చటించుచు చమత్కృతియైనను లేని చెడు కథలను చెప్పుకొని తబ్బిబ్బగుచుందురు. బిడ్డల గనుటయు, సెక్సు అనుభవముల బొందుటయు వీరికి సిగనిపించదు. కాని తామేదో తప్పు జేసితి మను భావముతో (ఇది పెంపక ఫలితమే) సెక్సు నొక సిగ్గు కరమగు విషయముగా తలంతురు.

సెక్సునకు సంబంధించిన యభ్యాసము నెప్పుడు మొదలిడవలెను ?

ఇది నిజముగ బిడ్డ పుట్టిన మొదటి సంవత్సరము నందే యారంభమగును. దేహాంగముల భేదములను గుర్తించుచు, వాని వ్యాపారముల యందాసక్తిని జూప నారంభించినంతనే బిడ్డకు పై యభ్యాసము మొదలిడును. అతడప్పుడే జననేంద్రియముల నొక దృష్టితో జూచుట నలవరచుకొనుచుండును. జననేంద్రియములు గూడ నితర దేహాంగములవలె ప్రత్యేక నామములును, ప్రయోజనములునుగలిగినవని యతడు భావింపగలడు. లేదా అవి యేవో రహస్యాంగములు, అంటరానివి, చూడరానివి, వాని నెప్పుడు కప్పియుంచవలెను, వాని పేళ్ళను, వ్యాపారములును గూడ రహస్యములు, వానిని గూర్చి మాట్లాడుటయు రహస్యముగనే యుండును అనెడి భావములెన్నో బిడ్డకు గలుగవచ్చును. శరీర నిర్మాణమునందు జననేంద్రియములును, విసర్జితావయవములును అతి చేరువుగ నేర్పడి యుండును. అందుచే వాని యందొక దానియెడ బిడ్డ దృష్టిఎట్లైయియుండునో రెండవదాని యెడనునదే విధమై యుండును. (పెద్ద వారును తరచుగ నిదేవిధముగ జూచు చుందురు) కనుక, విసర్జితావయవములన్నను, విసర్జన వ్యాపారములన్నను, దిగంబర స్థితియన్నను సిగ్గుగ జూచెడి దృష్టి బిడ్డ కేర్పడకుండ తలిదండ్రు లతి మెలకువతో మెలగుచుండుట ముఖ్యమగును. బిడ్డ తన శరీరాంగములయెడ చూపెడి కుతూహలము సహజమే యైనను తల్లి కది విపరీతముగా తోచవచ్చును. ఐనను ఆమె యతని నాటంక పరుపక గమనింపని విధమున నూరకుండిన ఆ కుతూహల మెంతకాలమో ఉండక అంతరించును జననేంద్రియముతో నాడెడి దురభ్యాసము బిడ్డకు పట్టువడుచున్నదని తల్లి భావించుచుండెనేని ఒక యాటవస్తువు నాతనికిచ్చి చేతులకు తగినంత పని కల్పించవలెను. ఎందులకన చేతి వ్రేళ్ళను వాడుటయందే బిడ్డ యానందము పొందును. దాని కవకాశము కల్పించిన చాలును.

ఆదినుండియు బిడ్డకు శరీరాంగములను, శరీరవ్యాపారములను, సరియగు పదములతో తెలుపుచుండవలెను. అతడు సులభముగా తెలిసికొనగలడని ఏవో సూచక శబ్దములను వాడుట తప్పు. పదములను పలుకుట బిడ్డకు మొదట కష్టమే యైనను వాని ఉచ్చారణ ఇట్టిదని మనమున నాటుకొనిన ఆ పదములనే అతడెదిగిన పిదప నెంతో స్పష్టముగా పలుకగలడు.

శరీరాంగములను దెలుపు ప్రాణము, బొడ్డు, పిరుదులు, పొత్తికడుపు ఇత్యాది పదములను, శరీరవ్యాపారములను దెలుపు మూత్ర విసర్జన, మల విసర్జన, మాలశయ చలనము,. సంగమించుట, గర్భముదాల్చుట, కనుట మొదలగు మాటలను ఐదేండ్లు నిండుసరికే బిడ్డ క్రమముగా తెలిసికొనవలెను.

చిన్న పిల్లల ప్రశ్నలు.

పిల్లవాని కొక వయస్సు రాగానే "ఈ పిల్లి పిల్ల లెక్కడి నుండి వచ్చినవి ? ఈ పసిపాప డెట్లు వచ్చెను?" అనెడి వింత జనించును. అప్పటినుండియు పై జెప్పిన పదముల నతడర్థము జేసికొనవలసియుండును. పిల్లి కూన లెక్కడినుండి వచ్చినవన పిల్లి కడుపులో పెరిగి వచ్చినవని సమాధాన మీయవలెను. ఇట్లే పసిపాపడు తల్లి కడుపులో నెదుగునని చెప్పవచ్చును. బిడ్డ కెల్లపుడును యదార్థమునే చెప్పవలెను. సరళముగను, సులభగ్రాహ్యముగను ఉన్న దున్నటులనే చెప్పవలెను. చిలవలు పలవలు కల్పించి చెప్పరాదు. బిడ్డ డడిగెడి అమాయికపు ప్రశ్నలు మనకు గడ్డుగా నుండి కలవరపరచునేమోగాని అతనిలో నెట్టి భావములను గలుగజేయవు గాలి యెక్కడినుండి వచ్చినదని యడుగుటయు, పసిపాప డెక్కడినుండి వచ్చెనని ప్రశ్నించుటయు అతని కొకటిగనే తోచును. తన చుట్టునున్న వస్తువు లెక్కడినుండి వచ్చినదియు నతడు తెలిసికొన గోరుట సహజమే. అట్టి వింత సహజాతమే. అతనిని పై విధమున ప్రశ్నింపజేయును. పసిపాపడు తల్లి గర్భమున పెరుగు ననెడి సమాధానము బిడ్డకు తృప్తికరముగనే యుండును. అంతకు మించిన వివరము

లను తెలిసికొనవలెనని అతడా చిన్న వయస్సున తలంపడు. సూర్యుడు తడినేల నారగొట్టును. విత్తనముల నుండి చెట్లెదుగును అనెడి సంగతుల నతడేవిధమున గ్రహించునో అదే తీరున తల్లి గర్భమున పసిపాప లెదుగు ననెడి విషయమును గూడ గ్రహించును. అంతకు మించి యత డాలోచింపడు. విచిత్రపడడు. అందుచే బిడ్డకు మన మిచ్చెడు సమాధానము లెంతో సహజములై యుండవలెను. సులభగ్రాహ్యములును, ఉద్రేక రహితములును కావలెను. తా నడిగిన విషయమేదో సామాన్యమే యను భావ మతనికి కలుగజేయవలెను. బిడ్డ డడిగెడి ప్రశ్నలకు కలవరపడి కంగారు జూపునెడ అతనికి లేనిపోని యనుమానము కలుగవచ్చును. వింత పుట్టవచ్చును. అట్లు గానిచో మన సమాధాన మెట్లుండునో యను భయముచే తా నడుగగోరిన విషయము నడుగుటమే మాని మనమున నిడుకొని మరువగలడు బిడ్డ డీవిధమున భయముచే నొకవిషయమును గూర్చి యడుగక మరచుటకును, దానిని గూర్చి ప్రశ్నించి మన స్సంతృప్తిని బొందిమరచుటకును ఎంతో వ్యత్యాసమున్నది.

పుట్టుకను గూర్చి పిల్లకేవో పాతకథల నిప్పటికిని చెప్పుచుందురు. అవి యబద్ధములని వారు గ్రహించినంత నే తలిదండ్రుల నావిషయమును గూర్చి యెన్నడు నడుగకుందురు. అందుచే వారికా విషయమై కలిగెడి సందేహములు దీరక బాధ పడుటయు జరుగుచుండును.

యథార్థమేదో బిడ్డల కేల చెప్పవలెను ?

సెక్సును గూర్చి బిడ్డలకు యథార్థమునే తెలుపవలెననుట కెన్నో కారణములున్నవి. అం దీక్రిందనుదహరించిన వెంతో ముఖ్యములు.

1. యథార్థ మిదియని బిడ్డకు మనము చెప్పినను చెప్పకున్నను దానిని గూర్చి యత డెప్పుడో యొకప్పుడు తానే తెలిసికొనగలడు. కాని యీ తెలిసికొనుట పెడసరమై యపమార్గముల పట్టవచ్చును అట్టి యెడ దాని ప్రభావ మతని జీవితమున చెడుగుగనే పరిణమించగలదు. ఎన్నో వివాహముల వినాశనమున కిదియే కారణము. సెక్సును గూర్చియు, పుట్టుకనుగూర్చియు తా మెరిగిన వెగటు విషయముల నితర పిల్లల కందించి యానందించెడి బాల బాలికలు కొందరు ప్రతి బడియందు నుందురు. ఇట్లే ఒక బడిలో కొంచ మెదిగిన బాలిక యొకతె యుండెడిది. ఆ బాలిక తన కన్న కొంచము చిన్నదగు పదకొండేండ్ల వయసు పిల్లను బిడ్డ లెట్లు పుట్టుదురో తెలియునా యని ప్రశ్నించెను. ఆ, తెలియకేమి ? పువ్వుల నుండి పుట్టెదరని యీ బాలిక యమాయికముగా బదులు జెప్పెను. (ఇంటి యందలి వారా బాలిక కట్లే జెప్పిరి. దాని నామె నమ్మెను.) అంత మొదటి బాలిక ఆ పిల్ల యజ్ఞానమునకు విరగబడి నవ్వి తనకు తెలిసిన పరమ రహస్యమునేదో బయట బెట్టెను. దానితో రెండవ బాలిక విస్మయమొంది ఆహా ! నేను పెరిగి పెద్ద దాన నైనచో పిల్లల గనవలెగదా యని బాధ పడ జొచ్చెను. ఎన్నో నెలల వరకును ఆ భయము వదలక ఆమె యేడ్చుచుండెడిది. తనకు బిడ్డలు కలుగ రాదని భగవంతుని ప్రార్థించెడిది. కొన్నాళ్ళకా భయమును బాధయు పోయెను. కాని పుట్టుకను గూర్చి ఇంకను తెలిసికొనవలెనను కుతూహల మెక్కువయ్యెను. అంత నా బాలిక వారిని వీరిని యడిగి ఏవో చెడ్డ విషయములను చాల గ్రహించెను. తదుపరి వాని ప్రభావమును పోనడిపి సెక్సును సరియగు దృష్టితో జూచెడి శక్తిని బొందుట కామె ఎన్నో యేండ్లు ఎంతో కృషి చేయవలసివచ్చెను.

2. బిడ్డకు యథార్థ జ్ఞానము నెఱుక పరిచినచో అయోగ్యమును, అనవసరము నగుదాని నలవరచుకొనడు. ఒక పిల్లవానిని మరియొకడు పసిపాప డెక్కడ నుండి వచ్చెనో, తెలియునా యని ప్రశ్నించినపుడు "ఆఁ, అది మా యమ్మ యెన్నడో జెప్పె"నని యతడు జవాబిచ్చిన రెండవవాడా ప్రసంగము నిక యెత్తుకొనడు. ఎందులకన అది మొదటి వానికి తెలిసిన విషయమే. వింతపడుట కది కూడని రహస్యమేమియుగాదు.

3. బిడ్డ డారంభమున నడిగెడు ప్రశ్నలకు సరియగు సమాధానములనే ఈయవలెను. అబద్ధముల జెప్పి అతని బుద్ధి హీనతను బయల్పరచిరనిగాని, చెప్పరాని రహస్యమేదో దాచి యుంచిరనిగాని బిడ్డ తలంచినపుడు తలిదండ్రులయెడ అతనికి విశ్వాసము సడలును. ఇట్టి పరిస్థితి బిడ్డకును తలిదండ్రులకును మధ్య నొక పెద్ద యాటంకముగ తయారై అన్యోన్యతానురాగముల నేర్పడకుండ జేయును.

4. ఎన్నో విషయములందు బిడ్డలకు పెద్దవారి సహాయమవసరమగును. సెక్సు విషయములం దది చాల ముఖ్యము. అందుచే నా విషయములగూర్చి పిల్లలు

తమతో ప్రసంగించుటకు తలిదండ్రు లవకాశ మీయ వలెను. లేనిచో వారికి తొలి యౌవనమురాగానే సెక్సు సమస్య లేర్పడి ఏమిచేయుటకును తోచక నిస్సహాయులై బాధపడగలరు.

పదునెనిమిదేండ్లు వయస్సు బాలిక లెందరో మనస్తత్వ వేత్తయగు నొక వనిత కడకు సలహాకై వచ్చెడివారు. ఆమె కనుగొన్న దేమన సెక్సును గూర్చి వారెవ్వరికిని ఏమియు సరిగా తెలియదు. అది వారి కయోమయము. దానిని గూర్చి వారికెంతో బోధింపవలసియుండెను. తల్లులతో వారు చర్చింపజాలని చిక్కుసమస్య లెన్నింటినో యామె పరిష్కరింపవలసియుండెను. తల్లీ బిడ్డల నడుమ సరియగు సన్నిహితభావమే యేర్పడియుండిన అట్టి సమస్యలే తల యెత్తకుండెడివి. కాని అసలు పరిస్థితి యేమన ఆ పిల్లలలో నొక్కరికిని తమ తల్లులతో సెక్సును గూర్చి ప్రసంగించు నవకాశమే లేకుండెను. చివరకు పుట్టుకనుగూర్చి తెలిసికొన గోరిన గూడ తల్లుల కది బాధాకరముగ నుండెడిది. పుట్టుక యనునదెంతయు సహజమగు వ్యాపారము. దానిని తప్పుగను, నీచముగను తలంచుట మిగుల శోచనీయము. అట్లు తలంచుట మన బుద్ధి హీనతయే యనిపించుకొనును.

బిడ్డ కేమి చెప్పవలెను ?

సెక్సును గూర్చి బిడ్డ దేదైన తెలిసికొన గోరినపుడు అత డడిగిన దానికే సమాధాన మీయవలెను. అంతకు మించి చెప్పరాదు. చెప్పెడి దేదో సూక్ష్మముగను సులభ గ్రాహ్యముగను చెప్పవలెను. అడిగిన దానికి సరియగు సమాధాన మొకసారి ఇచ్చినను బిడ్డ దానిని గూర్చియే మాటి మాటికి యడుగగలడు. ఏలయన ఏదైనను మరల మరల విన్ననేగాని బిడ్డకు జ్ఞాపకముండదు. ఐనను ప్రతి మారు నత డొకేరీతిగ ప్రశ్నింపక ఏదోయొక క్రొత్త యంశము నెరుగ గోరుచుండును.

బిడ్డ కిచ్చెడి సమాధానము క్లుప్తమును సులభగ్రాహ్యమును కావలెను. ఎక్కువ వివరములతో జెప్పిన నది యతని కయోమయమై యర్థముగాకుండును. పైగా అనవసరమగు వింతను రేకెత్తించును.

బిడ్డ కెప్పుడు చెప్పవలెను ?

బిడ్డలు సెక్సు సంగతులగూర్చి యడుగుట నే వయస్సున నారంభింతురో సరిగా జెప్పజాలము. మూడేండ్లకును, యేడేండ్లకును మధ్య ఎప్పుడైనను ఇది యారంభము కావచ్చును. ఇది యెప్పు డారంభమైనను అడిగిన ప్రశ్నలకు సరియగు సమాధానములను తక్షణమే యిచ్చుచుండుట యవసరమగును. అట్లు సమాధాన మిచ్చుట ఎప్పుడైనను వలను పడనిచో తరువాత నీయగలమని బిడ్డకు నమ్మిక గలుగు రీతిని నిశ్చయముగా జెప్పవలెను.

బిడ్డ సెక్సును గూర్చి ప్రశ్నించెడి యవకాశమెప్పుడు కలుగునదియు మన మూహింపజాలము. అందులకై ముందుగనే తయారై యుండుట మంచిది. ఐదేండ్ల బిడ్డ డొకడు తన తల్లితో భుజించుచుండెను. ఆమె యేదో విషయమును గూర్చి చెప్పును అది యతడు పుట్టక పూర్వము జరిగె ననెను. అంత నీ క్రింది సంభాషణ వారిరువురకును జరిగెను.

కొడుకు : అమ్మా, నే పుట్టకపూర్వ మననేమి ?

తల్లి : నీవీ ప్రపంచములోనికి రాకపూర్వ మని యర్థము.

కొ : ఈ ప్రపంచములోనికి రాకపూర్వము నేనెచట నుంటిని ?

త : ఎచట నుంటివా, నీ తల్లి కడుపులో నున్నావు.

కొ : నే నాకడుపులోని కెట్లు పోగలిగితినమ్మా ?

త : చూడూ ! నీవిప్పటివలె పెద్దవాడవు కావు. ప్రక్కయింటి పసిపాప యంతయైనను లేవు. నిజముగా ఆవగింజ యంతయై యున్నావేమో. ఆవగింజ యంత యుండి నీ తల్లి కడుపులో పడి పెరిగి పసిపాపయంత వాడవు కాగానే పుట్టినావు.

కొ : ఐతే, పిల్లిపిల్లలు గూడ తల్లి కడుపులో గింజలవలె పడి పెరుగునా ?

త : ఔను, కుక్కపిల్లలును ఏనుగుపిల్లలునుగూడ నట్లే పెరుగును.

తల్లి సమాధానములు బిడ్డ కెంతయు తృప్తికరముగా నుండెను. ఇక యతడు తానెరిగిన జంతువుల పేళ్ళ నన్నింటిని ఏకరవు పెట్టి అంతతో నావిషయమును వదలెను. దానిని గూర్చి ఇక యెన్నడు ప్రసంగింపలేదు.

(సశేషము)

శ్రీశైలం

శ్రీమతి ఆర్. రామకోటమ్మ

"శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మన విద్యతే"

వ్యాస ప్రోక్తమగు అష్టాదశ పురాణములలో "స్కాందము"ను అందొక భాగమైన శ్రీశైల ఖండమును సుప్రసిద్ధములు. శ్రీశైల మహాత్మ్యము జగద్విదితము. కాశీ కంటెను అగమ్యమైన ఈ శ్రీశైలపుణ్యక్షేత్రమును శ్రీమతి సి. హెచ్. అరవిందాదేవిగారు, వారి సహోదరి కె. సుగుణమణిగార్లతో సేవించు మహాభాగ్యము మాకు ఇటీవల లభించినది. "పోయి సేవింపలేకున్న పుణ్యతీర్థమహిమ వినుటయు నఖిల కల్మష హారంబు" అన్న పెద్దలనుడువు ప్రకారము, తోడి సోదరీమణులకు కూడ యిది యుపకరించునని దెల్పుచుంటిని.

దక్షిణ హిందూస్థానములో బహు పురాతనము, పౌరాణికమునైన మహత్తర క్షేత్రము శ్రీశైలము. శ్రీశైలమందు ప్రాచీన కాలమున శిలాధిముని గొప్ప తపస్సు గావించెనట. అతనికి పర్వతుడను కుమారుడుండెను. అతని తపస్సులకు, పర్వతుని ప్రార్థనలకు మెచ్చి, శివుడు లింగాకారమును దాల్చి శ్రీశైలమున ప్రత్యక్షమయ్యెనట. దేశమున గల 12 జ్యోతిర్లింగములలో నిదియొక ప్రధానమైన లింగము. గుప్త వంశపు రాజకన్య, చంద్రావతి యను భక్తురాలు, మల్లికా పుష్పములతో యీ లింగమును పూజించుటవల్ల 'మల్లికార్జునస్వామి' యని పేరు వచ్చెను. ఈ లింగముతో బాటు అష్టాదశ శక్తులలో ప్రధానమైన 'భ్రమరాంబ' కూడ యిచ్చటనే వెలసినది. హిందూరాజ్య సంరక్షకుడూ, పర స్త్రీలను దేవీస్వరూపులుగాను, మాతలుగాను భావించువాడు నైన శివాజీకి భ్రమరాంబ "భవానీ"యను పేర యిలవేల్పు, ఒరనుండు ఖడ్గమూ, ఇష్టదైవతమూనై యీ దేశ భక్తాగ్రేసరుని జీవితమునకొక ఆదేశమునిచ్చి, మన చరిత్రలో మహారాజ్యాల రీతిని నడిపించినది ఈ దేవియే. శ్రీశైలమునకు చేరువనున్న కృష్ణానదిలో కొంత భాగమునకు 'పాతాళగంగ'యని పేరు. యాత్రికు లిందు స్నానము జేసి దేవుని దర్శించెదరు. శ్రీశైల శిఖరమును గాంచి, స్వామిని దర్శించిన వారికి పునర్జన్మలేదని అనాదిగా బహు ప్రతీతి. ఉత్తరహిందూస్థానము నుండి కూడ వేలాది ప్రజలిచ్చటకు వచ్చెదరు.

శ్రీశైల మహాక్షేత్రము కృష్ణానదికి పశ్చిమపుటొడ్డున, కర్నూలుజిల్లా నందికొట్కూరు తాలూకాలో, ఆత్మకూరున కీశాన్యమున, నల్లమల పర్వత శ్రేణుల మధ్యనున్నది. నలుదిశలను

మహాద్రిరులచేతను, కీకారణ్యములగు మహారణ్యములచేతను, పుణ్యనదీ నదములచేతను పరివృతమై విరాజిల్లుచున్నది. హిమగిరిపై పార్వతీ పరమేశ్వరులు విహరించునట్లు, శ్రీశైలగిరులు శ్రీ భ్రమరాంబామల్లికార్జునుల లీలల కాలవాలమై, అశేషమునిజన సేవితమై, తపోతలమై, ఆర్యావర్తమున నన్ని ప్రాంతములవారికి పురాతన మైన మహాక్షేత్రమై యున్నది. సముద్ర మట్టముపై 3-4 వేల అ॥ ఎత్తువరకును గల ఈ నల్లమలకొండలు భీకరారణ్యసంభరితములు, వ్యాఘ్రాది క్రూరమృగముల కాలవాలములు అయ్యును యాత్రికుల కపూర్వానందదాయకములు. ఈ క్షేత్రమును జేరుటకు తూర్పు (గుంటూరు ప్రాంతముల) నుండి వచ్చువారికి చుక్కల పర్వతము మీదుగ నొక మార్గమును, ఉత్తరము (నైజాము) దిశనుండి వచ్చు వారికి నీలుగంగ ఘాటు, జాతరరేవు ఘాటుల మీదుగ వచ్చు మార్గములును, పడమర, దక్షిణముల నుండి వచ్చు వారికి ఆత్మకూరు మార్గమును కొండలకు మెట్లు యేర్పరచుట వలన కొంత సుగమ్యములు.

'ఆత్మకూరు' నుండి 'రోళ్ళ పెంట' కు 10 మైళ్లు; ఇందు "ఘాట్" రోడ్డు 8 మైళ్లు; దీని నిటీవల వెడల్పు చేసియుండిరి గాని ఈ ఫారెస్టు రోడ్డు పాడుగనున్నది. అటనుండి 'పెద్దచెరువు' మరొక 8 మైళ్లు. ఇంతవరకును బస్సులు వెళ్లును. ఇటనుండి 10 మైళ్లు అటనట మెట్లుగా నేర్పరచిన పర్వత శ్రేణులపై నేర్పరచిన బాటవెంట కాలినడకను ఎక్కవలసినదే. మధ్యలో 'భీముని కొల'నని బ్రహ్మాండమైన లోతునగల నదీ గర్భము, దాని యొద్దున తాళ్ళ ప్రమాణమున నేటవాలుగ "పేటికింబెట్టిన పెద్ద కుడ్యముల పీక నెసంగెడు పెన్గుట్టలు;" వీని నధిగమించి నాకాశమునకే మెట్లు వేసి రన్నట్లు తోపించు మైలున్నర వరకు గల మోకాటి పర్వతము, భయానకమైన పర్వత శ్రేణులు, లోయలు, ఆ వెనుక 'కైలాస ద్వారము' ఆ పైన మరొక 3 మైళ్లు శిలామయ, అరణ్యమయ మైన మార్గము- ఇవి దాటిన వెనుక శ్రీశైల ఆలయ గోపురములు దృగ్గోచరమగును. మొత్తము మీద నీయాత్ర కష్టతరమయ్యును, ప్రకృతి మాత పైటకొంగుల ముడతలో యనునట్లుగల పర్వతశ్రేణుల మయమై, నదీ నదములు, కీకారణ్యములు గల దృశ్యములతో మహానంద ప్రదమై యొప్పును. ఆ దృశ్యములన్నియు ఎవరి కంటితో వారు గాంచి, ఆనందించ వలసినదేగాని వర్ణింపజాలము.

22 అ॥ ఉన్నతి నున్న కోట గోడలవంటి రాతి గోడలమధ్య సుమారు 600 అ॥ చదరములో శ్రీ భ్రమరాంబ- మల్లికార్జునుల ఆలయములు ("చిన్నచిన్న గుళ్లు, చిల్లరదేవుళ్లు") గుళ్ళచే పరివేష్టితములై భాసిల్లుచున్నవి. ఆలయ పరిసరములలో శిధిలములైన కట్టడములు, బండలు యీ ప్రదేశము పూర్వ మనుభవించిన మహోన్నత స్థితిని చెప్పకనే చెప్పుచున్నవి. ఆలయపు తూర్పు ముఖద్వారమున కెదురుగా పాతాళగంగకు బోవుదారియు, యిరువైపుల (16 వ శతాబ్దమున శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన) మండపముల వరుసయు, రథోత్సవ వీధిని స్మరణకు దెచ్చుచున్నవి. రథశైథిల్యమును, యిప్పటికిని కోటగోడలపై గాననగు. ఆలమోన్నత ప్రాకారమునకు మూడువైపులను యిటికలచే నిర్మింపబడి అపూర్వ శిల్ప చాతుర్యమును జాటు గొప్ప గోపుర ద్వారములును గలవు. ద్వారముల కిరుపార్శ్వములును దృఢమైన శిలాస్థంభములచే నిర్మితములై యున్నవి.

పశ్చిమమున అంబాలయము వెనుక అసంపూర్ణమగు ద్వారము గలదు. ఉత్తర గోపురమునకు శివాజీ గోపురమని పేరు.

శ్రీ శివాజీ మహారాజు గోలుకొండ నుండి సంగమేశ్వరము మీదుగా శ్రీశైలము చేరి, శ్రీ భ్రమరాంబా మల్లికార్జునులను సేవించి, గోదానాది సమస్త దానములు గావించి, అన్ని క్షేత్రములకన్న నీ శ్రీగిరి మిన్నయని తన శిరమును కానుకగా శ్రీ భ్రమరాంబ (భవానీ) దేవికి సమర్పింప ఖడ్గము చేబూనెనట. అంత "మాతృదేశ సోదరీ సోదరులను సంరక్షించి మాతృ ఋణము దీర్చుకొను"మని దేవి యానతి విన వచ్చెననియు, శివాజీ అంతట దేశసేవా కంకణ బద్ధుడై ఆ యానతి శిరసావహించి, దిగ్విజయ యాత్రలకు నడుము గట్టెననియు చెప్పెదరు. ఇతడు దేవిని పూజించి, ఉత్తర గోపురము నిర్మించి, తన దేశమునుండి ఉగాదికి ఏటేట మహారాష్ట్ర కన్నడ యాత్రికులు వచ్చులాగునను, తదితరులు శివరాత్రి మహోత్సవకాలమున వచ్చునట్లును, నిత్య నైవేద్య పూజాదులు ఉత్సవములు సక్రమముగ జరుగునట్లును యేర్పాట్లు గావించెనట.

ఆవరణ మధ్యమున మల్లికార్జు నాలయ మున్నది. గర్భాలయము 10 అ॥ చదరము. ఇందు గల లింగమునే ద్వాదశ లింగాంతర్గత జ్యోతిర్లింగమని అనెదరు. యాత్రికులు యీ లింగముకడ వంగి, నొసలు తాకించి ప్రణమిల్లెదరు. గర్భాలయము ముందు 15 వ శతాబ్దారంభమున విజయనగర రాజగు హరిహర రాయలు నిర్మించిన ముఖమంటపమును, అందు అపూర్వ శిల్పకళా ప్రదర్శితమును- (అనేక శాసనములుగల) శిలాస్థంభములును, సెనగల బసవన్న అను నందియును గలవు. 13వ శతాబ్దాంతమున అనవేమారెడ్డి నిర్మించిన మంటపమొకటి యున్నది.

చంద్రావతి యను భక్తురాలు మల్లికలచే పూజించిన మూల శిలారూప వృద్ధ మల్లికార్జునాలయము ఈ మండపముల కుత్తరమున నున్నది. దీనికి దక్షిణమున సహస్ర లింగేశ్వరాలయమున్నది. స్నిగ్ధనీలశిలాపీఠమున ఈ లింగ మమర్చబడి యున్నది. దీనిని త్రేతా యుగమున శ్రీరాములవారు ప్రతిష్ఠించిరట. ఈ మల్లికార్జునాలయమునకు పడమట 'బలిపీఠ' మను శిలాపీఠమున్నది. తూర్పున పర్వతపురాణమున వర్ణించబడిన మేడిచెట్టున్నది. ఈ పవిత్ర వృక్షముక్రింద దత్తాత్రేయులు తపస్సు గావించెనని చెప్పెదరు. సంతాన ప్రాప్తి కొరకు యాత్రికులు దీనికి ప్రదక్షిణములు గావింతురు. ఈ మేడి చెట్టునకు తూర్పున పడమటి ముఖముగ అపూర్వమగు రాజరాజేశ్వరీ విగ్రహము గలిగిన ఆలయం ఉన్నది. ఇచట మల్లికాగుండం వసంత మంటపం వున్నవి. ఇటు ప్రతి సం॥ మకర సంక్రాంతి, శివరాత్రి జాగరణ దినాలలో కల్యాణోత్సవాలు జరుగును.

అంతరావరణకు పడమట అంబాలయము, మూలాలయమున కంటె యెత్తున నున్నది. కోటకుడ్యములపై దుర్గరూపములూ, రామాయణ కథా చిత్రములూ గలవు. అంబాలయ ముఖద్వార సమీపమున చిన్న సహస్రలింగేశ్వరాలయమున్నది. సీతాదేవి దీనిని ప్రతిష్ఠించినదని ప్రతీష్ఠ. ఆలయమునకు తూర్పున 2 మైళ్ళలో "పాతాళగంగ యను పేర కృష్ణానది ప్రవహించుచున్నది. దీనిలో దిగుటకు 1 మైలు పొడవు సోపానములున్నవి.

కృష్ణానదికి అద్దరినుండు చంద్రగుప్తపురం గుప్తమౌర్య వంశ సామ్రాజ్య వ్యాపకమును

సూచించుచున్నది. ఈ చంద్రగుప్తుడు దిగ్విజయ యాత్రి నిర్వహించి వచ్చి, తదనంతరము తన కుమార్తె చంద్రావతిని మోహించి, ఆమె శాపమువల్ల పచ్చబండయై కృష్ణానదిలో పడి యుండినట్లు చెప్పెదరు. అందుచేత పాతాళ గంగ నీరు పచ్చగానుండునందురు. చంద్రి గుప్తుని పురము నిర్జీవమై శిథిలమైన పాత కోట గోడలు, కట్టడములమధ్య నున్నది.

శ్రీశైల ప్రాంతము విజయనగర సామ్రాజ్యములో నొక భాగముగానుండినట్లు శాసనములు సూచించుచున్నవి. తాళికోట యుదమున నీ సామ్రాజ్యము అస్తమింప దానితో శ్రీశైల సౌభాగ్యమును అస్తమించెను. మహమ్మదీయుల దండగములకు ఆవెనుక బ్రిటిష్ ప్రభుత్వమును అధిగమించి, మరల స్వేచ్ఛావాయువుల నడుమ నీ శ్రీశైలరాజము రాణిల్లుచున్నది. ఈపరిసరాలలో చూడవలసిన వెన్నియో యున్నవి. గుప్త గృహాలు, కదళీవనం,బిల్వవనం, అక్కనాగమ్మ బిలం, చంద్ర గుండం, మల్లికాగుండం, మనోహారకుండం, కాలహృద తీర్థం, సంధ్యాతీర్థం, సమాధి తీర్థం, గణేశ తీర్థం, గుప్త మల్లేశ్వర తీర్థం గరుడతీర్థం మొదలగునవెన్నియో చూడదగ్గ వింతలున్నవి. శ్రీరాముడు రావణవధ జనిత పాప పంకిలం పోగొట్టుకొనదలచి, కోటి లింగములు ప్రతిష్ఠించి, ఈశ్రీశైలంబునకు ప్రదక్షిణం జేసెనట. శ్రీశైల యాత్రకు వెళ్ళనుద్యమించినవారు మహాశివరాత్రికి గాని, ఉగాదికి గాని జట్లులుగా వెళ్ళుట మంచిది.

శ్రీశైలమహత్మ్యం అనాదినుండియువిదితమే; భాగవత రామాయణాదుల వల్లను, ఆర్యులు అనాదిసిద్ధులగు "శ్రీశైలస్య నైరుతి ప్రదేశే" ఇత్యాది సంకల్పాల వల్లను, శ్రీమదాద్యశంకరాచార్యాది సంస్తుతుల వల్లను, ద్రవిడ కావ్యాల వల్లను స్పష్టమగుచున్నది. శ్రీ శైలంబును దర్శించి, సేవించినవారికి ధర్మార్థ కామమోక్షంబులు కరతలామలకంబని చెప్పెదరు.

"ఇయ్యెడగల శిలలన్నియు లింగంబులు, వృక్షాలన్నియు దేవతలు, స్త్రీలెల్లరు శక్తులు, నరులెల్లరు రుద్రులు, యియ్యది పరమరహస్యమని" సనత్కుమారుడు వ్యాసున కుపదేశించిన దంతయు సత్యమని ఈక్షేత్రాన్ని దర్శించిన వెనుక మీకు తోచకమానదు.

నోటిలెక్కకు జవాబులు

5. ఉంగరముల తూకము వరుసగా 1, 2, 4, 8, 15 తులములు

మచిలీపట్నణము
ది 30-4-1955.

విశ్వసనీయుడు.
ధ॥ రా॥
(ఆంధ్రమహిళ పాఠకుడు)

1, 2, 4, 8, 15 — 30 తు

పిల్లా సుబ్బారావు.

ఆంధ్రసంక్షేమ చరిత్రలో తొలిమైలురాయి

(1955 మే 10 వ తేదీన జరిగిన రాష్ట్ర సంక్షేమ సంస్థ సమావేశంలో అధ్యక్షురాలు శ్రీమతి ఎ. సి. కృష్ణారావు సమర్పించిన 1954-55 నివేదికలోని ముఖ్యాంశాలు.)

ఆంధ్ర రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా సంస్థ 1954 వ సం॥ జూన్ మూడవ వారంలో స్థాపించబడినది :

పంచవర్ష ప్రణాళికలోని 36 వ అధ్యాయము సిఫార్సుల ననుసరించి స్థాపితమైన కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ, సత్వరకార్యా చరణకుగాను వికేంద్రీకరణవిధానము ననుసరిస్తూ, భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో, రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా సంస్థలను నెలకొల్పింది.

రాష్ట్ర సంస్థల కార్యకలాపాలు :

రాష్ట్ర సంస్థలు అటు కేంద్ర సంస్థకు సలహా సంఘాలుగావుంటూ, ఆయారాష్ట్ర ప్రభుత్వాలకు, స్వచ్ఛంద సేవాసంస్థలకు, కేంద్ర సంస్థలకు, మధ్య సమన్వయ సంస్థలుగా ప్రవర్తిస్తాయి.

స్వచ్ఛంద సంక్షేమ సంస్థలకు సహాయ కార్యక్రమము :

ఆంధ్ర రాష్ట్ర సాంఘిక సలహాసంస్థ స్థాపితంకాని క్రితం కేంద్ర సంస్థ స్వయంగా స్వచ్ఛంద సంక్షేమ సంస్థల దరఖాస్తులను పరిశీలించి వారికి ఆర్థిక సహాయాన్ని అందజేసేది. రాష్ట్ర సంస్థ నిర్మింపబడినాక, దరఖాస్తులను ఆహ్వానించి, పరిశీలించి అర్హతగల సంస్థలను సిఫార్సు చేసే బాధ్యత రాష్ట్ర సంస్థమీదనే పడింది. 1953 ఫిబ్రవరి వరకు కేంద్ర సంస్థ ఆంధ్రలోని స్వచ్ఛంద సంస్థలకు రూ॥ 4, 48, 425 లు అందజేసింది. ఇందులో 56 సంస్థలు గత తొమ్మిది నెలలలోను రాష్ట్ర సంస్థ సిఫార్సు చేసినవి.

రాష్ట్ర సంస్థ అధ్యక్షురాలు, సభ్యులు, రాష్ట్రం పూర్తిగా పర్యటించి. ధనసహాయము కోరిన సంస్థల కార్యకలాపాలను పరిశీలించివచ్చారు. వీరి నివేదికలను ఆధారంగా తీసుకొని సంస్థలనిజాయితీ, కార్యకలాపాలను గుర్తించి ధనసహాయము సిఫార్సు చేయబడింది.

సంక్షేమ విస్తరణ ప్రణాళికలు :

మన గ్రామసీమలకు సంక్షేమ విస్తరణ నూతన కార్యక్రమము. సంక్షేమ కార్యక్రమాలను పల్లెప్రాంతాలలో విస్తరింపజేయుట ముదావహం.

ఆంధ్ర దేశం "ఎ" తరగతి రాష్ట్రం కావటంవలన 17 ప్రణాళికలు కేటాయించబడినవి. వీటిలో 11 ఆంధ్ర దేశంలోని 11 జిల్లాలలోను, 12 వది, ఆంధ్ర మహిళా సభ, ఆంధ్ర బాలానంద సంఘం, చిల్డ్రిన్స్‌గార్డెన్ స్కూలు, సంయుక్త ఆధ్వర్యమున నిర్యహింపబడుతున్నవి. ఈ ప్రణాళికలన్నీ 1954 ఆగస్టు 15 వ తేదీన, కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ తొలివార్షికోత్సవ సందర్భంలో ప్రారంభింపబడినవి.

సంక్షేమ విస్తరణ ప్రణాళికలను, ప్రణాళికా నిర్వహణ సంఘము లనే అనధికార సంఘాలు నిర్వహిస్తున్నవి. ఇంతవరకు ఆంధ్రదేశంలో 65 సంక్షేమ విస్తరణ కేంద్రములు నిర్వహింపబడుతున్నవి. ఈ కేంద్రములవలన 416 గ్రామములలోని 3, 93, 220 ప్రజలకు సంక్షేమ కార్యక్రమం అందజేయబడుతున్నది. 1955 మార్చివరకు మాకు చేరిన నివేదికల ప్రకారం ప్రసూతి కేంద్రాలలో 1957 పురిటికేసులు నిర్వహింపబడినవి.

ఆంధ్ర గ్రామసీమ, వైద్యసహాయంలేక అత్యధికంగా బాధపడుతున్నది. గ్రామీణులు అందుచేతనే మాతా శిశు సంరక్షణకేంద్రాలను స్థాపించమని కోరుతున్నారు. రాష్ట్ర సంక్షేమ సంస్థ స్థాపించిన కేంద్రాలలో అత్యధికం, ప్రజల అభీష్టం ప్రకారం మాతా శిశు సంరక్షణ కేంద్రాలే. ఈ కేంద్రాలలో సామాన్య రుగ్మతలకుకూడ మందు లీయబడుతున్నవి.

ఆంధ్రలో సంక్షేమ విస్తరణ ప్రణాళికలు ప్రజలలో ఉత్సాహాన్ని, కార్యదీక్షను పెంపొందించినవి. కొన్ని జిల్లాల ప్రణాళికలు త్వరలోనే స్వయం సమృద్ధి కాబోతున్నవనేది సంతోషమైన వార్త.

ఆంధ్ర సంక్షేమ చరిత్రలో తొలిమైలురాయి

సంక్షేమ విస్తరణ ప్రణాళికా కేంద్రాలు ఇటుపైన వివిధ కార్యక్రమ కేంద్రాలుగా తయారవబోతున్నవి. ఈ కార్యక్రమ నిర్వహణకుగాను శిక్షితులైన సంఘ కార్యకర్తలను తయారుచేయవలసిన ఆవశ్యకతయున్నది. దానికిగాను రాష్ట్ర సంస్థ తగుప్రయత్నాలను చేస్తున్నది. ఈ కేంద్రములవలన గ్రామాలలో వెల్లివిరుస్తున్న ఉత్సాహాన్ని, స్వయంకృషిని, సంఘ సంక్షేమ సంస్థ సరిగా గుర్తించి దానినంతను సక్రమ పద్ధతిలో సద్వినియోగం చేసుకోవలసియుంటుంది.

గ్రామ పంచాయతీలు, ఉదారులైన గ్రామ పెద్దలు, సంక్షేమ కార్యక్రమాలతో సహకరిస్తూ భూమి, భవనములు, ఇతర అవసరసామగ్రి, సంక్షేమ కేంద్రాలకు విరాళముగా ఇస్తున్నారు. ఆంధ్రదేశంలో ఇది సామాన్య సంఘటన అయిపోయింది.

శ్రీమతి ఫ్రెడాబెడి, ('సోషల్ వెల్‌ఫేర్' పత్రిక సంపాదకురాలు) శ్రీ సి. ఆర్. గోవిందరాజన్ (కేంద్ర సంస్థ కార్యాలయ కార్యదర్శి) కృష్ణా, నెల్లూరు, చిత్తూరు జిల్లాలలోని ప్రణాళికా కేంద్రాలను కొన్నింటిని సందర్శించారు.

బహుమతి ప్రణాళికలు :

ఆంధ్రకు కేటాయించబడ్డ 17 ప్రణాళికల్లోను 12 ప్రస్తుతం నిర్వహింపబడుతున్నవని పైన పేర్కొనబడది. మిగిలిన 5 న్నూ సత్వరంగా, సత్ఫలితాలను చూపించే జిల్లాలకు బహుమతిగా ఇయ్యబడుతవి. ఇంతవరకు అనంతపురం, కర్నూలు, గుంటూరు జిల్లాలకు 3 ప్రణాళికలు బహూకరించబడినవి.

రాష్ట్ర సంస్థ సమావేశాలు :

రాష్ట్ర సంస్థ ఇంతవరకు సీతానగరం, విజయవాడ, మద్రాసు, కర్నూలు, గుంటూరునగరాలలో 5 సార్లు సమావేశమైనది. గుంటూరులో రాష్ట్ర సంస్థ సమావేశంతోపాటు, సంక్షేమ విస్తరణ ప్రణాళికా కన్వీనర్ల మొదటి సమావేశంకూడ జరిగింది. వివిధ జిల్లాల కన్వీనర్లు, వారి సమస్యలను చర్చించారు. వారి అభిప్రాయాలను, అనుభవాలను ఒకరికొకరు వెల్లడి చేసుకున్నారు. వారి సమిష్టి చర్చల ఆధారంగా రాష్ట్ర సంస్థకు కొన్ని సిఫార్సులను చేసారు. వారి సూచనలను పాటిస్తూ, జిల్లా వైద్యాధికారులను ప్రణాళికా నిర్వహణ సంఘంలో సభ్యులుగా చేసేటందుకు రాష్ట్ర సంస్థ కేంద్ర సంస్థతోను, ఆంధ్ర ప్రభుత్వంతోను సంప్రదింపులు జరిపి వారి సమ్మతిని పొందారు. జిల్లా ప్లానింగు ఆఫీసరు, అసిస్టెంటు స్త్రీ సంఘ ఆఫీసరుకూడ జిల్లా కమిటీసభ్యులే.

అఖిలభారత రాష్ట్ర సంక్షేమ సంస్థల అధ్యక్షుల సమావేశం :

1954 నవంబరు 11 నుండి 14 వరకు ఢిల్లీలో జరిగిన రాష్ట్ర సంక్షేమ సంస్థల అధ్యక్షుల సమావేశానికి, ఆంధ్ర రాష్ట్ర సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు, స్త్రీ సంక్షేమ ఆఫీసరు హాజరయ్యారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ఫలితంగా, భవన నిర్మాణానికి, మోటారు వాన్‌లకు గ్రాంటులు, సిబ్బంది శిక్షణ, ప్రస్తుత సంక్షేమ కేంద్రాలను, వివిధ కార్యక్రమ నిర్వాహక కేంద్రములుగా మార్చుట మొ॥న కార్యక్రమం మన రాష్ట్రంలోకూడ అమలు జరుపబడుచున్నది.

ప్రాంతీయ కన్వీనర్ల సమావేశం :

భారతదేశంలో సంక్షేమ విస్తరణ ప్రణాళికలు ప్రారంభించిన ఏడాదిలోనే దక్షిణభారత ప్రాంత కన్వీనర్ల ప్రథమ సమావేశం, కేంద్ర సాంఘిక సంస్థ అధ్యక్షురాలు, శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ అధ్యక్షతను మద్రాసులో జరిగింది. ఆంధ్ర కన్వీనర్లు హాజరైన ఈసమావేశంలో రాష్ట్ర సంస్థ అధ్యక్షురాలు విస్తరణ ప్రణాళికల అభివృద్ధి సూచిస్తూ ఒక నివేదికను చదివారు. వివిధ జిల్లాల కన్వీనర్లు తమ జిల్లాలలోని కార్యక్రమాలను వివరించారు.

నూతనకార్యక్రమాలు, వివిధ సలహాసంఘాలు:

ఆంధ్ర సంస్థ సభ్యులు After care ప్రణాళికా సభ్యులను, (అధ్యక్షుడు: శ్రీ ఎమ్. ఎస్. గోరె) నైతిక ఆరోగ్య సంస్థ సభ్యులను (అధ్యక్షురాలు: లేడీ రామారావు) కలుసుకొని ఆ కార్యక్రమాలను ఆంధ్రలో అమలు జరపడం విషయమై చర్చించారు.

చెవిటి, మూగ, గ్రుడ్డి వారలకు కేంద్ర పాఠశాల :

రాష్ట్ర సంస్థ సభ్యులు ఇతర ఆంధ్ర సంఘ సేవకులతో కలసి మిస్. హెలెన్ కెల్లర్‌కు సన్మానపత్రాన్ని సమర్పించారు. ఆంధ్ర రాష్ట్రంలో చెవిటి, మూగ, గ్రుడ్డి

ఆంధ్ర సంక్షేమ చరిత్రలో తొలిమైలురాయి

వారికి కేంద్ర పాఠశాలను స్థాపించుటకు త్వరలోనే కృషి చేయగలమని వారు వాగ్దానం చేశారు.

శిబ్బంది శిక్షణ :

గ్రామ ప్రాంతాలలో పనిచేయుటకు సుశిక్షితులైన కార్యకర్తలు అత్యవసరం. మద్రాసు స్కూల్ ఆఫ్ సోషల్ వర్కు నిర్వహించే గ్రామసంక్షేమ తరగతులలో వివిధ జిల్లాలనుండి 6 గురు అభ్యర్థులకు శిక్షణ ఈయబడింది. ప్రణాళికా కేంద్రాల్లో వీరు ఇపుడు 60 రూ॥ల వేతనంమీద నియమితులైనారు.

కస్తూరిబాయి గాంధీ జాతీయ స్మారకనిధితో కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ చేసుకున్న ఒప్పందం ప్రకారం సీతానగరంలో కస్తూరిబాయి కేంద్రంలో 50 మంది ఆంధ్ర మహిళలకు గ్రామసేవికా శిక్షణ నీయుటకు నిర్ణయమైనది. వీరిలో 35 గురు ఆంధ్ర జిల్లాలనుండీ, 15 మంది తెలంగాణా ప్రాంతం నుండి ఉండగలరు.

జిల్లా సంక్షేమ నిర్వాహకులు :

సంక్షేమ విస్తరణ కార్యక్రమం అధికమౌతూండడం వల్ల ప్రతి ప్రణాళికకు ఒక సంక్షేమ ఆర్గనైజరు నియమించుట అవసరమని రాష్ట్ర సంస్థ నిర్ణయించింది. దీనికిగాను 15 మంది స్త్రీలకు రాజమండ్రిలో స్త్రీ సంక్షేమశాఖ మే 16 నుండి శిక్షణ ప్రారంభింపనున్నది.

రాష్ట్ర సంస్థ కార్యాలయం :

96, వెంకటాచల మొదలివీధి, మద్రాసు 4 నుండి రాష్ట్ర సంస్థ కార్యాలయాన్ని ఫిబ్రవరిలో 5 శాంథోమ్ హైరోడ్డుకు మార్చాము. చాల కొద్దిమంది సిబ్బందితో కార్యాలయం ప్రారంభించబడినది. డిశంబరు సమావేశంలో రాష్ట్ర సంస్థ సూచించిన ప్రకారం, కేంద్ర సంస్థను రాష్ట్ర ప్రభుత్వాని సిబ్బందిని అధికం చెయ్యమని కోరాము. అందువల్ల ఇపుడు కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి, ఇద్దరు పరిశోధకులు స్టెనోగ్రాఫరు, టైపిస్టు, డిస్పాచ్ అసిస్టెంటు, డ్రైవరు, ఇద్దరు నౌకర్లు, కండెక్ట్రిస ఉన్నారు. ఇపుడు పని సక్రమంగానే సాగుతున్నది.

బడ్జెట్టు :

ఈ సం॥రం రాష్ట్ర సంస్థ ఆదాయవ్యయపట్టికలు ఆడిట్ చేయబడినవి. ఆంధ్ర ప్రభుత్వం, కేంద్ర సంస్థ కూడ మా సూచనను దయతో అంగీకరించి 24000 రూ॥లు ఇచ్చారు.

1955–56 బడ్జెటు, కేంద్రసంస్థ, ఆంధ్ర ప్రభుత్వం యొక్క ఆమోదానికై పంపడమైనది.

ప్రణాళికల బడ్జెట్లు:-

సంక్షేమ విస్తరణ ప్రణాళికల ఆదాయవ్యయ పట్టికలు తయారైనవి. కాని విరాళాలవల్ల ఎంత సేకరించారో మొ॥ వివరాలు ఆడిటు పూర్తి అయినాక తెలియగలవు.

ప్రతి ప్రణాళికకు కేంద్ర సంస్థ జీపును సప్లయిచేసింది.

ప్రచారం :--

రాష్ట్రసంస్థ కార్యకలాపాలను ప్రతిమాసం 'ఆంధ్ర మహిళ'లో ప్రచురిస్తున్నాము. గత సం॥ ఆగస్టులో రాష్ట్రసంస్థ కార్యక్రమాన్ని వివరిస్తూ ఒక పుస్తకాన్ని ప్రచురించాము. నూతన కార్యక్రమాలను వివరిస్తూ ప్రచురించిన పుస్తకం ఇప్పుడే వెలువడింది.

ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసరు, రాష్ట్ర సంక్షేమ కార్యకర్త:-

కేంద్రసంస్థ రాష్ట్రసంస్థను ఒక ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసరు, రాష్ట్రసంక్షేమ కార్యకర్తను నియమించమని ఆదేశించింది. వారిని కేంద్రసంస్థ నియమిస్తుంది. రాష్ట్రసంస్థ కార్యాలయంలో అధ్యక్షురాలి ఆదేశాలకు లోబడి వారు తమ విధులను నిర్వహిస్తారు, ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసరు నియమితులైనారు. సంక్షేమ కార్యకర్తను త్వరలోనే నియమించగలము.

ఆంధ్రరాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహాసంస్థ తొలి సంవత్సరంలో కార్యక్రమం చక్కగానే నిర్వహించిందని, ఈ సం॥ అభివృద్ధి చూపించగలదని ఆశించవచ్చును. కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు, రాష్ట్ర సంస్థ సభ్యులు, జిల్లా కన్వీనర్లు, ప్రణాళికా నిర్వహణ సంఘసభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ఇచ్చిన సహకారం వల్లనే ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించగలిగాము. దీనికి మేము ఎప్పుడూ కృతజ్ఞులము, మా కార్య క్రమాలకు బహుళ ప్రచారాన్ని ఇచ్చిన పత్రికలకు మా అభివందనాలు. రాష్ట్ర సంస్థ కార్యాలయ సిబ్బంది ఇంతకష్టమైన కార్యక్రమాన్ని విసుగు, విరామం లేకుండా నిర్వహించారు. వారి కార్య దీక్షను ఈ సందర్భంలో ప్రత్యేకంగా శ్లాఘిస్తున్నాము.

ఆంధ్రరాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా సభ్యులు

అధ్యక్షురాలు :

శ్రీమతి ఎ. చన్నఘుంటమ్మ కృష్ణారావు, మద్రాసు.

సభ్యులు :

1. శ్రీమతి దిగుమర్తి బుచ్చికృష్ణమ్మ, తూర్పుగోదావరి జిల్లా.
2. శ్రీమతి దమయంతి, తిరువూరు, కృష్ణా జిల్లా.
3. లేడీ ఎమ్. వెంకటసుబ్బారావు, మద్రాసు.
4. శ్రీ ఎన్. రాఘవరావు, మద్రాసు.
5. శ్రీమతి కె. రామసుబ్బమ్మ, కడప.
6. శ్రీమతి టి. కోటమ్మారెడ్డి, గుంటూరు.
7. శ్రీ ఎస్. చక్రవర్తి, ఐ.సి.ఎస్ కార్యదర్శి, అభివృద్ధి ప్లానింగుశాఖ.
8. కుమారి. జె. జెమునాబాయి, ఆంధ్ర స్త్రీసంక్షేమ ఆఫీసరు.

జిల్లా ప్రాజెక్టు ఇంప్లిమెంటింగు కన్వీనర్లు

శ్రీకాకుళం :	శ్రీమతి	ఆనీ జేమ్సు.
విశాఖపట్నం :	,,	దిగుమర్తి జానకీబాయి.
తూర్పు గోదావరి :	శ్రీ	ముత్తంగి అయ్యన్ననాయుడు.
పశ్చిమ గోదావరి :	శ్రీమతి	ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ.
కృష్ణా :	,,	అయేషా అబ్దుల్ ఖాదిర్.
గుంటూరు :	,,	కొండా పార్వతీదేవి.
నెల్లూరు :	,,	డాక్టర్ ఎస్. లక్ష్మి.
చిత్తూరు :	,,	ఆర్. రత్నాబాయి శ్రీనివాసరావు.
కడప :	,,	ఎన్. సరళారెడ్డి.
కర్నూలు :	,,	కె. కె. రెడ్డి.
అనంతపూరు :	,,	కె. కొండలరావు.
ఆంధ్ర మహిళాసభ :	,,	న్యాయపతి కామేశ్వ

ఆంధ్రదేశంలో

వివిధ సంక్షేమ సంస్థల కార్యకలాపాలు

గ్రామసేవామందిరము, తిమ్మాపురం.

1954 - 55 కు వార్షిక నివేదిక.

ఈక్రింది కార్యక్రమముద్వారా యీ మందిరము అభివృద్ధి చెందుచున్నది.

1. అంటరాని తనమును పోగొట్టుటకు, మరియు హరిజనోద్ధరణ థక్కరబాబా హరిజన ఎలిమెంటరీ స్కూలులోని హరిజన బాలబాలికలను విద్యావంతులుగ జేసి, అభివృద్ధికి తీసికొని వచ్చుట కొఱకు నెలకొల్పబడినది ఆ పాఠశాలలో చదివిన ఒక పాత విద్యార్థి ప్రధానోపాధ్యాయునిగా నియమితుడైనాడు ఆపాఠశాల యందు ప్రభుత్వముద్వారా 9 మందికి గౌరవవేతనము లీయబడినది. గ్రామములందు పర్యటించి సభలు జరుపుట ద్వారా అంటరాని తనమును పోగొట్టుట మరియు హరిజనోద్ధరణ గూర్చిన ప్రచారము జరుపబడుచున్నది. వారములో ఒక దినము గ్రామసేవాదళమువారు పల్లెలందు తిరిగి శుభ్రత మరియు ఆరోగ్యమైన జీవితమును గడుపుటకు తగిన సలహాల నిచ్చుచున్నారు.

2. పుస్తకాలయము మరియు పఠనాలయము:

ఈ సంవత్సరము రవీంద్ర పుస్తకాలయము ఇంకను అభివృద్ధి పొందినది, ఈ సొమ్ముతో క్రొత్త పుస్తకములు కొనబడినవి. తెలుగు మరియు ఇంగ్లీషు దిన, వార, మాస పత్రికలు యిచ్చట తెప్పించబడును. కేంద్ర సంక్షేమసంస్థ వారిచ్చు గ్రాంటుతో దీనిని యింకను అభివృద్ధిలోనికి తీసుకురావలయునని ఆలోచింపబడుచున్నది. దీనికొక లైబ్రేరియనును నియమించుటకై నిశ్చయింపబడినది. గ్రామపంచాయితీద్వారా ఒక రేడియో సెట్టు యిందుంచ బడినది.

3. వైద్య చికిత్స:

ఈ శాఖకు చెందన పని నియమానుసారముగ నడచుచున్నది. గ్రామ వైద్యవిద్య ట్రైనింగుకై ఒక యుపాధ్యాయుడు నియమింపబడెను. అతడన్ని పరీక్షలు యుత్తీర్ణుడయ్యెను. సర్కారువారిని జాతీయ సంక్షేమశాఖ తరపున ఒక వైద్యాలయము స్థాపింపమని కోరితిమి.

4. పరిశ్రమశాఖ:

ధనాభావమువలన ఈ శాఖ అభివృద్ధియందు వెనుకబడియున్నది.

5. విద్య:

క్రొత్తగా యీ పాఠశాలయందు యి. ఎస్. ఎల్. సి (E.S.L.C) తరగతు లారంభింపబడినవి. 200 మంది విద్యార్థులతో యీ పాఠశాల చాల జయవంతముగా నడుపబడుచున్నది. 8 మంది విద్యార్థులు ఇ.ఎస్.ఎల్.సి పబ్లిక్ పరీక్షకై పంపబడినారు. బీద బాలురకు పలకలు, పుస్తకములు మొదలగునవి పంచబడినవి. మంచి పౌరులుగా తయారుజేయుటకై యీ పాఠశాలయందలి విద్యార్థులకు సాహితీ సభలు, జూనియర్ రెడ్‌క్రాస్ సంఘము, చారిత్రకస్థల విహారములు మరియు గ్రామసేవాదళముల ద్వారా శిక్షణ యివ్వబడినది. కేంద్ర సంక్షేమ సంస్థ యిచ్చిన గ్రాంటుతో ఆటసామగ్రులు కొనుటకు నిశ్చయింపబడినది. విద్యార్థులు ఆటలందు చాల యుత్సాహమును కనబరుచుచున్నారు. నూలు వడకుట మొదలగు చేతిపనులలో శిక్షణ నిచ్చుట కొక యుపాధ్యాయుడు నియమితుడయ్యెను. పండిత జవహరులాల్ నెహ్రూ యీ విద్యార్థుల హంపీ యాత్రకై 100 రూ॥లను యిచ్చినారు. గ్రామసౌభాగ్యశాఖ తరఫున ఐదు గదులు కలిగిన ఒక భవనము నిర్మింపబడినది. అందులోనే ఇప్పుడు పాఠశాల నడుప బడుచున్నది.

నేతాజీ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూలు బాగుగా నడుపబడుచున్నది. బీదలకు పలకలు పుస్తకములు పంచబడినవి. ఇద్దరు ఉపాధ్యాయులు 60 మంది బాలురతో యీ పాఠశాల అబెగన్‌పల్లి మరియు తిమ్మాపురములందు

నడుపబడుచున్నది. పైన పేర్కొనబడిన రెండు స్కూళ్ళకు చార్టులు మరియు టీచింగ్ ఎయిడ్స్, విజ్ఞానసాధనము లందించుటవసరము.

6. వయోజనవిద్య :

తిమ్మాపురమునందలి వయోజన విద్యాలయము చక్కగా నడచుచున్నది. వయోజనులకు పలకలు, పుస్తకములు సరఫరా చేయబడుచున్నవి. సర్కారువారిచ్చు వేతనముగాక సంస్థద్వారా నెలకు రు॥ 6 లు ఉపాధ్యాయునకెక్కువగా నీయబడుచున్నది.

7. సరోజిని శిశు సంక్షేమ కేంద్రము :

1954 సంవత్సరము జూన్ నెలయందు యీకేంద్రము కేంద్రసంక్షేమసంస్థ యిచ్చు గ్రాంటుతో స్థాపింపబడినది.

ఈకేంద్రమునకై *2000* రూ॥లు గ్రాంటీయబడినవి. దీనితో సమానమైన ఫండ్సు సంస్థ ద్వారా ఖర్చుచేయబడినవి. *40* మంది పిల్లలకు యీ కేంద్రమునందు నియమానుసారముగా నాహార మీయబడుచున్నది. విద్యార్థులకు సంవత్సరములో రెండు పర్యాయములు వస్త్రములు, ట్రంకులు, లాంతర్లు, మరియు ప్లేట్లు యుచితముగా సరఫరా చేయబడుచున్నవి. హయ్యర్ ఎలిమెంటరీ స్కూలుకు యీ కేంద్రము చేర్చబడి యున్నది. ఇది యింకను అభివృద్ధిజెందుటకు అవకాశములు గలవు.

గ్రామసేవామందిరము హాస్టల్ :

ఈ హాస్టల్ తిమ్మాపురమునందలి హయ్యర్ ఎలిమెంటరీ స్కూలుతో చేర్చబడి *20* మందికి హరిజన సంక్షేమ సంస్థనుండి గ్రాంటు వచ్చుననను యాశతో యిది నడుపబడెను. కాని జిల్లాకలెక్టరుగారి సిఫారసు పైన కూడ యీవిషయమునందు వారు నిరాశ చెంద వలసివచ్చెను. ఈ క్షేత్రాలయము నడుపుటకై యీ సంస్థ చాల ధనమును అప్పుగా తీసికొనవలసివచ్చెను. వచ్చేసంవత్సరమైన సర్కారు గ్రాంటు యిచ్చునని యీ సంస్థ యాశించుచున్నది.

ఈసంస్థ ముఖ్యమైన జాతీయోత్సవములన్నియు జరుపుచున్నది. వనమహోత్సవము జరిపి *200* కొబ్బరికాయలను నాటుటకై గ్రామస్థులకు సర్కారిచ్చిన గ్రాంటుతో కొని పంచబడినది. చుట్టుప్రక్కల గ్రామములలో యంటరాని తనమును మరియు గ్రామాభ్యుదయమును గూర్చి ప్రచారము చేయుచు హరిజన దినోత్సవము యీ సంస్థ జరుపుచున్నది.

హెచ్. కె. హనుమంతరావు,
కార్యదర్శి.


భారత సేవక సమాజము, (మహిళాశాఖ)
సంగంజాగర్లమూడి.

మా సమాజమును *10* సంవత్సరాలనుండి నడుపుతున్నాము. *1954* వ సంవత్సరము జూన్ నెలలో అప్పటికి ఉన్న సభ్యులతో ఒక సంఘముగా ఏర్పడి రిజిష్టరు చేశాము. స్వయం కృషితో విరాళములు సేకరించి రాట్న పరిశ్రమద్వారా ప్రతిదినము కుంటి, గుడ్డి, నిరుపేదలకు పదిమందికి ఒకపూట భోజనము పెడుతున్నాము. సంవత్సరానికి *70* గజాల వస్త్రదానముకూడ చేయగలుగుతున్నాము.

1954 ఆగష్టు *15* నుండి స్త్రీ విద్యాభివృద్ధికై హిందీ, తెలుగు భాషలలో పాఠశాలలు నడపబడుచున్నవి. విద్యాభ్యాసము చేయువారికి ఉచితముగానే విద్యనేర్పిస్తున్నాము.

1955–56 సం॥కు ఈసమాజమునకు కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ రు *3000* విరాళము ఇవ్వనున్నారు.

శ్రీ కొత్త లక్ష్మీప్రసూనాంబ,
కార్యదర్శి.



జగన్నాథ రథచక్రాలు

రచయిత— పులిపాక జగన్నాథరావు

ప్రాప్తిస్థానం— శ్రీ జగన్నాథరావు

అధ్యాపకులు, హిందూకళాశాల, గుంటూరు.

ప్రపంచంలో మానవప్రకృతులు వివిధరంగాలలో సంచరించు చిత్రవిచిత్రములైన రూపాలను కంటికికట్టి నట్లు చిత్రించి మనలను మరొక ప్రపంచంలోనికి లాగుకొని పోవుచున్న వీ జగన్నాథ రథచక్రాలు. ప్రతియొక్క కథ చిత్రణముకూడ వాస్తవికమును భ్రమను గొల్పుచున్నవి. ఇటువంటి కథలు చదువరులకు చిత్త సంస్కారమును కలిగిస్తాయనడంలో సందేహం లేదు.

రత్నగీతి రెండవభాగము

ఈకవయిత్రీమణుల యాదర్శములువున్న తభావసంశోభి తములు. పిన్నవయసునందే మహామహుల మన్నన లందుకొన్న వీరి చరితము స్త్రీలోకమున కంతకిని యాదర్శప్రాయమైనది. వీరి కృతులు చదువరులకు మనో హరముగానున్నవి.

యాజ్ఞవల్క్య చరిత్రము.

రచయిత— ఘట్టుప్రభువు

సంపాదకులు-లింగంగుంట వెంకటసుబ్బయ్య

నెం. 1 ఆరుముగంచెట్టివీధి. తిరువళ్లిక్కేణి మద్రాసు-5

వెల- 1—0—0

యాజ్ఞవల్క్య చరిత్రమును వ్రాసినవారు ఘట్టుప్రభువు. వీరు యింకను అనేక గ్రంథములు రచించియున్నారు. కుచేలోపాఖ్యానము, సురాభాండేశ్వరీయము, సత్యభామా విజయములు ఈయన యితరకృతులు. ప్రకాశకులై నలింగం గుంట వెంకటసుబ్బయ్యగారు, మహర్షులలో ప్రముఖుడై స్మృతికర్తయై, శుక్లయజుర్వేదులకు మూలపురుషుడైన యాజ్ఞవల్క్య మహాముని పవిత్రజీవితమును పాఠకలోక మున కందించి మిక్కిలి ప్రశంసనీయులైరి. ఇందు సూర్య స్తుతి, గాయత్రీస్తుతి, దండకము మొదలైనవి సమస్త శాఖలవారికిని పారాయణ యోగ్యముగా నున్నవి.

కమ్యూనిష్టు పార్టీ, ప్రచారం. పరమార్థం.

రచయిత— మధులిమాయె. అనువాదం—శాస్త్రి.

ప్రాప్తిస్థానం- కల్చరల్ బుక్సు లిమిటెడ్.

31. మీరాన్‌సాహెబువీధి— మద్రాసు.

కమ్యూనిష్టులయొక్క చరిత్ర, ఆ పార్టీ విధానము, కమూనిష్టుపార్టీ. ప్రచారం-పరమార్థం అనే యీపుస్తకంలో తెలుపబడినది, కమ్యూనిజం పుట్టుక, దాని యభివృద్ధి, పతనంమొదలైన విషయాలు ఆమూలాగ్రంగా వివరింప బడినవి.

విద్యార్థివాణి

సంపాదకుడు— కె. యం. నరసింహారావు

ఏ రాజకీయ పార్టీలతోను సంబంధములేకుండా విద్యా ర్థులయొక్క పురోభివృద్ధికి పాటుపడుటయే పరమార్థ ముగా పెట్టుకొన్న 'విద్యార్థివాణి' అను మాసపత్రిక ప్రతి విద్యార్థి చదివి తన ఆదర్శములను, కోరికలను యీ పత్రిక ద్వారా వెల్లడించి దేశసేవకు పాటు పడుదురని యాశించు చున్నాము.

కచేరీచావడి

ఆంధ్ర మహిళలో మగవారికోసము కచేరీ చావడి యుండగలదు.

కచేరీ చావడి కబుర్లు ప్రత్యేకంగా పురుషులకే—

వారి అలవాట్లు! వారి పాట్లు!!
వారి సమస్యలు! వారికి సలహాలు!!
వారి హక్కులు! వారి ధర్మములు!!

రాజకీయ వేత్తల గుసగుసలు, — సంఘ సంస్కర్తల సమస్యలు,
పట్టణ వాసపువారి పోకళ్ళు, — గ్రామస్థుల గ్రహపాట్లు.

(ఈ శీర్షికకు తమతమ రచనలను పంపగోరుచున్నాము)

గమనిక

'ఆంధ్ర మహిళ' స్త్రీల సచిత్ర మాస పత్రిక. ఆంధ్ర లోకంతో సన్నిహితానుబంధం ఏర్పరచుకొని, మహిళా సంఘంలో నూతన ప్రబోధం కలిగించే ఆశయంతో ఆంధ్ర మహిళా సభ తరపున "ఆంధ్ర మహిళ" పత్రిక 11 సం॥రములనుండి ప్రకాశితమగుచున్నది.

దీనియందు స్త్రీల మనోవికాసానికి తోడ్పడే వ్యాసములు, కథలు, నాటికలు, పిల్లలకు బాలానందం మొదలగు గద్య పద్యాత్మకములైన పలురకముల రచనలున్నవి. సాంఘిక రాజకీయ విషయములు, ప్రభుత్వము వారు దేశాభివృద్ధికై జరుపుచున్న సంక్షేమ కార్యక్రమాలు, స్త్రీలకుపయుక్తమైన గృహ పరిశ్రమలు మున్నగు వానిని గూర్చి మాసమాసము ఇందు ప్రకటింపబడును.

వార్షిక సంచిక, తపాలా, ఖర్చులతోసహా

సంవత్సర చందా 6-0-0

సేవాసంస్థలకు, గ్రంథాలయములకు, కళాశాల, పాఠశాలలకు,

సంవత్సర చందా రూ. 3-0-0 మాత్రమే.

"ఇదివరలో రు 4–8–0 యిచ్చియున్న వారికి వారిఖాతాను రు 1–8–0 జమకట్టబడును"

వివరములకు:

మేనేజరు
ఆంధ్ర మహిళ'

ఆంధ్ర మహిళా సభ,
24-ఎ, లజ్ చర్చిరోడ్డు, మైలాపూర్, మద్రాసు.

"To train women workers and harness their services in the building up of the future of our Nation and Womanhood"

జూన్ 1955

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
•	•	•	1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	29	30	•	•

1. కూర్మజయంతి. 8. మృగశిరకార్తె. 20. సూర్యగ్రహణం. 30. తొలైకాదశి.

ANDHRA MAHILA SABHA

MYLAPORE : MADRAS 4.

Edited by Mrs. K. Lakshmi Raghuram, B.A.,
Printed & Published by Mrs. A. C. Krishna Rao, M.A., L.T.,